
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002



# జనంసాక్షి

www.janamsakshi.org

03.04.2026 శుక్రవారం | సంపుటి : 12 సంచిక : 254 | పేజీలు : 12 వెల : రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Karimnagar & Hyderabad. | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## మోడీ కరుణ కాదు...
# కేంద్ర నిధులు ప్రజల జన్మహక్కు...

### మోడీ-పినరయి-కేసీఆర్ మధ్య పోలికలు స్పష్టం

- గ్యారంటీలపై సందేహాలుంటే తెలంగాణకు రండి
- యూడీఎఫ్ మేనిఫెస్టోలో తెలంగాణ మోడల్ హామీలు
- కేరళలో కాంగ్రెస్ విజయం ఖాయం: రేవంత్

**కొచ్చి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**
కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ నేతృత్వం లోని యూడీఎఫ్ మేనిఫెస్టోను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కొచ్చిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయ న కేరళ సీఎం పినరాయి విజయన్, మాజీ సీఎం కేసీఆర్, ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారంటీలు అమలు సాధ్యం కావని విమర్శించే వారు తెలంగాణకు వచ్చి చూడాలని ఆయన బహిరంగ సవాల్ విసిరారు. కేరళ సీఎం పినరాయి విజయన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనలో అనేక పోలికలు ఉన్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఇద్దరూ అవినీతి, కుటుంబ పాలనలో ఆరితేరారని ఎద్దేవా చేశారు. "దేశాన్ని మోదీ పాలిస్తుంటే.. కేరళను విజయన్ పాలిస్తున్నారు. వీరిద్దరూ 'మోదీ బ్రదర్స్' లాంటి వారు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో కేసీఆర్ పాలన ఎలాగైతే అంతమైందో, కేరళలో కూడా పినరాయి పాలన ముగిసి యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

**తెలంగాణే మా ట్రాక్ రికార్డు..**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మిగితా 2లో

### ఫ్యూచర్ సిటీ భవన సముదాయాల నిర్మాణ పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించిన భవన సముదాయాల నిర్మాణ పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ అథారిటీ భవన నిర్మాణ పనులతో పాటు ఆ ప్రాంత రూపకల్పనలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే, స్కిల్స్ యూనివర్సిటీకి చెందిన పలు భవనాలను పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఆధార్‌లాగే ప్రతి సర్వే నెంబర్‌కూ
# "భూదార్"

### వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం

- 2వ దశలో 45రోజుల తర్వాత జిల్లాకో మండలంలో సమీకృత భూభారతి
- ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఆమనగల్ మండలం విఠాయిపల్లిలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లాంఛనంగా ప్రారంభం

**రంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**
రాష్ట్రంలో భూమి సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ నంబర్ లాగా 'భూధార్' నంబర్ కేటాయించి, వీలైనంత త్వరగా సాదాబైనామా దరఖాస్తులకు పరిష్కారం చేయనున్నట్లు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం విఠాయిపల్లి గ్రామంలో జరిగిన వార్డు సభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరీక్షించి, అవసరమైన మార్పులు, చేర్పులతో రెండవ దశలో జిల్లాకు ఒక మండలంలో అమలు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో మిగితా 2లో

**ప్రయోగాత్మక అమలు**
ప్రస్తుతం ఆమనగల్ (రంగారెడ్డి), కుసుమంచి (ఖమ్మం), అశ్వరావుపేట (భద్రాద్రి కొత్తగూడెం), వట్‌పల్లి (సంగారెడ్డి), కొస్గి (నారాయణపేట) మండలాల్లో ఈ పోర్టల్ ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. "ఏ పేదోడు ఏ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఏ అధికారి దగ్గరికి వెళ్లి ప్రార్థించాల్సిన అవసరం లేదు. తన చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌తో భూభారతి పోర్టల్‌లో లాగిన్ అయితే అన్ని సేవలు లభిస్తాయి" అని స్పష్టం చేశారు.

## అమరావతికి ఆమోదముద్ర

### రాజ్యసభలోనూ ఏకగ్రీవం

- ఉభయ సభలు ఆమోదించిన బిల్లు రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
- రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల
- ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతి
- కూటమి ఎంపీలు, రైతుల్లో హర్షం.. 'జై అమరావతి' నినాదాలు



2

# రాజ్యసభలోనూ కాళేశ్వరం రగడ

### కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం

- ఐదు మండలాలపై ఆనాడు నోరు మెదపని కేసీఆర్
- అవినీతిపై కెసిఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**
రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. మిగితా 2లో



### కాళేశ్వరం ప్రాజెక్టుకు పైసా ఇవ్వకున్నా కట్టాం

- తెలంగాణకు 12 ఏళ్లుగా సాయం చేయని కేంద్రం
- రాజ్యసభలో సురేశ్ రెడ్డి, వద్దిరాజు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**
రాజధాని అమరావతికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. అమరావతి బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అని అన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు రుణాలతో కాళేశ్వరం కట్టామని వివరించారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా మిగితా 2లో

## పార్లమెంట్ సాక్షిగా అబద్ధాలు

- ఏడు మండలాల అప్పగింత బిజెపి పుణ్యమే
- వికృతత్వాన్ని బయట పెట్టుకున్న కిషన్ రెడ్డి
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు



2

## రేణుక నోట 'ఆంధ్ర' పాట

### గెలిచింది తెలంగాణలో.. సభలో 'బాబు' మాట

**అమరావతి రైతుల విజయమని వ్యాఖ్య**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**
అమరావతికి చట్టబద్ధత బిల్లు రాజ్యసభలో ప్రవేశపెట్టడం ఆ ప్రాంత రైతుల విజయమని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి అన్నారు. 'ఏపీ రాజధానిపై 12 ఏళ్లుగా అస్పష్టత ఉంది. దీంతో పెట్టుబడులు వెనక్కి వెళ్లాయి. గత సీఎం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదు. 12 ఏళ్ల తర్వాత కూడా ఆస్తుల పంపకం పూర్తికాలేదు. కేంద్రం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందే. ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలి. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలి" అని రేణుకా చౌదరి కోరారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై రాజ్యసభలో వాడివేడిగా చర్చ జరిగింది. గురువారం నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో మిగితా 2లో

**గ్రూప్ 1 అభ్యర్థులకు శుభవార్త**

## నియామకాల్లో జోక్యం చేసుకోలేం..

- సుప్రీం కోర్టు స్పష్టీకరణ
- అభ్యర్థుల పిటిషన్‌ను డిస్మిస్ చేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**
ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూప్-1 అభ్యర్థుల పిటిషను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఇంతకుముందు హైకోర్టు ను ఆశ్రయించారు. మూల్యాంకనంలో తప్పులున్నాయని, నోటిఫికేషన్ రద్దు చేసి.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు. విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్.. గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కనిపించలేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టు లో పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని కోర్టుకు వివరించారు. మూడుసార్లు మిగితా 2లో



### సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం

- 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానంలో నిలపాలన్నది సీఎం ధ్యేయం
- సంక్షేమ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, ఇళ్లు, మహిళా సాధికారతపై దృష్టి
- తుమ్మలూరు గ్రామసభలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

2

## చేనేత కార్మికుల పొట్టగొడుతుండ్రు

- కమీషన్ల కోసమే టెస్కోకు ఆర్డర్లు రద్దు
- ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై కేటీఆర్ విమర్శలు



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**
ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థల కు వత్తాసు పలకడమేనా ప్రజా పాలనా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ సర్కార్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు ఇచ్చి చేనేత సంఘాల కార్మికుల పొట్ట కొడుతుందని, ఇది ప్రజా ప్రభుత్వ మా.. లేక 'ప్రైవేట్' లిమిటెడ్ కంపెనీయా..? అని మండిపడ్డారు. రూ. 105 కోట్ల విలువ గల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. సంక్షేమ శాఖ నుండి టెస్కోకు దక్కాల్సిన రూ. 200 కోట్ల దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇంకా ఇవ్వకపోవడం వెనుక కారణం ఏంటి..? అని అడిగారు. కాంగ్రెస్ దండుపాళ్యం ముఠా కమీషన్లు దండుకోవాలనే యావలో ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు ఇస్తున్నదని ధ్వజమెత్తారు. నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

## మౌంట్ ఎవరెస్ట్ ట్రెక్కింగ్ రెస్క్యూ స్కామ్

### పక్కా ప్లాన్‌తో భీమా సంస్థల నుంచి 186 కోట్లు కుల్లగొట్టిన దుండగులు

- ఎవరెస్ట్ పర్వతారోహకుల ఆహారంలో బేకింగ్ సోడా కలిపి మోసం
- ట్రెక్కర్లను జీర్ణ సమస్యలతో బాధపెట్టి హెలికాప్టర్ సేవలు, బీమా సొమ్ము లక్ష్యం
- షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, ఆసుపత్రులు ఒక ముఠాగా ఏర్పడ్డ వైనం
- 32 మందిని అరెస్టు - ఎవరెస్ట్ ఇన్సూరెన్స్ నిలిపివేసిన బీమా సంస్థలు

2



## యుద్ధం ఆపేది లేదు

- అమెరికా-ఇజ్రాయెల్‌కు ఇరాన్ హెచ్చరిక
- అమెరికా బెదిరింపులకు లొంగబోమని స్పష్టం
- ట్రంప్ ప్రకటనలకు ధీటుగా ఇరాన్ సైన్యం స్పందన
- భారత మిత్రులు సురక్షితంగానే ఉన్నారు - ఇరాన్ ఎంబసీ
- హార్ముజ్ భవిష్యత్తు ఇరాన్, ఒమన్‌లు మాత్రమే నిర్ణయిస్తాయి



2



## మోడీ కరుణ కాదు..
# కేంద్ర నిధులు ప్రజల జన్మహక్కు

మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతం గా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ -2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# కెసిఆర్ ఇష్టానుసారం కాళేశ్వరం నిర్మాణం

కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్పై విచారణ జరిపి కేసీఆర్ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్రెడ్డి అన్నారు.

# సమస్యలు తెలుసుకోవడమే గ్రామసభల లక్ష్యం

**రంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గ్రామసభలు విజయవంతంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు రంగారెడ్డి జిల్లా మాహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సభలో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ, 2047 విజన్తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశం అన్నారు. "మనమందరం ఈ ప్రగతి పాలనలో భాగస్వాములం కావాలి" అని పిలుపునిచ్చారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభల ముఖ్య ఉద్దేశమని సీఎస్ స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్ని హాస్టళ్లు, స్కూళ్లలో డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచడం ద్వారా పేద విద్యార్థులకు మెరుగైన ఆహారం, వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళా సాధికారత కోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు సీఎస్ తెలిపారు. ఈ సభలో కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామసభలు గ్రామాల అభివృద్ధికి మైలురాయి అవుతాయని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. ప్రజలు తమ సమస్యలను గ్రామసభల్లో స్వేచ్ఛగా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వాటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటోంది.

## గ్రూప్ 1 అభ్యర్థులకు శుభవార్త
# నియామకాల్లో జోక్యం చేసుకోలేం..

మూల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్ను డిస్మిస్ చేసింది.

# రేణుక నోట 'ఆంధ్ర' మాట

బిల్లుపై ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పెట్టరా పేరు అమరావతి.. పిలవరా కమరావతి అని, గతంలోనే మాజీ సీఎం జగన్కు చెప్పానని అన్నారు. 12ఏళ్ళ తర్వాత ఈ బిల్లు సభకు రావడం బాధాకర మని.. పాలసీ పెరలాసిస్ కారణంగా ఏపీ 12 ఏళ్ళు నష్టపోయిందని అన్నారు. ఇది అమరా వతి రైతుల విజయమని..ఎంత వేధించినా రైతుల నిరసన ఆగలేదని అన్నారు. అమరావ తికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని రేణుక చౌదరి అన్నారు. తెలంగాణకు ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టుకోలేదని..రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కూడా ఇవ్వలేదని అన్నారు . రాజకీయ అవసరాల కోసమే ఏపీకి విభజన హామీలు అమలు చేస్తున్నారని.. తెలంగాణకు మాత్రం మొండి చెయ్యి చూపిస్తున్నారని అన్నారు.

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా? : కవిత

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# కాళేశ్వరం పేరుతో ప్రజాధనం లూటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగాయన్నారు. కాళేశ్వరం వల్ల ఉగయోగం లేదని నివేదికలు చెప్పాయని తెలిపారు. కాళేశ్వరం ప్రజల డబ్బుతో కట్టారా? లేక కేసీఆర్ సొంత డబ్బుతో కట్టారా అంటూ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని నిలదీశారు. వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి నిధులు తీసుకొని కాళేశ్వరం నిర్మించారని కేంద్ర మంత్రి తెలిపారు. భద్రాచలంలో ఉన్న గ్రామాలు ఏపీ పునర్విభజన చట్టంలో చేర్చారని... అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని అడిగారు. ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్ట్పై విచారణ జరిపి కేసీఆర్ను జైలుకు పంపిస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మాజీ సీఎంపై ఎందుకు విచారణ జరపలేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిలదీశారు. ఈ క్రమంలో కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే,



సురేశ్రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు.కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారని కిషన్రెడ్డి అన్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుకు పైసా ఇవ్వకున్నా కట్టాం

కాళేశ్వరం నిర్మించామని చెప్పుకొ చ్చారు. కాళేశ్వరంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చలేదని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి మాట్లాడుతూ.. అమరావతికి గతంలోనే కేసీఆర్ మద్దతు తెలిపారన్నారు. అమరుల త్యాగాలతో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. దేశంలోనే తెలంగాణను నెంబర్వన్గా నిలబెట్టామన్నారు. ప్రాంతాల వారీగా వేరైనా అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారని వెల్లడించారు. కనీసం చర్చ లేకుండా 7 మండలాలను ఏపీలో కలిపారని.. విభజన తీరుపై బీజేపీ తరచూ విమర్శలు చేస్తోందని అన్నారు. తల్లిని చంపి బిడ్డను తీశారన్నట్లు మాట్లాడారని సురేశ్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం అంటే ఒక డ్యాం.. ప్రాజెక్ట్ మాత్రమే కాదని ఎంపీ అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరం అని తెలిపారు. పైసా ఇవ్వకపోయినా కాళేశ్వరం కట్టామన్నారు. అయినా కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ రూ.లక్ష కోట్లు పోయాయని మాట్లాడారని చెప్పారు. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని.. తెలంగాణ ప్రజలకు కేంద్ర మంత్రి పాటిల్ క్షమాపణ చెప్పాలని ఎంపీ సురేశ్ రెడ్డి డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో కూలిన రెండు పిల్లర్లను 300 కోట్లతో బాగు చేయవచ్చన్నారు. కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్రెడ్డి అన్నారు. ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## పార్లమెంట్ సాక్షిగా అబద్దాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. రాజ్యసభలో కిషన్ రెడ్డి పచ్చి అబద్దాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని ఆరోపించారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు.. తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహమని అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బీజేపీ ప్రభుత్వమేనని విమర్శించారు. కాళేశ్వరం పై రేవంత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని వల్లెవేస్తూ పార్లమెంట్లో విషం కక్కుతారా? నాడు కాళేశ్వరంపై ప్రశంసలు కురిపించి, నేడు రాజకీయ లబ్ది కోసం అబద్దాలా? తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తూ.. తెలంగాణ గొంతు కోస్తారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాపంలో కిషన్ రెడ్డికి కూడా పాత్ర ఉందని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని వెల్లడించారు. కాళేశ్వరంపై రేవంత్ రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్ రెడ్డి పార్లమెంట్లో చేయడం కాంగ్రెస్, బిజేపీ చీకటి పొత్తుకు సాక్ష్యమని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతి పెద్ద బహుళ దశల ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరం నిర్మించడం అబద్దమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్దమా? . మండుటెండల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాల్వల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్దమా? ఏది అబద్దం కిషన్ రెడ్డి? అంటు నిలదీశారు. పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. వచ్చేందుకు మీకు దమ్ముందా? అంటూ సవాల్ విసిరారు.

# యుద్ధం ఆపేది లేదు

**న్యూఢిల్లీ/టెహ్రాన్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** అమెరికా, ఇజ్రాయెల్లకు ఇరాన్ భారీ హెచ్చరిక జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ యుద్ధాన్ని ఆపేది లేదని, అమెరికా బెదిరింపులకు లొంగబోమని స్పష్టం చేసింది.

ఇండియాలోని ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియా వేదికగా ఈ హెచ్చరికను విడుదల చేసింది. "మేం అమెరికా బాంబుల కారణంగా రాతియుగంలోకి వెళ్లడం లేదు. మాకు 7,000 ఏళ్ల నాగరిక చరిత్ర ఉంది. చరిత్రకు ఈ విషయం తెలుసు. అమాయకులైన పిల్లల్ని చంపి, అమానవీయ నేరాలు చేస్తున్న మీరు రాతియుగాన్ని ఆధునిక ప్రపంచంలోకి తెచ్చారు అనేది స్పష్టం" అని ఎంబసీ ట్వీట్ చేసింది.

**ట్రంప్ ప్రకటనకు ధీటుగా స్పందన**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి ఇరాన్పై చేస్తున్న యుద్ధం కారణంగా ఆ దేశం రాతియుగంలోకి వెళ్తుందని ప్రకటించారు. ఇరాన్ సైన్యం, నేవీ పూర్తిగా బలహీనపడిపోయాయని, యుద్ధాన్ని రెండు-మూడు వారాల్లో ముగిస్తామని చెప్పారు.

అయితే ఇరాన్ మిలిటరీ ట్రంప్ ప్రకటనకు ధీటుగా స్పందించింది. "అమెరికాకు తీవ్ర అవమానం జరిగే వరకు యుద్ధాన్ని వదలేది లేదు. అమెరికా పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు మా దాడులు కొనసాగుతాయి" అని ఇరాన్ సైనిక ప్రతినిధి స్పష్టం చేశారు. అమెరికా తమను తక్కువగా అంచనా వేసిందని, తమ దగ్గరున్న సైనిక శక్తి, మిస్సైళ్ల తయారీ గురించి అమెరికా ఇంటెలిజెన్స్కు సరిగ్గా తెలియదన్నారు.



**భారత మిత్రులు సురక్షితం**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ భారత్లోని ఇరాన్ రాయబార కార్యాలయం కీలక వ్యాఖ్యలు చేసింది. "భారత మిత్రులు సురక్షితంగానే ఉన్నారు. ఎటువంటి ఆందోళన అవసరం లేదు" అని 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. అంతకుముందు హర్మూజ్ జలసంధి భవిష్యత్తును ఇరాన్, ఒమన్లు మాత్రమే నిర్ణయిస్తాయని దక్షిణాఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ తెలిపింది. దక్షిణాఫ్రికా పౌరులు సురక్షితమేనని పేర్కొంటూ చేసిన పోస్టుకు భారత్లోని ఇరాన్ ఎంబసీ స్పందించింది. ఇరాన్ యొక్క ఈ దీటుగా స్పందన యుద్ధ ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ ప్రకటనలు మరియు ఇరాన్ హెచ్చరికల మధ్య యుద్ధం ఎంతకాలం కొనసాగుతుందనేది ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

## బసిరెడ్డిపల్లిలో ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య

**చంపి చెరువు కట్టపై పడేసిన దుర్మార్గులు**

**నారాయణపేట:** జిల్లాలోని బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. కేవలం ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. డెడ్ బాడీని చెరువు కట్టపై పడేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. చిన్నారి డెడ్ బాడీని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నారాయణపేట జిల్లా బసిరెడ్డిపల్లికి చెందిన అంజి, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్లో ఉంటున్నారు. వారి వెంట బాబును తీసుకెళ్లారు. ఐతే కూతుర్ని మాత్రం వారి తల్లిదండ్రుల దగ్గర ఉంచేశారు. గ్రామస్థుల సహాయం తో గ్రామంలో వెతుకగా చెరువు కట్టపై చిన్నారి విగతజీవిగా పడి ఉంది. అది చూసిన గ్రామ స్తులు హుటాహుటిన నారాయణపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పోలీసు జాగిలాలతో సంఘటన స్థలాన్ని పరీక్షించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హైదరాబాద్కు తరలించారు.

# ఆధార్లాగే ప్రతి సర్వే నెంబర్కూ "భూదార్"

పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, ప్రతి సర్వే నంబర్కు భూధార్ నంబర్ కేటాయించనున్నారు.

**ధరణి సమస్యలకు ఊరట**

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి వ్యవస్థ కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులు దిక్కులేకుండా పోయాయని, ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వెల్లడించారు. సాగు చేస్తూ వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టా ఖరారు చేస్తామని, దీనికోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని తెలిపారు.

గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాల్టీగా మారిన ప్రాంతాలకు కూడా సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు.

**కీలక సంస్కరణలు**

రాష్ట్రంలో 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది. 5,300 మందికి రెండు విడతల్లో ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి, మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్డ్ సర్వేయర్లను



నియమించామని మంత్రి తెలిపారు. సర్వే విషయంలో పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఇప్పటికే 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామని, త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమనగల్ నియోజకవర్గ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయ భవనాలకు త్వరలో తాను శంకుస్థాపన చేస్తానని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# మౌంట్ ఎవరెస్ట్ ట్రెక్కింగ్ రెస్క్యూ స్కామ్

- పక్కా ప్లాన్తో భీమా సంస్థలనుంచి 186 కోట్లు దండుకున్న దుండగులు
- ఎవరెస్ట్ పర్వతారోహకుల ఆహారంలో బేకింగ్ సోడా కలిపి మోసం
- ట్రెక్కర్లను జీర్ణ సమస్యలతో బాధపెట్టి హెలికాప్టర్ సేవలు, బీమా సొమ్ము లక్ష్యం
- షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, ఆసుపత్రులు ఒక ముఠాగా ఎర్పడ్డ వైనం
- 32 మందిని అరెస్టు - ఎవరెస్ట్ ఇన్సూరెన్స్ నిలిపివేసిన బీమా సంస్థలు



**కాఠ్మండు, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ప్రపంచంలోనే ఎత్తయిన శిఖరం మౌంట్ ఎవరెస్ట్పై ట్రెక్కింగ్ చేసే పర్వతారోహకుల ఆహారంలో బేకింగ్ సోడా మోతాదును రహస్యంగా పెంచి మోసం చేస్తున్నారని నేపాల్ పోలీసులు సంచలన ఆరోపణలు చేశారు. ఒక నెట్వర్క్ ఏర్పడి ట్రెక్కర్లను ఉద్దేశపూర్వకంగా జీర్ణకోశ సమస్యలకు గురి చేసి, అత్యవసర పరిస్థితి సృష్టించి హెలికాప్టర్ సేవలు, బీమా సొమ్ము లాగుతున్నారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. షెర్పాలు, ట్రెక్కింగ్ ఏజెన్సీలు, ఆసుపత్రులు, హెలికాప్టర్ కంపెనీలు కలిసి ఈ కుట్రలో భాగస్వాములవుతున్నారని పోలీసులు ఆరోపించారు. ట్రెక్కర్లు తీసుకునే ఆహారంలో బేకింగ్ సోడా మోతాదును అధికంగా కలుపుతున్నారు. దీంతో వారు జీర్ణ సమస్యలకు గురవుతున్నారు. ఎత్తు కారణంగా ఇలాంటి సమస్యలు వస్తాయని నమ్మించి, అత్యవసరంగా హెలికాప్టర్లో ఆసుపత్రికి తరలించి భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారు. నకిలీ వైద్య పత్రాలు, ఫ్లైట్ డాక్యుమెంట్లు చూపించి బీమా సంస్థల నుంచి డబ్బు పొందుతున్నారు. ఈ మోసం విలువ సుమారు 20 మిలియన్ డాలర్లు (సుమారు రూ.186 కోట్లు) అని అంచనా వేశారు.

**32 మంది అరెస్టు**

ఈ ఏడాది జనవరిలో పర్వత సహాయక చర్యల సంస్థలకు చెందిన ఆరుగురు ఎగ్జిక్యూటివ్లను అరెస్టు చేసిన తర్వాత ఈ స్కామ్ గురించి వెలుగులోకి వచ్చింది. ఇప్పటివరకు 32 మందిని నేపాల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెట్వర్క్లో భాగమైన వారికి భారీ స్థాయిలో జరిమానా విధించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

ఎవరెస్ట్ ట్రెక్కింగ్ నేపాల్ పర్యాటకంలో అతి కీలకమైన అంశం. ఇలాంటి మోసాల కారణంగా అంతర్జాతీయ బీమా సంస్థలు ఎవరెస్ట్ విజిటర్లకు ఇన్సూరెన్స్ కవరేజ్ ఇవ్వడం నిలిపివేశాయి. నేపాల్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కఠిన శిక్షలు లేకపోవడం వల్ల ఇలాంటి నేరాలు పెరుగుతున్నాయని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఈ సంచలన ఘటన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎవరెస్ట్ ట్రెక్కింగ్ను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని, పర్యాటక రంగం మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. నేపాల్ న్యాయస్థానం ఈ కేసును తీవ్రంగా పరిగణించి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

# అమరావతికి ఆమోదముద్ర
## రాజ్యసభలోనూ ఏకగ్రీవం

**ఉభయ సభలు ఆమోదించిన బిల్లు రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం**

**రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల**

**ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతి**

**కూటమి ఎంపీలు, రైతుల్లో హర్షం.. 'జై అమరావతి' నినాదాలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. రాజ్యసభలో గురువారం ఈ బిల్లు ఆమోదం పొందడంతో, అమరావతి ఏపీ ఏకైక రాజధానిగా అధికారికంగా అమలులోకి రానుంది. ఈ బిల్లు ('ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు') రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. ఇప్పటికే లోక్సభలో కూడా ఈ బిల్లు ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఉభయ సభల ఆమోదం తర్వాత ఈ బిల్లును కేంద్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం కోసం పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. బిల్లు ఆమోదం తర్వాత రాజ్యసభ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇస్తూ, "ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయింది" అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు.

రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, మంత్రి నారా లోకేష్తోపాటు కూటమి ఎంపీలు ఆనందం వ్యక్తం చేశారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహం చేశారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని అభినందించారు. లోక్సభ స్పీకర్ ఓం బిర్లాను కూడా కలిసి ధన్యవాదాలు తెలిపారు.



అమరావతి రాజధాని బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేశారు. మోకాళ్లపై నిలబడి పార్లమెంట్లో మద్దతు తెలిపిన పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆ ప్రాంతంలో సంబరాలు మిన్నంటాయి.

రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు తెలిపాయి. 11 పార్టీలు చర్చలో పాల్గొనగా, 17 మంది సభ్యులు మాట్లాడారు. అయితే వైసీపీ మాత్రం ఈ బిల్లును వ్యతిరేకించింది. ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాల చర్చ తర్వాత ఈ బిల్లును ప్రభుత్వం పాస్ చేసిన సంగతి తెలిసిందే. ఉభయ సభల ఆమోదం తర్వాత ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అధికారికంగా అమలులోకి రానుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

# పరిశ్రమ వ్యర్థాలపై నిర్లక్ష్యం సహించం

## అధికారులపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం



హైదరాబాద్ (జనంసాక్షి) : జడ్చర్ల నియోజకవర్గంలోని పోలేపల్లి ప్రాంతంలో పరిశ్రమల వ్యర్థాలను లెదర్ పార్క్ భూముల్లో అక్రమంగా పారబోస్తున్న ఘటనపై రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించకపోవడం దురదృష్టకరమని మంత్రి మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల ఫిర్యాదులకే స్పందించని అధికారులు సాధారణ ప్రజల సమస్యలను ఎలా పరిష్కరిస్తారో సమాధానం చెప్పాలన్నారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి, పరిస్థితిపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం సచివాలయంలో జరిగే ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అలాగే రెడ్ జోన్ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు కూడా పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు, పరిశ్రమల వ్యర్థాల నిర్వహణలో కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ సమావేశంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు.

# గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలి

- అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలి
- అన్ని రంగాలలో మహిళలకు పెద్దపీట
- ప్రతి మహిళను మహిళా సంఘాలలో చేర్పించాలి
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ములుగు బ్యూరో,ఏప్రిల్02(జనం సాక్షి): గ్రామాల అభివృద్ధిలో గ్రామంలోని ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలని, ప్రతి మహిళను మహిళా సంఘాలలో చేర్పించడానికి కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా,మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కఅన్నారు.గురువారం ములుగు మున్సిపాలిటీలోని ఆరవ వార్డు లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం మున్సిపల్ చైర్మన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి అధ్యక్షతన జరిగినది.ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొని మాట్లాడుతూ మండల,జిల్లా,రాష్ట్రస్థాయిలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సందర్భంగా గత రెండు సంవత్సరాలలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ప్రజల సమస్యలను తీర్చేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. నూతనంగా ఏర్పడిన ములుగు మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడానికి కోటి 25 లక్షల రూపాయలతో ప్రత్యేక వాహనాలను కొనుగోలు చేయడమే కాకుండా 50 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులను ఈనెల 15 నుండి ప్రారంభించడం జరుగుతుందని వివరించారు.పారిశుద్ధ్య కార్మికులు నిత్యం పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టడం హర్షించదగ్గ విషయమని,వారి వేతనాల పెంపు కోసం ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతున్నదని తెలిపారు. అన్ని రంగాలలో మహిళలు ప్రాతినిధ్యం వహించేందుకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నామని,జిల్లా వ్యాప్తంగా మహిళా సంఘాల వారికి 57 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరిగిందని,మరో 43 వేల కోట్ల రూపాయల రుణాలను అందించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు,పలు రకాల పెన్షన్లు పొందని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతి కుటుంబంలోని మహిళ సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు.మహిళా సంఘాల సభ్యురాలకు వైద్య పరీక్షలు నిర్వహించడం కోసం ఒక్కొక్క మహిళకు 5 వేల నుండి పదివేల రూపాయల విలువ గల వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి సంఘ సభ్యురాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంఘంలోని సభ్యురాలు రుణాలు పొంది మరణించిన పక్షంలో రెండు లక్షల రూపాయల రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తున్నదని, ఇప్పటివరకు 41 కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేయడం జరిగిందని వివరించారు. బ్యాంకు తరహాలోనే స్త్రీ నిధి, సర్ఫ్ సంస్థలు పనిచేస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,జిల్లా గ్రంథాలయం చైర్మన్ బానోతు రవిచందర్,మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, కౌన్సిలర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# డోర్నకల్ - గద్వాల కొత్త రైల్వే లైన్ కోసం పాదయాత్ర చేస్తా

- నాగర్ కర్నూల్ వెనకబడ్డ ప్రాంతం.. రైల్వే నెట్‌వర్క్ ఎంతో అవసరం..
- కల్వకుర్తి -మాచర్ల రైల్వే లైన్.. అభివృద్ధికి లైఫ్ లైన్ : ఎంపీ మల్లు రవి



న్యూఢిల్లీ (జనంసాక్షి) : డోర్నకల్ – గద్వాల కొత్త రైల్వే లైన్ కోసం పాదయాత్ర చేస్తానని.. నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లు రవి ప్రకటించారు. నాగర్ కర్నూల్ వెనకబడ్డ ప్రాంతం అని.. రైల్వే నెట్‌వర్క్ ఎంతో అవసరం ఉందని వ్యాఖ్యానించారు. కల్వకుర్తి –మాచర్ల రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే.. రెండు తెలుగు రాష్ట్రాలకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీ మల్లు రవి విలేఖరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కీలక కామెంట్స్ చేశారు. 'నేను మూడోసారి ఎంపీ అయిన తర్వాత.. డోర్నకల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే లైన్ గురించి ప్రతి పార్లమెంట్ సెషన్‌లో మాట్లాడా. రైల్వే మంత్రికి విజ్ఞప్తులు చేశా. మన ముఖ్యమంత్రి ద్వారా రైల్వే మంత్రికి లేఖ రాయించా. ఇలా అనేకసార్లు జరిగాయి. ఇటీవల కూడా రైల్వే మంత్రిని వారి కార్యాలయంలో కలిశాం. డోర్నకల్–గద్వాల్ రైల్వే లైన్ గురించి గుర్తుచేశా. ఈ లైన్ నాగర్ కర్నూలు జిల్లాకి లైఫ్ లైన్ లాంటిదని వివరించా. ఈ లైన్ రావడం వల్ల నాగర్ కర్నూల్ పార్లమెంటు రైల్వే నెట్వర్క్‌తో కనెక్ట్ అవుతుంది. అభివృద్ధి చెందుతుంది. ఈ లైన్ నాగర్ కర్నూల్ పార్లమెంట్‌లోని కల్వకుర్తికి వచ్చి.. ఆ తర్వాత వనపర్తి నుంచి గద్వాలకి కనెక్ట్ అవుతుంది. గురువారమూ రైల్వే బోర్డ్ డైరెక్టర్ అభిషేక్‌ను కలిసి.. ఈ రైల్వే లైన్ కోసం సర్వే చేసిన మ్యాప్ ని, సౌత్ సెంట్రల్ రైల్వే రైల్వే బోర్డు పంపించిన డీపీఆర్‌ను తీసుకున్నాను. వారం, పది రోజుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ట్రాఫిక్) ఇంకా మిగిలిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ అందరూ మీటింగ్ పెట్టి.. పూర్తిస్థాయి డీపీఆర్ సిద్ధం చేసి.. క్యాబినెట్‌కు పంపించే ప్రక్రియను మొదలు పెడతామని రైల్వే బోర్డు డైరెక్టర్ చెప్పారు. రైల్వే శాఖ మంత్రి, డైరెక్టర్, చైర్మన్ అందరితోనూ నేను ఒకటి రిక్వెస్ట్ చేశాను.. ఈ రైల్వే లైన్ ని బ్యాక్వర్డ్ ఏరియా డెవలప్మెంట్ రాయల్ ప్లాంట్ కింద తీసుకోవాలని విజ్ఞప్తి చేశా. జనరల్ రాయల్ ప్లాన్ కింద తీసుకుంటే.. మళ్లీ దానికి రెవెన్యూ రిటర్న్స్ లేవనే ఇబ్బందులు వస్తాయి. త్వరలోనే ఇరువీన్ గ్రామం నుంచి పాదయాత్ర మొదలుపెట్టి.. శ్రీరామ్ నగర్ వరకు ప్రతిపాదిత రైల్వే లైన్ మార్గంలో కొనసాగిస్తాను. ఈ రైల్వే లైన్‌ను వీలైనంత త్వరగా ప్రారంభించి, పూర్తి చేయాలని రైల్వే మంత్రిత్వ శాఖ పై ఒత్తిడి తేవడానికే పాదయాత్ర చేయబోతున్నాం. కల్వకుర్తి, వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల ఎమ్మెల్యేలతో, స్థానిక నాయకులతో, ప్రజలతో కలిసి త్వరలోనే పాదయాత్రను ప్రారంభించబోతున్న' అని తెలిపారు.

# ఘన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక ఒడిశా

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



హైదరాబాద్, ఏప్రిల్ 02 (జనంసాక్షి) : ఒడిశా రాష్ట్రం ఘన సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. లోక్‌భవన్ దర్బార్ హాల్ లో గురువారం 'ఏక్ భారత్ – శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా ఒడిశా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఒడిశా ప్రజలు ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ఒడిశా భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిందన్నారు. పూరి జగన్నాథ స్వామి క్షేత్రం, రథయాత్ర మహోత్సవం ప్రపంచవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. ప్రాచీన కళింగ సామ్రాజ్య వైభవాన్ని ప్రస్తావిస్తూ, కళింగ భూమి ధైర్యం, పరాక్రమానికి ప్రతీక అని పేర్కొన్నారు. కళింగ యుద్ధం భారత చరిత్రలో కీలక మలుపు తిప్పిందని, ఆ తర్వాత అశోకుడు శాంతి మార్గాన్ని అవలంబించడం ద్వారా ప్రపంచానికి మానవతా సందేశం అందించాడని గుర్తుచేశారు. కోణార్క సూర్య దేవాలయం, చిలికా సరస్సు వంటి ప్రఖ్యాత ప్రదేశాలు ఒడిశా ప్రత్యేకతను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. ఒడిస్సీ నృత్యం, ఇకట్ వస్త్రాలు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు. ఒడిశా ప్రజల ఇతరులతో కలిసి పోయే గుణం, ఆతిథ్య స్వభావం ప్రశంసనీయమని గవర్నర్ అన్నారు. ఒడిశా రాష్ట్రం దేశ వికాసంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. గవర్నర్ సందేశం అనంతరం నిర్వహించిన ఒడిశా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గవర్నర్ గారి సతీమణి శ్రీమతి జానకి శుక్లా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, జైళ్ల శాఖ డీజీ (ప్రిజన్స్) సౌమ్య మిశ్రా, సంయుక్త కార్యదర్శి కె. శశికిరణాచారి, ఒడిశా ప్రతినిధులు, లోక్‌భవన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి

హైదరాబాద్, ఏప్రిల్2 (జనంసాక్షి) : మైలార్‌దేవ్‌పల్లిలో గంజాయి గ్యాంగ్ ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. స్థానికంగా ఉంటున్న వారి పట్ల ఈ గ్యాంగ్ అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు దాడులకు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేస్తోంది. తాజాగా మరోసారి రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్ ఓ యువకుడిపై విచాక్షణారహితంగా దాడి చేసింది. శాస్త్రీపురంలో ఫహద్ అనే యువకుడిపై కత్తులు, రాడ్స్‌తో దాడి చేసింది గంజాయి బ్యాచ్. తీవ్రంగా గాయపడిన ఫహద్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. అయితే యువకుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఫహద్‌పై ఈ గ్యాంగ్ దాడి చేసినట్లు తెలుస్తోంది.

# చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

- అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) : కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో వేలాది మందికి ఉపాధి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేతల ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కోకు ఆర్డర్లు ఇవ్వకుండా సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# 2047 విజన్‌తో దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ

- సిఎస్.రామకృష్ణ రావు
- సంక్షేమ పథకం ప్రతి అర్హుడికి చేరాలి : జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : 20047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అన్నారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి తో కలిసి మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు గ్రామ పరిధిలో ఏర్పాటుచేసిన గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు ప్రభుత్వం తీసుకున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మొదటగా వివిధ శాఖల అధికారుల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణమాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ పుస్తకాలు సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. అదే విధంగా నూతన పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇందిరమ్మ జీవిత కుటుంబ బీమా, మధ్యాహ్న భోజన పథకం – ఇంటర్మీడియట్ కు విస్తరణ, విభిన్న ప్రతిభావంత ఇంటర్మీడియట్ విద్యార్థులకు మోటారు వాహనాలు, పంటల వైవిధ్యం, సహజ సేంద్రీయ వ్యవసాయం పథకాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా వివిధ పథకాల లబ్ధిదారులు వారి అభిప్రాయాలను తెలియజేస్తూ ప్రజా ప్రభుత్వంలో నిరుపేద లైన తమకి వివిధ రకాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ప్రజల సమస్యలను సిఎస్. కలెక్టర్ నేరుగా అడిగి తెలుసుకున్నారు ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలను ఉద్దేశించి సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్ తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను లబ్ధిదారులకు సిఎస్ అందజేశారు. గ్రామసభ సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సిఎస్ కలెక్టర్ తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, జిల్లా అధికారులు శ్రీలత, సురేష్, వనజాత, శ్రీలక్ష్మి, లలితాదేవి, తాహసిల్దార్, ఎంపీడీవో, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు..

# పెళ్లి చేసుకున్న నెలకే నవ వధువు ఆత్మహత్య

- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నవవధువు ఆత్మహత్య కలకలం రేపుతోంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెల రోజులకే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని బలవన్మరణానికి పాల్పడింది. 2020లో సోషల్ మీడియా ద్వారా బీహార్‌కు చెందిన ఇషికా యాదవ్, మధ్యప్రదేశ్‌కు చెందిన నీరాజ్ బన్సల్‌కు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారడంతో ఫిబ్రవరి 20న పెద్దల సమక్షంలో ఇరువురూ వివాహం చేసుకున్నారు. మియాపూర్‌లోని మక్త మహబూబ్‌పేట్‌లోనీ ఓ అపార్ట్‌మెంట్‌లో ఇషిక, నీరజ్ నివాసముంటున్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తూ భార్యాభర్తలు ఇద్దరూ జీవనం సాగిస్తున్నారు. అయితే కొంతకాలంగా అదనపు కట్నం విషయంలో ఇరువురి మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. భర్త వేధింపులు తట్టుకోలేక తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఇషిక ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# దేవాలయాల్లో కృష్ణయాదవ్ పూజలు



హైదరాబాద్ (జనంసాక్షి) : హనుమాన్ జయంతి సందర్భంగా హైదరాబాద్లోని పలు దేవాలయాలను టిజిఓ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మన్యబోయిన కృష్ణ యాదవ్ సందర్శించారు. ఆ హనుమంతుని కృప కటాక్షాలు ప్రజలకు ఉద్యోగులకు అధికారులకు కలగాలని ఆ బజరంగబలిని కోరారు. ఆయన వెంట దండిగం రవీందర్ యాదవ్, ఎండోమెంట్ ఉద్యోగ సంఘ నాయకుడు కృష్ణమాచారి, తెలంగాణ ఐటీ నిపుణులు వామన్, శ్రీనివాస్ నేత, శ్రీనివాస్ నాయుడు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గుత్తా సత్యనారాయణ పటేల్ పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా సైబర్ జాగరుకత దివాస్

- డైరెక్టర్ శిఖా గోయల్


హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) : వృద్ధులే లక్ష్యంగా సాగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బి) డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 2వ తేదీన నిర్వహించిన 'సైబర్ జాగ్రూకత దివస్'ను పురస్కరించుకుని డైరెక్టర్ మాట్లాడుతూ ...ఈ ఏడాది ఏప్రిల్ నెలను ప్రత్యేకంగా వృద్ధుల సైబర్ అవగాహన మాసంగా అంకితం చేసినట్లు తెలిపారు. వృద్ధులు తమ జీవితకాల కష్టార్జితాన్ని సైబర్ నేరగాళ్లకు చిక్కి కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, అందుకే వారిని చైతన్య పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'గ్రామ సభ' కార్యక్రమాల్లో భాగంగా 281 అవగాహన సదస్సులు నిర్వహించినట్లు ఆమె వివరించారు. వృద్ధులు ఆత్మవిశ్వాసంతో, భయం లేకుండా డిజిటల్ సేవలను వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఆన్‌లైన్‌బట్‌అన్‌అఫ్రైడ్ అనే నినాదంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు శిఖా గోయల్ పేర్కొన్నారు. నేరగాళ్లు వృద్ధులను దోచుకోవడానికి ప్రధానంగా 'డిజిటల్ అరెస్ట్' వంటి మార్గాలను ఎంచుకుంటున్నారని, పోలీసులమని నమ్మించి వీడియో కాల్స్ ద్వారా భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఏ చట్ట అమలు సంస్థ కూడా వీడియో కాల్ ద్వారా అరెస్టులు చేయదని, ఇలాంటి పిలుపులకు స్పందించి డబ్బులు పంపవద్దని ఆమె హితవు పలికారు. అలాగే అధిక లాభాల ఆశ చూపే నకిలీ పెట్టుబడి పథకాలు, క్రిప్టోకరెన్సీ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా అనుమానాలు ఉంటే 1930 హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. రిమోట్ యాక్సెస్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, బ్యాంక్ కేవైసీ అప్‌డేట్ పేరుతో వచ్చే నకిలీ సందేశాలను నమ్మి ఓటీపీలు, పిన్ నంబర్లు ఎవరికీ చెప్పవద్దని ఆమె స్పష్టం చేశారు. ఈ క్రమంలో కుటుంబంలోని యువత తమ వంతు బాధ్యతగా పెద్దలకు సాంకేతికతపై అవగాహన కల్పించి, డిజిటల్ నేరాల బారిన పడకుండా రక్షించాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా ఐఎస్‌డబ్ల్యు ఆవిర్భావ వేడుకలు



హైదరాబాద్, ఏప్రిల్ 2 (జనంసాక్షి) : అతి ముఖ్యుల భద్రతే లక్ష్యంగా పనిచేసే తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఐ ఎస్ డబ్ల్యూ కార్యాలయంలో గురువారం నగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఓఎస్డీ బి.వి. కమలాసన్ రెడ్డి మాట్లాడుతూ భద్రతా రంగంలో అప్రమత్తత అత్యంత కీలకమని, ఒక్క చిన్న తప్పు జరిగినా అది పూర్తి వైఫల్యంగానే పరిగణించబడుతుందన్నారు. భద్రతా దళాలు 'జీరో ఎర్రర్' విధానంతో పని చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. 1984లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యతో పాటు అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో నెలకొన్న పీడబ్ల్యూజీ దాడుల నేపథ్యంలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 1985 ఏప్రిల్ 2న ఈ విభాగం ఏర్పాటైన తీరును ఆయన గుర్తు చేశారు. విధుల్లో విశేష ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఇకపై ఏటా 'ఐ ఎస్ డబ్ల్యూ ఛాంపియన్ ట్రోఫీ' అందజేస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. సీఎంఎస్‌జీ సెక్యూరిటీ అధికారి జి. చక్రవర్తి మాట్లాడుతూ ఐఎస్డబ్ల్యూ అత్యంత రహస్యమైన, కీలకమైన విభాగమని, వి.ఐ.పి భద్రతలో తెలంగాణ అధికారులు ప్రదర్శిస్తున్న నైపుణ్యాన్ని ఇతర రాష్ట్రాలు సైతం ప్రశంసిస్తున్నాయని కొనియాడారు. కమ్యూనికేషన్స్ ఎస్పీ శ్రీనివాస చారి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో శారీరక దాడుల కంటే సాంకేతిక దాడుల ముప్పు పెరుగుతోందని, డ్రోన్ టెక్నాలజీ, సిగ్నల్ జామర్ల వంటి ఆధునిక పరికరాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

# నామాల గుండు ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో ఉప్పల



హైదరాబాద్ (జనంసాక్షి) : హనుమాన్ జయంతి సందర్భంగా సికింద్రాబాద్‌లోని నామాల గుండు హనుమాన్ దేవాలయాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ,అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త సందర్శించారు. అనంతరం పూజారులు ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అసాధ్యమైన కార్యాలను సుసాధ్యం చేసే కార్యసాధకుడు.భయాలను పోగొట్టి ధైర్యాన్ని నింపే అభయాంజనేయుడు. ఆ వాయుపుత్రుని ఆశీస్సులతో ప్రజలందరికీ విజయం, సంపూర్ణ ఆరోగ్యం కలగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కుమారుడు ఉప్పల సాయి కిరణ్ కోడలు శార్వరీ, ఐవీఎఫ్ సికింద్రాబాద్ జోన్ అధ్యక్షుడు బెల్దె రవి కుమార్ గుప్త, భరద్వాజ్ టెంపుల్ చైర్మన్ కాచాం రాము గుప్త తదితరులు పాల్గొన్నారు.


# ఇంటి స్థలం ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చెందిన నేను అనగా పిన్నపురెడ్డి కాంతమ్మ ☐☐☐ వెంకటరాంరెడ్డి (లేటు) ఇంటి స్థలం ఒరిజినల్ నెంబర్.293/ of,1998, నెంబర్లు గల ఇంటి స్థలం డాక్యుమెంట్,మార్చి 20 తేదీన నేరేడుచర్ల నుంచి గరిడేపల్లి కి ఆటోలో వెళుతుండగా జారీ పోయినవి. దొరికిన వాళ్లు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు,9848819689, తెలుపగలరు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
03 ఏప్రిల్ 2026

# గన్ వదలని గాడ్ ఫాదర్ గణపతి

## సిద్ధాంతానికి, సంకెళ్లకు మధ్య ఒక గురువు మౌన పోరాటం



చరిత్రలో కొన్ని తేదీలు ముగింపులను సూచిస్తాయి.. మరికొన్ని తేదీలు ప్రశ్నలను మిగులుస్తాయి. మార్చి 31, 2026.. మావోయిజం అంతమవుతుందన్న ప్రభుత్వ ఆశయానికి గడువు. కానీ అదే తేదీ, ఒక వ్యక్తి నిర్ణయంతో మరోసారి ఆ ఆలోచనను ప్రశ్నార్థకం చేసింది. అడవుల్లో నిశ్శబ్దంగా ఉన్న ఒక గళం, "ఇంకా ముగియలేదు" అని వినిపించినట్లైంది. ఆ గళం.. ముప్పాల లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి. ఇది కేవలం ఒక వ్యక్తి లొంగిపోలేదనే వార్త కాదు. ఇది ఒక సిద్ధాంతం ఇంకా శ్వాసిస్తోందని చెప్పే సంకేతం. ఒక గన్ ఇంకా నేలపై పడలేదనే నిజం. ఒక మనిషి తన నమ్మకాన్ని చివరి వరకు వదలకపోవడంలో ఉన్న మౌన గర్జన.

**అక్షరం నుంచి అస్త్రం వరకు... ఒక మనసు చీలిన ప్రయాణం**

గణపతి కథను మనం చదివితే, అది ఒక విప్లవ నాయకుడి చరిత్ర మాత్రమే కాదు.. ఒక గురువు మనసులో జరిగిన విరుద్ధాల సంగ్రామం. ఒకప్పుడు బ్లాక్‌బోర్డ్ ముందు నిలబడి "జీవితాన్ని ఎలా నిర్మించుకోవాలి" అని చెప్పిన వ్యక్తి, తర్వాత అడవిలో తుపాకీతో "సమాజాన్ని ఎలా మార్చాలి" అని నమ్మడం.. ఇది సాధారణ మార్పు కాదు. ఆ మార్పుకు కారణం కాలమే. 1970లలో గ్రామీణ తెలంగాణలో ఉన్న అన్యాయం, అసమానతలు, అణచివేత.. అవి ఒక ఉపాధ్యాయుడి హృదయంలో గాయాలుగా మిగిలాయి. పుస్తకాలలో చెప్పే న్యాయం, వాస్తవ జీవితంలో కనిపించకపోవడం ఆయనను కలచివేసింది. చివరకు, అక్షరాల మీదున్న విశ్వాసం ఆయుధాల మీదికి మళ్లింది. అక్కడే 'లక్ష్మణ్ రావు' చరిత్ర ముగిసింది... 'గణపతి' యుగం ప్రారంభమైంది.

**వ్యూహకర్తగా ఎదిగిన విప్లవ శిల్పి :** మావోయిస్టు ఉద్యమం ఒక శక్తిగా నిలబడటంలో గణపతి పాత్ర అసాధారణం. పీపుల్స్ వార్ గ్రూప్, ఎంసీసీ విలీనంతో ఏర్పడిన సిపిఐ (మావోయిస్ట్) పార్టీకి ఆయన ఆత్మవిశ్వాసం, వ్యూహం, దిశ ఇచ్చారు. గెరిల్లా యుద్ధంలో ఆయన చూపిన పటిమ, అడవుల్లో ఆయన నిర్మించిన వ్యవస్థ, ఇవి కేవలం ఒక నాయకుడి ప్రతిభ కాదు, ఒక ఉద్యమానికి వెన్నెముక. కానీ ప్రతి శిఖరం తర్వాత పతనం తప్పదు. కాలం మారింది. ప్రభుత్వ వ్యూహాలు కఠినమయ్యాయి. అభివృద్ధి అడవుల్లోకి చేరింది. గన్స్ కంటే రోడ్లు, స్కూళ్లు, ఆసుపత్రులు ప్రజల జీవితాల్లో స్థానం సంపాదించాయి.

**లొంగుబాటు గడువు... ఒక తేదీ కాదు, ఒక పరీక్ష**

మార్చి 31.. ప్రభుత్వం నిర్ణయించిన గడువు. ఆ తేదీతో చాలామంది ఆయుధాలు కిందపెట్టి కొత్త జీవితాన్ని ఎంచుకున్నారు. కొందరు మార్పును అంగీకరించారు, కాలంతో కలిసిపోయారు. కానీ గణపతి మాత్రం మౌనంగా నిలిచిపోయారు. ఆ మౌనం సాధారణ నిరాకరణ కాదు... అది ఒక లోతైన అంతర్గత సంఘర్షణ. ఒక వైపు జీవితం.. లొంగిపోతే ప్రాణం నిలుస్తుంది, కొత్త దారులు తెరుచుకుంటాయి. మరో వైపు సిద్ధాంతం.. లొంగిపోకపోతే ఆశయం నిలుస్తుంది, నమ్మకం బ్రతుకుతుంది. ఈ రెండింటి మధ్య నిలబడి, తన గమ్యాన్ని తానే ఎంచుకోవాల్సిన ఆ క్షణం.. అదే గణపతి కథలో కీలక మలుపు. ఇది కేవలం ఒక నిర్ణయం కాదు.. ఒక మనిషి తన ఆత్మతో చేసుకున్న తీర్పు.

**సిద్ధాంతం... ఒక మనిషి కంటే పెద్దదా?**

గణపతికి లొంగిపోవడం అంటే కేవలం తుపాకీని నేలన పడివేయడం కాదు.. అది తన జీవితాన్నే, తన ప్రయాణాన్నే ప్రశ్నించడం. దశాబ్దాలుగా తనను నమ్మి అడవుల్లో అడుగులు వేసిన, ప్రాణాలను పణంగా పెట్టిన వేలాది మంది కేడర్‌కు ఆయన ఏమి సమాధానం చెబుతారు? "నేను తప్పు చేశాను" అని ఒప్పుకోవడం ఆయనకు కేవలం మాట కాదు.. అది ఒక యుగాన్ని తిరస్కరించడమే. అక్కడే ఆయన ఆగిపోయాడు. ఆ ఆగిపోవడంలో మొండితనం కనిపించవచ్చు... కానీ అదే సమయంలో అది ఒక అచంచల నిబద్ధతగా కూడా కనిపిస్తుంది. అది తప్పు కావచ్చు... కానీ అదే సమయంలో అది ఒక త్యాగస్ఫూర్తి ప్రతిబింబం కూడా కావచ్చు. గణపతి వ్యక్తిత్వం లోపల నిజానికి రెండు ప్రపంచాలు సహజీవనం చేస్తున్నాయి. ఒకవైపు, పిల్లల భవిష్యత్తు కోసం కలలు కనే, అక్షరాలతో జీవితాలను వెలిగించాలని ఆశించిన ఉపాధ్యాయుడు. మరోవైపు, అసమానతలను చెరిపేయాలంటే ఆయుధమే మార్గమని నమ్మిన విప్లవకారుడు. నేడు ఆయన తీసుకున్న నిర్ణయం చూస్తే, ఆ విప్లవకారుడే పైచేయి సాధించినట్లు అనిపిస్తుంది. అయినా, ఆ గురువు ఆలోచించే మనసు అయనలో ఎక్కడో మౌనంగా ఇంకా జీవిస్తూనే ఉందనే భావన మనసును విడిచిపెట్టదు.

**ఎప్పటికీ ముగియని ప్రశ్న**

గణపతి గన్ వదలకపోవడం వల్ల ఉద్యమం మళ్లీ పూర్వవైభవం సంతరించుకుంటుందా అన్నది సందేహమే. కానీ ఆయన తీసుకున్న నిర్ణయం ఒక లోతైన సత్యాన్ని మన ముందుంచుతోంది.. సిద్ధాంతాలను శక్తితో అణచివేయవచ్చు, కానీ పూర్తిగా అంతమొందించలేం. ఒకవైపు ప్రభుత్వం అభివృద్ధి అనే ఆయుధంతో అడవిని, అక్కడి మనసులను గెలుచుకోవాలని ప్రయత్నిస్తోంది. మరోవైపు గణపతి తన అచంచల నమ్మకంతో, తన అస్తిత్వాన్ని నిలబెట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ రెండింటి మధ్య జరుగుతున్నది కేవలం ఒక పోరాటం కాదు.. ఒక దార్శనిక ఘర్షణ. ఒకటి మార్పును నిర్మించాలనుకునే శక్తి... మరొకటి మార్పు కోసం పోరాడిన ఆత్మ. ఈ సంఘర్షణ ఇంకా ముగియలేదు... మరియు అది ముగిసే వరకు, ఈ ప్రశ్న కూడా సమాధానం కోసం సమాజాన్ని వెంటాడుతూనే ఉంటుంది.

**మౌనంలో వినిపిస్తున్న గర్జన :** "గన్ వదలని గాడ్ ఫాదర్"... ఈ పదం ఒక మనిషి గాథను మాత్రమే కాదు, కాలంతో పోరాడుతున్న ఒక భావజాలపు ప్రతిధ్వనిని సూచిస్తోంది. అడవిలో ఎక్కడో నిశ్శబ్దంగా నిలిచిన తుపాకీ, శబ్దం చేయకపోయినా ఒక అర్థాన్ని చెబుతోంది.. ఓటమి కాదు, ఇంకా ముగియని కథ. ఆ నిశ్శబ్దంలో వినిపిస్తున్నది గర్జనే... అది ఒక వ్యక్తి మొండితనం కాదు, ఒక నమ్మకం చివరి శ్వాస వరకు నిలబడాలనే సంకల్పం. "మార్పు అంటే ఏమిటి?" అనే ప్రశ్న అక్కడ గాలిలో తేలుతోంది. అది లొంగిపోవడమా? లేక అంతిమ క్షణం వరకు ఆశయాన్ని గట్టిగా పట్టుకోవడమా? ఈ ప్రశ్నకు సమాధానం గణపతి ఒక్కడి చేతుల్లో లేదు. అది సమాజం ఆలోచనల్లో ఉంది. అభివృద్ధి దారిలో నడుస్తున్న ప్రపంచం ఒక వైపు ఉంటే, అసమానతలతో పోరాడే ఆలోచన మరో వైపు నిలబడి ఉంది. చివరికి, గన్ మౌనంగా మారవచ్చు... కానీ ఆలోచనలు ఎప్పటికీ మౌనమవ్వవు. అడవిలో వినిపిస్తున్న ఆ గర్జన.. మన సమాజం ఇంకా పూర్తి సమాధానాన్ని కనుగొనలేదని గుర్తు చేస్తూనే ఉంటుంది.

**కాలగిరి శ్రీనివాస్ రెడ్డి**
**సీనియర్ జర్నలిస్ట్**

---

### యుద్ధాలు- నిర్వీర్యం అయిన యూఎన్ఓ,

# ప్రజాస్వామ్యం మీడియా, ప్రజల చైతన్యం

ప్రపంచ రాజకీయాల్లో యుద్ధం అనేది కొత్త విషయం కాదు. కానీ ప్రస్తుతం యుద్ధాలు ఎలా నడుస్తున్నాయి?, వాటిని మీడియా ప్రజలకు ఎలా చూపిస్తున్నారు?, వాటిపై సమాజం ఎలా స్పందిస్తోంది ? ఐక్యరాజ్యసమితి, భద్రతా సమితి బలహీనత అనే అంశాలు తీవ్ర ఆందోళన కలిగించే స్థితికి చేరుకున్నాయి. ముఖ్యంగా ప్రజాస్వామ్య దేశాల్లోనే ప్రజలకు అసలు ప్రజాస్వామ్య భావాలు లేవు. సాధారణ పౌరులకు ఉండాల్సిన కనీసం మౌలిక లక్షణం " అయ్యో పాపం" అనే మానవత్వం స్పందన అసలు సారాన్నే కోల్పోతుంది. యుద్ధం జరుగుతోంది, ప్రజలు వీడియోలు ఒక వినోద కార్యక్రమంగా, సినిమా స్టెంట్ గా చూస్తున్నారు. కానీ ఆ యుద్ధాన్ని ఆపే నైతిక శక్తి మాత్రం కనబడడం లేదు. ఇదే ఈ కాలపు విరోధాభాసం.



ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు, ప్రభుత్వ మార్పులు మాత్రమే కాదు. అది ప్రజల ఆలోచనలకు, అభిప్రాయాలకు విలువ ఇవ్వడం. కానీ ఇప్పుడు యుద్ధాల విషయంలో ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వాల నిర్ణయాలను ప్రభావితం చేయడం లేదు. ప్రజలు యుద్ధాలను వ్యతిరేకించినా, ప్రభుత్వాలు వాటిని యధాతథంగా లైట్ గా తీసుకుంటున్నాయి. ప్రజల ఆక్రందనలతో సంబంధం లేదనట్లుగా యుద్ధాలు కొనసాగిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్యం యొక్క మూలాధారాన్ని దెబ్బతీస్తోంది. ప్రజల సంకల్పం, ప్రభుత్వ చర్యల మధ్య పెరుగుతున్న ఈ అంతరం ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తోంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం మీడియా పాత్ర. యుద్ధాలను నిజంగా ఎలా ఉన్నాయో చూపించకుండా, ఒక రకమైన కథగా, ఒక సినిమాటిక్ ప్రదర్శనగా చూపించడం జరుగుతోంది. యుద్ధం మానవ నివాసాలపై, స్కూళ్ళు, ఆసుపత్రుల పై బాంబుల వర్షం కురిపిస్తుంది. అక్కడ ప్రజల మానవ బాధ, మరణాలు, విధ్వంసం వంటి అసలు వాస్తవాలు పక్కన పడుతున్నాయి. వాటి స్థానంలో దేశభక్తి భావనలు, రాజకీయ ప్రయోజనాలు, సైనిక శక్తి ప్రదర్శనలు ముందుకు వస్తున్నాయి. దీని వల్ల ప్రజలు యుద్ధాన్ని ఒక వినోదంలా చూడటం ప్రారంభించారు. ఇది చాలా ప్రమాదకరమైన పరిణామం. ఈ పరిస్థితిలో ప్రజల పాత్ర కూడా ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రజలు యుద్ధాల పట్ల అలసత్వంతో, నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు యుద్ధం అంటే పెద్ద నైతిక చర్చలు, నిరసనలు, ఉద్యమాలు ఉండేవి. కానీ ఇప్పుడు ఆ స్పందన పెద్దగా వీధుల్లో కనిపించడం లేదు. సోషల్ మీడియా, వార్తల వేగం, సమాచార భారం అన్నీ కలిసి ప్రజలలో ఒక విధమైన మానసిక అలసటను, నిర్లిప్తతను కలిగించాయి. ఈ అలసట ప్రజాస్వామ్య స్ఫూర్తికి పెద్ద ప్రమాదం. ఎందుకంటే ప్రజలు స్పందించకపోతే,రాజ్యాలను ఏలే ప్రభుత్వాలు, సైనిక అధికారుల చర్యలు ప్రశ్నించబడవు. యుద్ధం ఎప్పుడూ అబద్ధాలతోనే నడుస్తుంది. కానీ ఇప్పుడు ఆ అబద్ధాలు మరింత వ్యవస్థీకృతంగా, సాంకేతికంగా వ్యాప్తి చెందుతున్నాయి. సమాచారాన్ని నియంత్రించడం, వాస్తవాలను దాచడం, ప్రజల దృష్టిని మళ్లించడం, ఇవి అన్నీ ప్రభుత్వాల సాధనాలుగా మారాయి. దీనివల్ల ప్రజలు నిజాన్ని గుర్తించడం కష్టమవుతోంది. నిజం కనిపించకపోతే, న్యాయం కోసం ప్రజల పోరాటం, సున్నితమైన మానసిక భావాలు కూడా బలహీనపడిపోతున్నాయి. హృదయాలు మెద్దుబారాయి.

ప్రజాస్వామ్యం మరో ముఖ్య లక్షణం నైతిక బాధ్యత. యుద్ధం వంటి విషయాల్లో ప్రజలు, ప్రభుత్వాలు నైతికంగా స్పందించాలి. కానీ ఇప్పుడు ఆ నైతికత క్రమంగా కనుమరుగవుతోంది. యుద్ధం వల్ల జరిగే స్త్రీలు, పసిబిడ్డలు, వృద్ధులు, వికలాంగులు, మానవ నష్టాన్ని గుర్తించకుండా, దానిని ఒక వ్యూహాత్మక చర్యగా మాత్రమే చూడటం జరుగుతోంది. ఇది మానవత్వ స్వభావానికి విరుద్ధం. ప్రజాస్వామ్యం నైతిక విలువలపై నిలబడాలి. అవి లేకపోతే అది కేవలం ఒక రూపకల్పనగా మాత్రమే మిగులుతుంది.

ఇక్కడ ఒక కీలకమైన ప్రశ్న ఉత్పన్నమవుతోంది: ప్రజాస్వామ్యం నిజంగా ఇంకా జీవించి ఉందా? బయటికి చూస్తే ఎన్నికలు జరుగుతున్నాయి, ప్రభుత్వాలు మారుతున్నాయి. కానీ లోపల ప్రజల స్వరం తన స్పందనల ప్రభావం కోల్పోతే, అది నిజమైన ప్రజాస్వామ్యం కాదు. యుద్ధాల విషయంలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజలు వ్యతిరేకించినా, యుద్ధాలు కొనసాగుతుండటం ప్రజాస్వామ్యం బలహీనతకు సూచన. ఈ పరిస్థితి కేవలం ఏదో ఒక దేశానికి మాత్రమే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి కనిపిస్తోంది. శక్తివంతమైన దేశాలు తమ ప్రయోజనాల కోసం యుద్ధాలు కొనసాగిస్తుంటే, ప్రజాస్వామ్య విలువలు పక్కన పడుతున్నాయి. అంతర్జాతీయ న్యాయం, ఐక్యరాజ్యసమితి , భద్రతా మండలి మానవ హక్కులు, ఇవి అన్నీ మంటల్లోనే కాలిపోతున్నాయి. ప్రపంచ ప్రజల్లో ఈ నిర్లిప్తత ప్రపంచ శాంతికి పెద్ద ముప్పు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం కోసం సమాజం మళ్లీ చైతన్యవంతం కావాలి. ప్రజలు ప్రశ్నించాలి, స్పందించాలి, నిరసించాలి. మీడియా నిజాన్ని చూపాలి. ప్రభుత్వాలు ప్రజల అభిప్రాయాలను గౌరవించాలి. ఇవన్నీ కలిసి పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం తన అసలు సారాన్ని తిరిగి పొందగలదు. చివరగా చెప్పాలంటే, యుద్ధం కేవలం రణరంగంలోనే జరుగదు. అది మన ఆలోచనల్లో, మన విలువల్లో, మన వ్యవస్థల్లో కూడా జరుగుతుంది. ఈ యుద్ధంలో ప్రజాస్వామ్యం ఇప్పటికే ఓడిపోయిందనే భావన కలుగుతోంది. కానీ ఇది అంతిమ ఓటమి కాదు. ప్రజలు మళ్లీ చైతన్యంతో ముందుకు వస్తే, నైతికతను తిరిగి స్థాపిస్తే, ప్రజాస్వామ్యం మళ్లీ బలపడే అవకాశం ఉంది. లేకపోతే, అది కేవలం పేరుకే మిగిలిపోయే ప్రమాదం ఉంది.



**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

---

# తీవ్ర ఆర్థిక సంక్షోభ దిశగా భారత్




ప్రపంచ రాజకీయాల్లో యుద్ధాలు, ఆర్థిక అస్థిరతలు, ఇంధన సంక్షోభాలు పెరుగుతున్న ఈ కాలంలో భారత్ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు మరింత స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజాగా దేశ మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణ్యం చేసిన హెచ్చరికలు అతి పెద్ద ఆర్థిక సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. జిడిపి తగ్గుదల, ధరల పెరుగుదల, దిగుమతులపై ఆధారపడటం, ప్రభుత్వ అప్పుల భారాలు, రూపాయి విలువ పతనం.. ఇవి అన్నీ కలిసివచ్చినప్పుడు ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక బలహీనతలు బయటపడతాయి. ఈ నేపథ్యంలో భారత్ ఎదుర్కొంటున్న పరిస్థితిని కేవలం తాత్కాలిక సమస్యగా చూడటం సరైంది కాదు. ఇది ఒక వ్యూహాత్మక హెచ్చరిక.

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రపంచ మార్కెట్‌లో చోటుచేసుకునే మార్పులు నేరుగా ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా చమురు, సహజవాయువు, ఎరువులు వంటి కీలక వనరుల విషయంలో భారత్ దిగుమతులపై ఆధారపడటం పెద్ద బలహీనతగా మారింది. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధ పరిస్థితులు సరఫరా గొలుసును దెబ్బతీస్తే, దాని ప్రభావం వెంటనే భారత ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. చమురు ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరుగుతాయి. రవాణా ఖర్చులు పెరిగితే ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. ఉత్పత్తి వ్యయం పెరిగితే మార్కెట్‌లో ధరలు పెరుగుతాయి. చివరికి ఈ మొత్తం భారాన్ని మోసేది సామాన్య వినియోగదారుడే.

ఇప్పటికే దేశంలో గ్యాస్ కొరత కారణంగా చిన్న వ్యాపారాలు, ముఖ్యంగా రెస్టారెంట్లు మూతపడుతున్నాయి. ఇది ఒక హెచ్చరిక సంకేతం. ఒక రంగంలో ఇబ్బందులు మొదలైతే, అది క్రమంగా ఇతర రంగాలకు వ్యాపిస్తుంది. చిన్న వ్యాపారాలపై ఒత్తిడి పెరిగితే ఉపాధి తగ్గుతుంది. ఉపాధి తగ్గితే వినియోగం తగ్గుతుంది. వినియోగం తగ్గితే ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. ఇదే ఒక ఆర్థిక సంక్షోభం ప్రారంభ దశ.

జిడిపి ఒక శాతం తగ్గుదల చిన్న విషయం కాదు. అది లక్షల కోట్ల రూపాయల ఆర్థిక కార్యకలాపాల తగ్గుదలని సూచిస్తుంది. అదే సమయంలో ద్రవ్యోల్బణం 1.5 శాతం పెరగడం అంటే ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోవడం. వేతనాలు పెరగకుండా ధరలు పెరిగితే మధ్యతరగతి, పేద వర్గాల జీవన ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతింటాయి. ఇది సామాజిక అసమానతలను మరింత పెంచుతుంది.

ఇక్కడ ప్రభుత్వం తీసుకుంటున్న సబ్సిడీ చర్యలు తాత్కాలిక ఉపశమనాన్ని ఇవ్వగలవు. కానీ సబ్సిడీలు శాశ్వత పరిష్కారం కావు. ఎందుకంటే సబ్సిడీలకు కూడా ఆర్థిక మూలాలు అవసరం. ప్రభుత్వ ఆదాయాలు తగ్గుతున్న సమయంలో సబ్సిడీలను కొనసాగించడం దీర్ఘకాలంలో అసాధ్యం. చివరికి ప్రభుత్వం సబ్సిడీలను తగ్గించాల్సి వస్తుంది. అప్పుడు ధరల భారాన్ని ప్రజలే మోయాల్సి వస్తుంది.

భారత్ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న మరో పెద్ద సమస్య ప్రభుత్వ అప్పుల భారమే. గత కొన్ని సంవత్సరాల్లో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు గణనీయంగా పెరిగాయి. అప్పులు పెరిగితే వడ్డీ చెల్లింపులు పెరుగుతాయి. వడ్డీ చెల్లింపులు పెరిగితే అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసే సామర్థ్యం తగ్గిపోతుంది. ఇది మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

రూపాయి విలువ పతనం కూడా ఒక తీవ్రమైన ఆర్థిక సంకేతం. రూపాయి విలువ తగ్గితే దిగుమతులు మరింత ఖరీదవుతాయి. భారత్ ఎక్కువగా దిగుమతి చేసుకునే చమురు, ఎరువులు, యంత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు ఇలా అన్నీ వినియోగ వస్తువుల ధరలు పెరుగుతాయి. ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతుంది. అదే సమయంలో విదేశీ పెట్టుబడులు తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. విదేశీ పెట్టుబడులు తగ్గితే పారిశ్రామిక వృద్ధి మందగిస్తుంది.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు తాత్కాలిక పరిష్కారాలకే పరిమితం కాకూడదు. దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు సాగాలి. ముఖ్యంగా ఇంధన భద్రత విషయంలో భారత్ స్వయం సమృద్ధిని పెంచుకోవాలి. పునరుత్పాదక ఇంధన వనరులపై పెట్టుబడులు పెంచడం అత్యవసరం. సౌరశక్తి, గాలి శక్తి, హైడ్రోజన్ శక్తి వంటి ప్రత్యామ్నాయ వనరులను వేగంగా అభివృద్ధి చేయాలి. ఇది కేవలం పర్యావరణ పరిరక్షణ కోసమే కాదు, ఆర్థిక భద్రత కోసమూ అవసరం.

అలాగే వ్యూహాత్మక నిల్వల నిర్మాణం కూడా అత్యంత ముఖ్యమైన అంశం. చమురు, గ్యాస్, ఎరువులు వంటి కీలక వనరుల నిల్వలను ముందుగానే సేకరించడం ద్వారా ప్రపంచ మార్కెట్‌లో వచ్చే మార్పుల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. భారత్ కూడా ఈ దిశగా మరింత దృఢమైన చర్యలు తీసుకోవాలి.

దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం కూడా అత్యవసరం. "దిగుమతులపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థ" నుండి "స్వయం సమృద్ధి సాధించే ఆర్థిక వ్యవస్థ" వైపు భారత్ కదలాలి. ముఖ్యంగా ఎరువుల ఉత్పత్తి, ఇంధన ప్రత్యామ్నాయాలు, ఎలక్ట్రానిక్ తయారీ రంగాల్లో దేశీయ పెట్టుబడులను ప్రోత్సహించాలి. ఇది ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా విదేశీ మారక నిల్వలను కూడా కాపాడుతుంది.

ఇక వ్యవసాయ రంగం విషయానికి వస్తే, ఎరువుల కొరత రైతులపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక. రైతులపై భారాలు పెరిగితే ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందువల్ల రైతులకు ప్రత్యామ్నాయ సహాయ విధానాలను ప్రభుత్వం అమలు చేయాలి. సహజ వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం వంటి పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ఎరువులపై ఆధారాన్ని తగ్గించవచ్చు.

ఈ సంక్షోభాన్ని ఒక ప్రమాదంగా మాత్రమే కాకుండా ఒక అవకాశంగా కూడా చూడాలి. ప్రతి సంక్షోభం ఒక గుణపాఠాన్ని నేర్పుతుంది. ఈ సందర్భంలో భారత్ తన ఆర్థిక నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసుకునే అవకాశం ఉంది. దీర్ఘకాలిక ప్రణాళిక, శాస్త్రీయ విధానాలు, పారదర్శక ఆర్థిక నిర్వహణ.. ఈ మూడు అంశాలు కలిసివస్తేనే దేశం భవిష్యత్తులో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కోగలదు.

ప్రస్తుత పరిస్థితి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. ప్రపంచంపై ఆధారపడే ఆర్థిక వ్యవస్థలు ఎప్పటికైనా దెబ్బతింటాయి. స్వయం సమృద్ధి సాధించిన దేశాలే నిలబడతాయి. అందువల్ల భారత్ కూడా తక్షణ చర్యలు తీసుకుని తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలి. లేకపోతే చిన్న హెచ్చరికలు పెద్ద సంక్షోభాలుగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం, విధానకర్తలు, పారిశ్రామిక వర్గాలు, ప్రజలు.. అన్ని వర్గాలు కలిసి ఒక సమగ్ర ఆర్థిక వ్యూహాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ఆర్థిక స్థిరత్వం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు; అది మొత్తం సమాజ బాధ్యత. ఈ హెచ్చరికలను గమనించి సరైన దిశలో ముందడుగు వేస్తేనే భారత్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది.



**సిద్ధగౌని సుదర్శన్**
**సెక్రెటరి, తెలంగాణ జర్నలిస్ట్‌ల ఫోరమ్**
**97017 03684**
**హైదరాబాద్**

---

# నైతికతల ముసుగులో ఆధిపత్యమా?

ప్రపంచ రాజకీయాల్లో అమెరికా స్థానాన్ని గురించి చాలా కాలంగా ఒకే విధమైన కథనం ప్రాచుర్యంలో ఉంది. అది ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, మానవ హక్కులను ప్రపంచానికి అందించిన "ప్రత్యేక దేశం" అనే భావన. కానీ జాన్ జె. మీర్షెమర్ ప్రతిపాదించిన యథార్థవాద (రియలిజం) దృష్టికోణంలో ఉన్న ఈ కథనాన్ని గట్టిగా ప్రశ్నిస్తుంది. ఆయన ప్రకారం, అమెరికా ఎదుగుదలలో "లిబరల్ ఐడియాలజీ " కంటే "నేషనల్ ఇంటరెస్ట్", "పవర్ పాలిటిక్స్ ", "జియోపాలిటికల్ అడ్వాంటేజీ" ముఖ్య పాత్ర పోషించాయి. అమెరికా స్వాతంత్ర్య పోరాటాన్ని కూడా ఈ కోణంలో చూడాలి. సాధారణంగా "హ్యూమన్ రైట్స్ (హ్యూమన్ రైట్స్)" కోసం జరిగిన పోరాటంగా చెప్పబడినా, వాస్తవానికి అది బ్రిటన్ ఆధిపత్యం నుంచి బయటపడే జాతీయ ప్రయోజన పోరాటం. అప్పట్లో అమెరికా జనాభా సుమారు 25 లక్షలు మాత్రమే. కానీ 19వ శతాబ్దం చివరికి అది 7 కోట్లకు పైగా పెరిగింది. ఈ జనాభా పెరుగుదల, విస్తరణ రాజకీయాలు, "మానిఫెస్ట్ డెస్టిని " అనే భావన ఇవి అన్నీ అమెరికా శక్తిని నిర్మించాయి.

1823లో వచ్చిన "మన్రో డాక్ట్రిన్" అమెరికా విదేశాంగ విధానానికి మూలస్తంభంగా మారింది. ఇది యూరోపియన్ దేశాలకు ఒక స్పష్టమైన హెచ్చరిక. "వెస్ట్రన్ హేమిస్ఫియర్ " లో జోక్యం చేసుకోవద్దు. కానీ ఇది నైతిక ప్రకటన కాదు. ఇది "రీజినల్ హెగెమనీ " కోసం తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం. అప్పట్లో అమెరికా సైనిక శక్తి బలంగా లేకపోయినా, బ్రిటన్ "రాయల్ నేవీ" పరోక్ష మద్దతు ఇచ్చింది. ఇది "బక్ పాసింగ్ " అనే వ్యూహానికి ఉదాహరణ. అంటే తన దేశ అవసరాలకు ఇతరుల దేశాల శక్తి సామర్థ్యాలను ఉపయోగించుకోవడం.

అమెరికా సివిల్ వార్, అమెరికా ఎదుగుదలలో ఒక మలుపు. ఈ యుద్ధంలో సుమారు 6 లక్షల మంది మరణించారు. ఇది అప్పటి వరకు అమెరికా చరిత్రలోనే అత్యధికం. కానీ ఈ యుద్ధం తర్వాత అమెరికా ఒకే దేశంగా నిలబడింది. 1900 నాటికి అమెరికా ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తిలో సుమారు 30 శాతం వాటాను సంపాదించింది. ఇది యాదృచ్ఛికం కాదు. ఇది రాజకీయ ఏకీకరణ ఫలితం. ప్రపంచ యుద్ధాల సమయంలో కూడా అమెరికా ప్రవర్తనను పరిశీలిస్తే, అది నైతికత కంటే "వ్యూహం " ఆధారంగా ఉందని తెలుస్తుంది. మొదటి ప్రపంచ యుద్ధం, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా మొదట తటస్థంగా ఉండి, చివర్లో మాత్రమే ప్రవేశించింది. 1945 నాటికి ప్రపంచ "జీడీపీ" లో అమెరికా వాటా సుమారు 50 శాతం వరకు పెరిగింది. యుద్ధం వల్ల యూరప్, జపాన్ బలహీనపడగా, అమెరికా బలపడింది. ఇది యథార్థ రాజకీయాల విజయానికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

ప్రచ్ఛన్న యుద్ధం (కోల్డ్ వార్) కాలంలో కూడా అమెరికా "డెమోక్రసీ" పేరుతో అనేక దేశాల్లో జోక్యం చేసుకుంది. కానీ వాస్తవానికి అది సోవియట్ యూనియన్ ప్రభావాన్ని అడ్డుకోవడమే లక్ష్యం. కొరియా, వియత్నాం, లాటిన్ అమెరికా దేశాల్లో జరిగిన యుద్ధాలు దీనికి ఉదాహరణ. 1947 నుంచి 1991 వరకు కొనసాగిన ఈ పోరాటంలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది "లిబరల్ ఇంటర్నేషనలిజం" కంటే "స్ట్రాటజిక్ కంటైన్‌మెంట్ " విధానమే ముఖ్యమని చూపిస్తుంది.

ఇప్పుడు ప్రపంచంలో 'చైనా ఎదుగుదల' తో కొత్త దశలోకి ప్రవేశించింది. 1980లో చైనా ప్రపంచ "జిడిపి" లో 2 శాతం మాత్రమే ఉండగా, 2023 నాటికి అది 18 శాతానికి పెరిగింది. ఇది అమెరికాకు పెద్ద సవాలును విసిరింది. 'ఫ్రాన్సిస్ ఫుకు యామా' చెప్పిన "ఎండ్ ఆఫ్ హిస్టరీ " సిద్ధాంతం ప్రకారం, లిబరల్ ప్రజాస్వామ్యం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తుందని భావించారు. కానీ అది జరగలేదు. అదే విధంగా 'శామ్యూల్ హంటింగ్ టన్ ' ప్రతిపాదించిన "క్లాష్ ఆఫ్ సివిలైజేషన్స్" సిద్ధాంతం కూడా పూర్తి వివరణ ఇవ్వలేకపోయింది. మియర్స్‌హైమర్ ప్రకారం, అసలు కారణం శక్తి పోటీ. రష్యా –ఉక్రెయిన్ యుద్ధం కూడా ఇదే దృక్పథంతో చూడాలి. నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రిటీ ఆర్గనైజేషన్) విస్తరణ, రష్యా భద్రతా ఆందోళనలు ఈ యుద్ధానికి కారణమని ఆయన అంటారు. ఇది 'క్యూబన్ మిస్సైల్ క్రైసిస్ ' సమయంలో అమెరికా ప్రవర్తనతో పోల్చవచ్చు. అంటే, ప్రతి పెద్ద దేశం తన సరిహద్దుల్లో శత్రు ప్రభావాన్ని అంగీకరించదు. అయితే, మియర్స్‌హైమర్ సిద్ధాంతంపై విమర్శలు కూడా ఉన్నాయి. ఆయన "రియలిజం" మానవ హక్కులు, నైతిక విలువలను తగ్గించి చూస్తుందనే అభిప్రాయం ఉంది. ఉదాహరణకు, అమెరికా "మార్షల్ ప్లాన్" ద్వారా యూరప్ పునర్నిర్మాణానికి భారీ సహాయం (సుమారు 13 బిలియన్ డాలర్లు) చేసింది. ఇది కేవలం వ్యూహాత్మక ప్రయోజనం మాత్రమేనా? లేక నైతిక బాధ్యత కూడా ఉందా? అనే ప్రశ్న వస్తుంది. మొత్తం మీద, అమెరికా శక్తి ఎదుగుదల ఒక సంక్లిష్ట ప్రక్రియ. అది కేవలం నైతికత వల్ల కాదు. అలాగే పూర్తిగా స్వార్థం వల్ల కూడా కాదు. కానీ మియర్స్‌హైమర్ చూపించినట్లు, "పవర్ పాలిటిక్స్" అనే వాస్తవాన్ని విస్మరించలేము. ప్రపంచ రాజకీయాల్లో "ఆదర్శాలు" కంటే "ప్రయోజనాలు" ఎక్కువగా ప్రభావం చూపుతాయి. ఇప్పటి పరిస్థితుల్లో అమెరికా–చైనా పోటీ మరింత తీవ్రమవుతోంది. ఈ సందర్భంలో యథార్థవాద దృక్పథం ఒక హెచ్చరికను ఇస్తుంది. భావోద్వేగాలు కాదు, వాస్తవాలు ముఖ్యం. లేకపోతే, ప్రపంచం మళ్లీ పెద్ద ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉంది.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**

## శ్రీ సంస్కార్ విద్యా పీఠంలో ఘనంగా ఫుడ్ మేళా

- ఆకట్టుకున్న చిరుధాన్యాల వంటకాలు



**తాండూరు, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** పట్టణంలోని శ్రీ సంస్కార్ విద్యా పీఠం పాఠశాలలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులచే నిర్వహించిన 'ఫుడ్ మేళా' సంప్రదాయ వంటకాలతో అలరించింది. ఆధునిక ఆహారపు అలవాట్ల మధ్య మరిచిపోతున్న పాతకాలపు రుచులను, ఆరోగ్యకరమైన ఆహారాన్ని నేటి తరానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.విద్యార్థులు సుమారు70 కిపైగా స్టాళ్లను ఏర్పాటు చేసి, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.సంప్రదాయ రుచులు: మన అమ్మమ్మలు, నానమ్మల కాలం నాటి ఆరోగ్యకరమైన రాగి ముద్ద, భక్షాలు, సజ్జ రొట్టెలు, జొన్న రొట్టెలు, కొర్ర పాయసం వంటి మిల్లెట్స్ (చిరుధాన్యాల) వంటకాలను విద్యార్థులు తల్లిదండ్రుల సహకారంతో స్వయంగా తయారు చేసి ప్రదర్శించారు.?కేవలం తెలంగాణ వంటకాలే కాకుండా, వివిధ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన ఆహార పదార్థాలను కూడా ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేష్ గణేష్ తో పాటు కవయిత్రి మొల్ల కళా వేదిక ఫౌండర్ అధ్యక్షులు కేవియం వెంకట్ పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యమే ఆనందం. విద్యార్థులు నేటి కాలంలో హోటళ్లలో దొరికే జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. రసాయనాలతో కూడిన ఆహారం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇలాంటి ఫుడ్ మేళాల ద్వారా చిన్నతనం నుంచే పోషక ఆహారంపై అవగాహన పెంచుకోవాలి," అని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వెంకటేష్, గణేష్, పాఠశాల ప్రిన్సిపల్ విజయనిర్మల, కరస్పాండెంట్ స్వాతి, డైరెక్టర్ సవిత, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 99 రోజుల ప్రణాళిక పక్కాగా నిర్వహించాలి

**మోమిన్‌పేట, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మోమిన్ పేట్ మండలం బూర్గుపల్లి, అమ్రాది కలాన్ గ్రామ సభ లో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు గ్రామాల లోని ప్రజలకు అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేస్తున్నదన్నారు. అదేవిధంగా ప్రభుత్వం మీకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను ప్రజలకు వివరించడంతో పాటుగా అవసరాలను తెలుసుకుని పరిష్కరించేందుకు అధికారులు స్వయంగా గ్రామాలకు వస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు మహాలక్ష్మీ పథకంలో మా అక్కా చెల్లెల్లకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నని, ఇప్పటి వరకు మహిళలు పదివేల కోట్ల రూపాయల ప్రయాణాలు చేశారు. 500 రూపాయలకే సబ్సిడీ గ్యాస్ సిలెండర్, గృహ జ్యోతి పథకంలో పేదల ఇళ్ళకు ఉచిత విద్యుత్తు, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పది లక్షలకు పెంపు కల్పించడం జరిగిందన్నారు. ఇక ఈ ఏడాది నుండి రాష్ట్రంలోని కుటుంబాలన్నింటికి భరోసా ఉండాలనే ఉద్యేశంతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. బడికి వెళ్ళే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, ఆకలితో ఉండొద్దనే ఉద్యేశంతో ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ఉదయం పూట అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు అదేవిదంగా ఇంటర్ మీడియట్ విద్యార్థులకు




కూడా మద్యాహ్న భోజన సౌకర్యాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్ధుడు కాబట్టి గత ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుతూ మరోవైపు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సన్న బియ్యాన్ని ఇవ్వడం జరుగుతుందని, పదేళ్ల తర్వాత రేషన్ కార్డులు ఇచ్చామని అదేవిధంగా పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. స్వంత స్థలం లేకపోతే స్థలం ఇచ్చి ఇళ్ళు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డెబ్బై వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీతో పాటు ప్రవేటు రంగంలో 15 లక్షల ఉద్యోగాలు కల్పించడం జరిగిందని స్పీకర్ తెలిపారు.

కోట్ పల్లి మండలం మోత్కుపల్లి గ్రామానికి ఉత్తమ గ్రామంగా జాతీయ అవార్డుతో పాటు యాభై లక్షల నగదు బహుమతి పొందడం జరిగిందని ఆయన తెలిపారు. మోత్కుపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అన్ని గ్రామాలు కూడా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు.

### విలేజ్ ల్యాండ్ రీసర్వే ప్రారంభం

మోమిన్ పేట్ మండలం అమ్రాది కలాన్ గ్రామంలో విలేజ్ ల్యాండ్ రీసర్వేను ప్రారంభించి గ్రామ సభలో ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.తెలంగాణ రాష్ట్రంలో నిజాం నవాబుల కాలంలో భూముల సర్వే జరిగిందని మళ్ళీ తొంబై ఏళ్ళ తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో భూముల రీ సర్వే ఇప్పుడు జరుగుతుందన్నారు. అప్పటికి ఇప్పటికి టెక్నాలజీ బాగా పెరిగిందని, ఇప్పుడు ఆధునిక సాంకేతిక పద్దతులను ఉపయోగించి భూములను సర్వే చేసి సరిహద్దులు నిర్ణయిస్తారని ఆయన తెలిపారు. ప్రతి సర్వే నెంబర్ కు మ్యాప్ ఇస్తారని ఇదంతా మీ ముందే, మీ అనుమతి తోనే జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సర్వే వలన మీకు మంచి జరుగుతుందని భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఈ వివరాలను అన్నింటిని సమీకృత భూ భారతి పోర్టల్ లో నమోదు చేస్తారని తెలిపారు. స్మార్ట్ ఫోన్ ద్వారా మీ భూమి వివరాలను, సరిహద్దులను ప్రపంచంలో ఎక్కడి నుంచైనా చూసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఆర్డిఓ వాసుచంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం తహసీల్దార్ రవీందర్, ఇంచార్జ్ ఎంపీడీవో రాజ మల్లయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, సర్పంచులు వరప్రసాద్ రెడ్డి, శంకరప్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్ జిల్లా కాంగ్రెస్ నాయకుడు వేమారెడ్డి వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మున్సిపాలిటిని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా..


- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**చేవెళ్ల, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** చేవెళ్ల మున్సిపాలిటీని రంగారెడ్డి జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ వార్డు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంతో గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా మారుతున్నాయని అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల కరెంట్, పింఛన్లు, రేషన్ కార్డులు తదితర పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, రెండో




విడతలో 3500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు వస్తాయని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం పట్టణ ప్రాంతాల అభివృద్ధి అత్యధిక నిధులను వెచ్చిస్తోందని తెలిపారు. ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్యాలయాల్లోని వార్డుల్లో అభివృద్ధికి ప్రభుత్వం ఒక్కో మున్సిపల్ కు రూ.15 కోట్ల నిధులను మంజూరు చేసిందని గుర్తు చేశారు. అంతేగాకుండా ట్యాక్సుల ద్వారా వచ్చే నిధులను కూడా ప్రభుత్వం వార్డుల అభివృద్ధికే ఖర్చు చేస్తుందని తెలిపారు. చేవెళ్ల మున్సిపల్ లోని 18 వార్డుల్లో అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులను మంజూరు చేసేలా కృషి చేస్తామని వెల్లడించారు. మున్సిపల్ వార్డుల్లో గెలిచిన ప్రతి కౌన్సిలర్ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. వార్డులలో వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కారం చూపే విధంగా అధికార యంత్రాంగం పాటుపడాలని సూచించారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధి కోసమే తాను నిత్యం పనిచేస్తామని ఆయన వెల్లడించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పద్మావతి, చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్లు బండారి శైలజాఆగి రెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరి, దేవర మనీషాఅనంత్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింహులు, చేవెళ్ల మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, రాఘవేందర్, మాజీ ఉప సర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్, లియాలత్, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**చేవెళ్ల, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 316వ వర్ధంతి సందర్భంగా చేవెళ్లలోని ఆయన విగ్రహానికి చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాముగౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజాఆగిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారని, సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బహుజనులు ఏకమై పోరాడితేనే రాజ్యాధికారం సాధించవచ్చన్నారు. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ లు మద్దెల శ్రీనివాస్, తాళ్లపల్లి నర్సింలు, ప్రకాష్ గౌడ్, సుభాన్ గౌడ్, రామస్వామి, సుధాకర్ గౌడ్, కృష్ణగౌడ్, గొల్లపల్లి సత్యం, ఆంజనేయులు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# న్యాల్‌కల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించండి

- సానుకూలంగా స్పందించిన ప్రత్యేకాధికారి
- ప్రజా పాలన సభకు అధిక సంఖ్యలో హాజరైన గ్రామస్తులు

**న్యాల్‌కల్, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** మండల కేంద్రమైన న్యాల్ కల్ లో దశాబ్ద కాలానికి పైగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలను పరిష్కరించి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పలువురు అధికార, విపక్ష నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలువురు యువకులు గ్రామసభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ బేగరి జ్యోతి అధ్యక్షతన.. స్థానిక ప్రజాపాలన ప్రత్యేకాధికారి, తహసిల్దార్ ప్రభువులు పర్యవేక్షణలో.. "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం చేపట్టారు. స్థానిక పంచాయతీ రాజ్ అధికారుల తప్పిదంతో 6 గ్యారెంటీల పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు అధిక సంఖ్యలో లబ్ధి పొందడం లేదని గ్రామసభలో పలువురు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు 300కు పైగా అర్హులైన పేదలకు గృహ జ్యోతి పథకం అమలుకు నేటికీ సైతం నోచుకోలేకపోయారని ప్రశ్నించారు. గ్రామంలో దశాబ్దానికి పైగా జటిలంగా మారిన ఇండ్ల స్థలాల పంపిణీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు, కబ్జాలకు పాల్పడడం, తదితర ప్రభుత్వ స్థలాలను వెంటనే సర్వే చేపట్టి సమస్యను పరిష్కరించాలని, అర్హులైన పేదలకు తిరిగి ఇండ్ల స్థలాలను పంపిణీ చేయాలని స్థానిక విపక్ష బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్, ప్రవీణ్ కుమార్,



తదితరులు ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువచ్చారు. అందుకు సానుకూలంగా స్పందించిన ప్రత్యేకాధికారి ప్రభులు వివరణ ఇస్తూ.. మండలంలో కొనసాగుతున్న నిమ్జ్ భూముల సర్వే, హద్దుల ఏర్పాట్ల కారణంగా సర్వే చేపట్టలేకపోయామని, త్వరలోనే రెవెన్యూ, గ్రామకంఠం పరిధిలోని వివాదాస్పద భూ సమస్యలను సర్వే చేపట్టి పరిష్కరిస్తామని తహసిల్దార్ వివరణ ఇచ్చారు. కార్యక్రమానికి హాజరైన మండల విద్యుత్ అధికారి బాలకృష్ణ గృహ జ్యోతి పథకం అమలుపై వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరోజ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మాజీ సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, భాస్కర్, ప్రవీణ్ కుమార్, సత్యానారాయణ, అడివప్ప, వార్డు సభ్యులు, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వి నియోగం చేసుకోవాలి

- అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**శామీర్‌పేట్, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమములో భాగంగా మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయము వద్ద వార్డు సభ ఏర్పాటు చేశారు . ఈ వార్డు సభకు ముఖ్య అతిథి గా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరయ్యారు.ఈ వార్డు సభలో వివిధ శాఖల ద్వారా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు చేయూత పెన్షన్, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు,200 యూనిట్ల ఉచిత విద్యుత్, డ్వాక్రా మహిళలకు రుణాలు, స్త్రీ శక్తి క్యాంటీన్, వ్యవసాయ శాఖ తదితర పథకాల గురించి సంబంధిత శాఖల జిల్లా అధికారులు , మండల స్థాయి అధికారులు ప్రజలకు వివరించారు. మున్సిపల్ పరిధిలో అన్ని వార్డు కార్యాలయాల వద్ద వార్డు సభలు నిర్వ హించారు . ఈ కార్యక్రమములో అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు ఉప యోగించుకోవాలని ఏవైనా సమాచారము కొరకు సంబంధిత కార్యాలయములో సంప్రదించాలని కోరారు. చైర్మన్ మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందివ్వడానికి సిద్ధంగా ఉన్నామని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆర్థిక సంవత్సరం 2025-26 లో ఇంటి పన్నుల వసూళ్లలో రాష్ట్ర స్థాయిలో 6వ స్థానంలో అలియాబాద్ మున్సిపాలిటీ(91.5%) ఉన్నది. పన్నుల వసూళ్లలో కృషి కనబరిచిన బిల్ కలెక్టర్లు మొదటి స్థానం వెంకటేష్ (94%) తుర్కపల్లి,




రెండవ స్థానం అనిల్ రెడ్డి(93%) ఆలియాబాద్, మూడవ స్థానం ప్రశాంత్ (92%) యాదారంను అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ చైర్మన్ మరియు మున్సిపల్ కమిషనర్ సన్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్ , వైస్ చైర్మన్ కాన్రెడ్డి మాలతి, కౌన్సిల్ సభ్యులు గాదె వెంకటేష్ , తూము యమున , గూడె వెంకటేశ్ , గుర్క కుమార్, తలారి మౌనిక , కైరా గణేష్ , వివిధ శాఖల జిల్లా అధికారులు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మాలతి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరసింహరాజు ,డి ఆర్ డి ఓ సాంబశివరావు, హౌసింగ్ పి డి రమణమూర్తి ,అగ్రికల్చర్ ఏ డి వెంకట్రామ్ రెడ్డి ,తహసిల్దార్ సుచరిత, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ కార్యాలయంలో మరియు అన్ని వార్డులలో సభలు ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలే యాదయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అనేది ప్రభుత్వం చేపట్టిన ఒక కీలక కార్యక్రమం అని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు పరిపాలనలో



భాగస్వామ్యం కల్పించడమే కాకుండా అమలులో ఉన్న ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చేయడమే ముఖ్య లక్షమని ఈ సందర్భంగా తెలియజేశారు.మరియు ప్రజలకు సేవలు అందించడంలో ప్రభుత్వ శాఖల సామర్థ్యాన్ని పెంచడం అని మరియు ప్రజలకు పారదర్శకత జవాబుదారీతనం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం అమలులో ఉన్న పథకాల వివరాలను మరియు లబ్ధిదారుల వివరాలను ప్రజలకు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సాత త ప్రవీణ్ కుమార్, వైస్ చైర్పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్స్, ప్రత్యేక అధికారి పూర్ణిమ, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్ కుమార్, వార్డు సభ్యులు మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐటి కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు 'షేరింగ్'తోనే చెక్

- ట్రాఫిక్ డిసిపి రంజన్ రతన్ కుమార్

**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ ఐటి హబ్ పరిధిలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని అరికట్టేందుకు షేరింగ్ విధానం ఎంత దోహదపడుతుందని, ఈ మేరకు తమ వద్ద సమగ్రమైన కార్యాచరణ ఉందని సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం డిసిపి రంజన్ రతన్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ ఐటి కారిడార్ పరిధిలో ట్రాఫిక్ సమస్యను నిరోధించే వ్యూహంలో భాగంగా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఆదేశాలమేరకు మాదాపూర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారని అన్నారు. ఈ క్రమంలో సైబర్ టవర్స్ పరిసరాల్లో మార్నింగ్ పీక్ అవర్‌లో చేపట్టిన ఈ మాన్యువల్ సర్వేలో విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయని, కేవలం ఒక గంట వ్యవధిలోనే రోడ్డుకు నాలుగు వైపులా కలిపి 10 వేల 138 మంది సింగిల్ రైడర్లు తమ వాహనాలతో ప్రయాణించగా, డబుల్ రైడర్లు కేవలం 3 వేల 584 మంది మాత్రమే ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనినిబట్టి డబుల్ రైడర్ల కంటే సింగిల్ రైడర్లు అధికంగా ఉండటంవల్ల రహదారులపై వాహనాల సంఖ్య అనూహ్యంగా పెరిగి తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లకు దారితీస్తోందని స్పష్టమవుతుందన్నారు. ఒక్కొక్కరు ఒక్కో వాహనంపై ప్రయాణించడం వల్ల ట్రాఫిక్ రద్దీ పెరగడంతో వ్యక్తిగతంగా కూడా ప్రయాణికులు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారని అన్నారు. ప్రయాణ సమయం వృధా కావడంతోపాటు అదనపు ఇంధన ఖర్చులు, ప్రమాదాల రిస్క్ మరియు శారీరక అలసట వంటి సమస్యలు తలెత్తడం ఆందోళన కలిగించే విషయం అన్నారు. ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందని, పోలీసు అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ సర్వే కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడిసిపి హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసిపి చంద్రశేఖర్ రెడ్డి, మాదాపూర్ ఎస్ హెచ్ఓ శ్రీధర్ కుమార్, ఆర్.ఐ శ్రీకాంత్, ఎస్ఐలు టీవీ రావు, రాములు మరియు సిబ్బంది పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఐటీ ఉద్యోగులు మరియు సాధారణ పౌరులు తమ ప్రయాణాల్లో చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ రహిత సైబరాబాద్‌ను నిర్మించవచ్చని అధికారులు సూచించడం జరిగింది. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని అధికారులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సాధ్యమైనంత వరకు రైడ్ షేరింగ్




పద్ధతిని పాటించాలని, సహోద్యోగులు లేదా స్నేహితులతో కలిసి కార్ పూలింగ్ విధానాన్ని అనుసరిస్తే బాగుంటుందన్నారు. మెట్రో ట్రైన్ మరియు బస్సు వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ వినియోగాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని, పీక్ అవర్స్‌లో అత్యవసరమైతే తప్ప వ్యక్తిగత వాహనాల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గిస్తే మెరుగైన ఫలితాలు రాబట్టవచ్చన్నారు. పాఠశాల, కళాశాల వాహనాలు నడిచే రద్దీ సమయాల్లో ప్రయాణించకుండా ముందస్తు ప్రణాళికతో సుఖవంతమైన ప్రయాణాన్ని కొనసాగించవచ్చని స్థానికులకు సూచించడం జరిగింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
03 ఏప్రిల్ 2026

# గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం

**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని,ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణా అభివృద్ధికి వచ్చే నాయకులను, ప్రజలను నిలదీయాలని బిఅరెస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణంలోని మాజీ మంత్రి సింగిరెడ్డీ నిరంజన్ రెడ్డి నివాసంలో జిల్లా బిఅరెస్ నాయకులు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న, గ్రామస్వరాజ్యం,పల్లెలు ప్రగతికి పట్టుకొమ్మలు,అనే నినాదం నిజం చేసిన మహానాయకుడు కె.సి.ఆర్ అని, కె.సి.ఆర్ హయాములో గ్రామాలు వికాసంతో విరజిల్లాయని,బిఅరెస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మండల పార్టీ అధ్యక్షులు కె.మాణిక్యం,మాజీ సింగిల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి అన్నారు. కె.సి.ఆర్ గ్రామాలలో పచ్చదనం పరిశుభ్రత పెంచడం వల్ల, ప్రజలలో మానసిక స్థితి స్థిరంగా ఉండి అభివృద్ధి వైపు అడుగులు వేస్తారని నమ్మి, గ్రామాలలో ప్రకృతి వనాలు, పార్కును,వైకుంఠ ధామం,గ్రామీణ క్రీడా మైదానం వంటి వినూత్న సంక్షేమ పథకాలు చేపట్టారని వారు అన్నారు. పారిశుద్ధ్య కార్మికులను పెంచి ప్రతిరోజూ గ్రామం పరిశుభ్రంగా ఉంచారని,10లక్షల రూపాయలు కేటాయించి ట్రాక్టర్ కొనుగోలు చేస్తూ, మంచి నీటి ట్యాంకర్ 1.50లక్షలతో ఏర్పాటు చేసి మొక్కలను కాపాడటమే కాక మంచి నీటి సరఫరా కోసం ఉపయోగించారన్నారు.మన ఊరు మన బడి పేరుతో, నూతన పాఠశాలలు నిర్మించడమే కాక



శిథిలమైన పాఠశాలల్లో నిధులు కేటాయించి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించిన ఘనత కె.సి.ఆర్ దని, అదేవిధంగా గ్రామాలలో సి.సి.రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం ప్రతి ఏటా 10లక్షలు కేటాయించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించిన ఘనత కె.సి.ఆర్ కి చెందుతుందని వారు తెలిపారు.యుద్ధప్రాతిపదికన చెరువుల మరమత్తులు,వాటర్ షెడ్డులు నిర్మించి వ్యవసాయాన్ని కె.సి.ఆర్ పండుగ చేశారని అన్నారు.గ్రామాలను నిర్వీర్యం చేసి విధ్వంస పాలన కొనసాగిస్తున్న రేవంత్ రెడ్డి,గ్రామ పంచాయతీ ఎన్నికలు సకాలములో నిర్వహించకుండా, గ్రామాలకు రాగి పైసా కూడా కేటాయించకుండా గ్రామాలను విధ్వంసం చేసిన నీరో చక్రవర్తి రేవంత్ రెడ్డి అని, దుయ్యబట్టారు. రెండున్నర సంవత్సరాలు కాలయాపన చేసి న్యాయస్థానాలు మొట్టికాయలు వేస్తే బి.సి.రిజర్వేషన్లు అమలు చేయకుండా ఆధారా బాదరాగా ఎన్నికలు నిర్వహించి కేంద్ర నిధులను దారి మళ్లిస్తున్న సి.ఎం,గ్రామీణా అభివృద్ధి పేరిట గ్రామాలకు రావడం సిగ్గుచేటైన అంశం అని ఘాటుగా విమర్శించారు. దేశానికి వెన్నముక్క రైతు అలాంటి రైతు రాజు లాగా ఉండాలని కె.సి.ఆర్ రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించారని దేశములో ఏ రాజకీయ నాయకుడు ఊహించని విధంగా రైతు బంధు,రైతు బీమా ఇచ్చి చూపిన నాయకుడు కె.సి.ఆర్ అని వారు కొనియాడారు.24గంటల కరెంట్,సకాలములో యూరియా అందించి,మద్దతు ధర,సాగు నీళ్లు అందించి వ్యవసాయాని పండుగ చేసిన ఘనత కె.సి.ఆర్ గారిది అన్నారు.కాంగ్రెస్ హయాములో కరెంట్ కోతలతో,యూరియా కొరతతో పంటలు ఎండి మద్దతు ధర లేక వ్యవసాయం పాడు పడి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు.సమస్యలు గాలికి వదిలి ప్రచారం కోసం ఆర్భాటాలు చేయడం విడ్డూరమన్నారు.గ్రామాలకు వచ్చే నాయకులను,అధికారులను ప్రజలు మహిళలకు 2500,ఆసరా పింఛన్లు 4000,తులం బంగారం, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు,కె.సి.ఆర్ కిట్టు,రైతు భరోసా, రైతు రుణ మాఫీ,వ్యవసాయ కూలీలకు రైతు భరోసా ఏమైందని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమములో ధర్మా నాయక్,గంధం.పరంజ్యోతి,నారాయణ నాయక్,మహేశ్వర్ రెడ్డి,నీల స్వామి, వెంకట్ సాగర్,చిట్యాల.రాము, జోహెబ్ హుస్సేన్,రూప్లనాయక్ తదితరులు ఉన్నారు.

## గ్రామసభల ద్వారానే సమస్యలకు పరిష్కారం



**ఊర్కొండ, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** గ్రామ సభల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని ఉర్కొండ ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా మార్చి 9 నుండి జూన్ 2, 2026 వరకు 99 రోజుల పాటు కొనసాగుతుంది. అందులో భాగంగా మండలంలోని 16 గ్రామపంచాయతీలలో గ్రామసభలు గురువారం రోజు ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గత రెండున్నరేళ్ల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, గ్రామ సభల ద్వారా సమస్యలను పరిష్కరించడం మరియు స్థానిక సంస్థలకు అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యమని విద్య, వైద్యం, విద్యుత్, సాగునీరు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, అలాగే పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రగతి ప్రణాళికల రూపకల్పన, క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలను సేకరించడం జరుగుతుందని తెలియజేశారు. జగబోయినపల్లిలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎల్లప్ప సి డబ్ల్యూ సి నాగర్ కర్నూల్ , శ్రీశైలం డీసీపీఓ నాగర్ కర్నూల్ , జకినాలపల్లిలో ఇరిగేషన్ ఏ ఈ బాలకృష్ణ, వర్క్ ఇన్స్పెక్టర్ యూనుస్, గ్రామాల సర్పంచులు , పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు , పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘం సభ్యులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గొప్ప కార్యక్రమం

- **వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**



**వనపర్తి బ్యూరో, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** పేదలు బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాన అజెండాగా రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల మన్ననలు చూరగా ఉంటుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా ఏదుల మండలం ఏదుల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాలాపన చేసి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అందించిన సందేశాన్ని చదివి గ్రామ ప్రజలకు వినిపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత రెండున్నర ఏళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామంలో అమలు చేసిన వివిధ ప్రభుత్వ పథకాలు వాటిని పొందిన లబ్ధిదారుల వివరాలను అధికారులు చదివి వినిపించారు. గ్రామంలో రైతు రుణమాఫీ పొందిన లబ్ధిదారులు, జరిగిన రుణమాఫీ మొత్తం, రైతు భరోసా, వరి ధాన్యం సేకరణ చెల్లించిన నగదు, మొత్తం రేషన్ కార్డులు, కొత్తగా మంజూరు చేసిన రేషన్ కార్డులు, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు, ఇంకా మంజూరు చేయాల్సి ఉన్న వివరాలు, స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్ల లబ్ధిదారులు, ఉచిత చీరల పంపిణీ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించిన పనిదినాలు,మంజూరు అయిన వేతనం, చేపట్టిన పనులు, అంచనా విలువ తదితర అంశాలను లబ్ధిదారుల పేర్లతో సహా చదివి వినిపించారు. గ్రామంలో ఉన్న ప్రజల సమస్యలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యతల పై గ్రామ సభలో చర్చించారు.

**నూతన తహసిల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం**

ఎదుల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే మెఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి నూతన భవనంలో పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏదుల కొత్త మండలం కోసం ప్రభుత్వ భవనాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్లు ముబీనా, మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ పరశురామ్, ఇతర అధికారులు ప్రజలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గుడేలి రమేశ్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్

- **వ్యవసాయ కుటుంబం నుంచి ఉన్నత విద్య శిఖరాగ్రానికి**
- **విద్యార్థులకు ఆదర్శంగా రమేశ్ ప్రయాణం**

**అచ్చంపేట, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** నియోజవర్గ పరిధిలోని బల్మూర్ మండల కేంద్రానికి చెందిన గుడేలి రమేశ్‌కు ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగులో డాక్టరేట్ (పి.హెచ్.డి) పట్టా లభించింది. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన రమేశ్ తన కృషి, పట్టుదలతో ఉన్నత విద్యలో అత్యున్నత స్థాయిని చేరుకోవడం స్థానికంగా ఆనందాన్ని కలిగిస్తోంది.

**కష్టాలను అధిగమించిన విద్యా ప్రయాణం**

గుడేలి రమేశ్, గుడేలి ఆంజనేయులు-అంజనమ్మ దంపతుల కుమారుడు. చిన్ననాటి నుంచే కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనుల్లో సహకరిస్తూనే చదువును కొనసాగించారు. విద్యపై ఉన్న తపనతో అన్ని అడ్డంకులను అధిగమించి ముందుకు సాగారు.ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యను బల్మూరులోనే పూర్తి చేసిన ఆయన, అనంతరం పాలెం శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఓరియంటల్ కళాశాలలో పిడిసి, బి.ఏ (ఎల్) చదివారు. చదువులో ప్రతిభ కనబరుస్తూ ప్రతి సంవత్సరం క్లాస్ ఫస్ట్ ర్యాంకులు సాధించి ధర్మనిధి పురస్కారాలను అందుకున్నారు.

**ఉన్నత విద్యలో ప్రతిభాపాటవం**

2011లో మహబూబ్‌నగర్‌లో టీపీటీ (తెలుగు పండిత శిక్షణ) పూర్తి చేసి అక్కడ కూడా అగ్రస్థానంలో నిలిచారు. అనంతరం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షల్లో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మూడవ ర్యాంకు సాధించారు.2012--14 మధ్య ఎం.ఏ తెలుగు చదువుతున్న సమయంలోనే యుజిసి-నెట్ అర్హతను సాధించారు. 2017లో టి.ఎస్-సెట్ మరియు టెట్ పరీక్షల్లో కూడా ఉత్తీర్ణత సాధించారు. అనంతరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎం.ఏ సంస్కృతం పూర్తి చేశారు.

**పిహెచ్‌డీ ప్రవేశం నుండి పరిశోధన వరకు**

2018లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించిన పిహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో విశ్వవిద్యాలయ స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించి తెలుగు విభాగంలో ప్రవేశం పొందారు.“అనుముల వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి జీవితం -- రచనలు పరిశీలన” అనే అంశంపై పరిశోధన చేసి తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ఆచార్య వెలుదండ నిత్యానందరావు మార్గదర్శకత్వం వహించారు.ఫిబ్రవరి 27న ఫైనల్ వైవా విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, మార్చి 28న ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు అధికారికంగా పిహెచ్‌డీ పట్టా ప్రకటించింది.

**గురువుల మార్గదర్శకత్వమే విజయానికి మూలం**

ఈ సందర్భంగా డా. గుడేలి రమేశ్ మాట్లాడుతూ... పాలెం ఓరియెంటల్ కళాశాలలో చేరిన తర్వాత గురువుల బోధన, మార్గదర్శకత్వం తన జీవితాన్ని పూర్తిగా మార్చిందని తెలిపారు.ప్రత్యేకంగా కట్టా రవికుమార్, డా. ఆలేటి మోహన్ రెడ్డి, కాశిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, డా. బి. రామచంద్రయ్య వంటి గురువుల వద్ద శిష్యరికం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పారు. తల్లిదండ్రులు, గురువుల ఋణం ఎప్పటికీ తీర్చలేనిదని భావోద్వేగంగా తెలిపారు.

**ప్రస్తుతం అధ్యాపకుడిగా సేవలు**

ప్రస్తుతం తాను చదివిన పాలెం డిగ్రీ కళాశాలలోనే తెలుగు



అధ్యాపకునిగా పనిచేస్తూ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ప్రోత్సహిస్తున్నారు.

**పండితుల అభినందనలు**

ఈ విజయంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య చింతకింది కాశీం, పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, డా. ఎస్. రఘు, డా. ఏ. విజయలక్ష్మి, పరీక్షకులు డా. కాకునూరి సూర్యనారాయణమూర్తి తదితరులు అభినందించారు. కొత్త అంశాన్ని ఎంచుకొని నాణ్యత కలిగిన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారని ప్రశంసించారు.

**ప్రేరణగా నిలిచిన విజయగాథ**

వ్యవసాయ కుటుంబం నుండి వచ్చి ప్రభుత్వ విద్యాసంస్థలలో చదివి ఉన్నత విద్యలో డాక్టరేట్ స్థాయికి చేరుకున్న గుడేలి రమేశ్ విజయం అనేక మందికి ప్రేరణగా నిలుస్తోంది. స్థానిక ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మిత్రులు ఆయనను అభినందిస్తున్నారు.

# రేవల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**రేవల్లి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రేవల్లి మండల కేంద్రంలో నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ నూతన తహసిల్దార్ కార్యాలయ భవనాల ఏర్పాటు కోసం కలెక్టర్ చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే మేఘా రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన మండలాల్లో నూతన కార్యాలయ భవనాల ఏర్పాటుకు కృషి చేస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఈ భవనాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో జిల్లాలోని పలు మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల నుంచి సొంత భవనాలకు మారడం సంతోషకరమన్నారు.

**కలెక్టర్ నిధుల నుండి తహసిల్దార్ కార్యాలయాలకు నిధులు :**

ఏదుల, రేవల్లి మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం ఒక్కో భవనానికి రూ.32 లక్షలను కలెక్టర్ తన సొంత నిధుల నుంచి కేటాయించి వేగంగా పూర్తి చేయించడం అభినందనీయమని తెలిపారు. ఈ కొత్త భవనాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం తన సొంత 0-20 గుంటల పొలాన్ని విరాళంగా ఇచ్చిన అంకూరి శాంతమ్మ కుటుంబ సభ్యులను కలెక్టర్ ఆదర్శ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి శాలువాతో సన్మానించారు.

మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్, ఎంపీడీవో



కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు, మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు అనుకుంటే ఏదైనా సాధించొచ్చు

- **మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం**
- **పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్**

**సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 2 (జనం సాక్షి) :** మహిళలు అనుకుంటే ఏదైనా సాధించవచ్చని పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. కొండాపూర్ మండలం తోగార్పల్లి గ్రామంలో గురువారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు. గ్రామ సభను రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గ్రామ ప్రజలకు వినిపించారు.ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో అమలవుతున్న పలు కీలక పథకాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పంచాయతి రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ... జిల్లాలో అధిక శాతం అధికారులుగా మహిళలే ఉన్నారని, మహిళలు పనిచేస్తే




సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, శానిటేషన్ పనులు, గ్రామపంచాయతీ భవనాలు, సంఘ భవనాలు నిర్మించుకోవచ్చని వివరించారు. ఉపాధి కార్డుదారులకు 100 రోజుల పని కల్పించాలని, వేసవిలో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్త వేరు చేసి అందించాలని సూచించారు. గ్రామ సభలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, స్వయం సహాయ సంఘాలకు రుణాలు, డిజిటల్ హెల్త్ కార్డులు, జీవనోపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని, రాబోయే 90 రోజుల్లో శాఖల వారీగా పది ముఖ్య అంశాలపై కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుకు చేరేలా అధికారులు కృషి చేయాలని, గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం తోగరుపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా భవనం పనులను పరిశీలించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను కమిషనర్ దివ్య దేవరాజన్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, పీడీ డీఆర్‌డీఓ జ్యోతి, గ్రామ సర్పంచ్ దివ్య వాణి ప్రశాంత్ గౌడ్, ఉపసర్పంచ్ , ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



**అల్లాదుర్గం, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం పారదర్శకమైన విధానం అమలు చేస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల కార్యచరణ ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా అల్లాదుర్గం మండలం లోని చిల్వర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.గ్రామ సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల యొక్క లబ్ధిదారుల వివరాలను,పంచాయితి కార్యదర్శి లింగప్ప చదివి వినిపించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి ఒక్క సంక్షేమ పథకాలను విధిగా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించుకోవచ్చున్నారు.అనంతరం గ్రామ సర్పంచ్ ముక్కెర శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అధికారుల సహాయంతో ప్రజలకు చేరే విధంగా ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వైష్ణవి, మండల వైద్యాధికారి సారిక, పంచాయతీ కార్యదర్శులు లింగప్ప,ఇతర శాఖల అధికారులు, గ్రామ ప్రజలు ప్రజా ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

# రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే కుడా చైర్మన్ జిల్లా కలెక్టర్



**హనుమకొండ ప్రతినిధి ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** హనుమకొండ హంటర్ రోడ్డు జూ పార్క్ సమీపంలో ఉన్న రీజనల్ సైన్స్ సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ సైన్స్ సెంటర్ పని విధానంతో పాటు అక్కడ ఉన్న వివిధ శాస్త్ర సాంకేతిక పరికరాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. సైన్స్ సెంటర్ లో పనిచేయని పలు పరికరాలను , భవనంలో సౌకర్యాల ఏర్పాట్లను గురించి వారు ఆరా తీశారు. రీజినల్ సైన్స్ సెంటర్ లో నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కల్పన గురించి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఎమ్మెల్యే, కుడా ఛైర్మన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కావలసిన మరమ్మతులు చేయించాలని సూచించారు. తగిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రీజనల్ సైన్స్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న ఎస్సీ ఎస్టీ సెల్ ను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇతర అధికారులతో పాటు రీజనల్ సైన్స్ సెంటర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బంగారు భవిష్యత్తు

- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో,ఏప్రిల్02(జనం సాక్షి):** అంగన్వాడి కేంద్రాలలో చిన్నారుల బంగారు భవిష్యత్తుకు ప్రజా ప్రభుత్వం బాటలు వేస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.గురువారం గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని లక్నవరం క్రాస్ వద్ద ఉన్నా కిచెన్ షెడ్ లో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహిళా శిశు సంక్షేమ శాఖ సెక్రెటరీ అనిత రామచంద్రన్, జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ లతో కలిసి అంగన్వాడి టీచర్లకు 5జి స్మార్ట్ ఫోన్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచడానికి,డిజిటలైజేషన్ ప్రక్రియను సులభతరం చేయడానికి ప్రభుత్వం నూతన స్మార్ట్ ఫోన్లను అందిస్తుందని స్పష్టం చేశారు.నూతన స్మార్ట్ ఫోన్ ద్వారా అంగన్వాడి టీచర్లు గర్భిణీలు, బాలింతలు, 0-6 సంవత్సరాల పిల్లల వివరాలను నమోదు చేసి వారి వివరాలను డిజిటల్ రికార్డులో భద్రపరచడం జరుగుతుందని,అంగన్వాడి కేంద్రానికి వచ్చే పిల్లలు మహిళలు రోజువారి హాజరు నమోదు చేయాలని, పిల్లల ఎత్తు, బరువు, పోషక ఆహారం పంపిణీ వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి డేటా అందించాలని అన్నారు.వీటి ద్వారా అంగన్వాడీ కేంద్రంలో పనితీరు ఒకే చోట నుంచి మానిటరింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు.మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న 5జి స్మార్ట్ ఫోన్ లను వినియోగిస్తూ ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు అంగన్వాడి కేంద్రాల పనితీరును పిల్లలు, గర్భిణి స్త్రీలు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలు అందించే పౌష్టిక ఆహార వివరాలను ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అంగన్వాడీ టీచర్లకు సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అంగన్వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతుందని గ్రామాలలో ఉండే పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో చేరే విధంగా చూడాలన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదని,అంగన్‌వాడీ కేంద్రాలు సౌకర్యాల వసతులతో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ ప్రీ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం విద్యను కూడా ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 545 టీచర్లకు 5+ స్మార్ట్ ఫోన్ లను అందించడం జరిగిందని,పోర్షన్ ట్రాకర్,ఎన్హెచ్ టిఎస్ మొబైల్ అప్లికేషన్లను 5జి స్మార్ట్ ఫోన్ల ద్వారా సులభతరం ఉపయోగించవచ్చని అన్నారు.అంగన్వాడి టీచర్లు సమయపాలన పాటిస్తూ పౌష్టిక ఆహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని విధినిర్వహణలో సమస్యలు తలెత్తితే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ అక్కేశ్వర్ రావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీ,స్థానిక సర్పంచ్ మేకల రాధా, డిడబ్ల్యుఓ ప్రేమలత, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- వార్డుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని భారత్ ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 3, 20, 21 వార్డుల సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల అమలు గురించి వివరించారు. స్థానిక వార్డుల అభివృద్ధిపై దృష్టిసారిస్తూ, భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి, అప్‌గ్రేడేషన్‌కు కృషి చేస్తామని తెలిపారు. అలాగే గృహలక్ష్మి పథకం కింద ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, విద్యా రంగ అభివృద్ధిపై కీలక అంశాలను ప్రస్తావించారు. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలో రైతుల కోసం మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించి సమగ్ర అభివృద్ధి దిశగా పయనిస్తుందని, ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐతా ప్రకాశ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాబు, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి,ఏప్రిల్ 2(జనంసాక్షి):** 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా... గురువారం జిల్లాలోని తరిగొప్పుల మండలంలోని తరిగొప్పుల గ్రామ పరిధిలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. ముందుగా రాష్ట్ర గీతాన్ని ఆలపించి, ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు.అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును క్షుణ్ణంగా వివరించారు. రైతు రుణ మాఫీ, రైతు బీమా, ఇందిరమ్మ ఇళ్లు, స్వయం సహాయక సభ్యులకు మంజూరైన వడ్డీ లేని రుణాల వివరాలు, కొత్త రేషన్ కార్డులు, పాస్ బుక్కులు, సన్న బియ్యం పంపిణీ, వైద్య సేవలు, తదితర పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పూర్తి వివరాలను గ్రామ ప్రజలకు తెలియజేశారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు.గ్రామ సభలో ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులు నమోదు చేసి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోసిన్, మండల ప్రత్యేక అధికారి రాణా ప్రతాప్, గ్రామ సర్పంచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుపై అడవిపంది దాడి

- తీవ్ర గాయాలు

**గంగారం ఏప్రిల్ 2 (జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పుట్టల భూపతి గ్రామానికి చెందిన సోలం రవికుమార్ వయసు 35 సంవత్సరాలు రోజు మాదిరిగానే తన మొక్కజొన్న చేను కావలికి వెళ్ళగా అప్పటికే చేనులో పంటను తింటూ ఉన్న అడవి పంది ఒక్కసారిగా వచ్చి రవికుమార్ పై దాడి చేసి ఎడమ కాలు తొడను మోకాలిని కొరికి తీవ్ర గాయాలు చేయగా చుట్టుప్రక్కల చేనులవాళ్లు వచ్చి అరవడంతో అడవి పంది అక్కడనుండి అడవిలోకి వెళ్లిపోయింది కుటుంబ సభ్యులు వెంటనే రవికుమార్ ను 108 లో నర్సంపేటలోని ప్రైవేట్ హాస్పిటల్ కు తీసుకువెళ్లగా తీవ్ర గాయాల పాలైన రవికుమార్ కు డాక్టర్లు తొంటికి ఆపరేషన్ చేశారు. రవికుమార్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. మండలంలో ఎప్పుడూ లేని విధంగా అడవి పంది దాడి చేయడంతో రైతులు తమ పంటలు చేతికి రావాలంటే ఇంకా చాలా సమయం పడుతుంది ఇలా అయితే మా చేను దగ్గర ఎలా కాపలా ఉండాలి అని గ్రామ రైతులు ఎంతో భయాందోళనకు గురవుతున్నారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు





- ఇద్దరికి తీవ్ర గాయాలు

**మంగపేట ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్ని సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం మండలంలోని పాలాయిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై టివిఆర్ సూరి తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెరికవీడు గ్రామానికి చెందిన భాషబోయిన సుధాకర్ (35) తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తమ బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్న క్రమంలో మండలంలోని పాతాయిగూడెం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో మంగపేట నుండి మణుగూరు వైపు వెళుతున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సును ఎదురుగా వచ్చి కారు ఢీ కోటింది. ఈ ఘటనలో కారును నడుపుతున్న సుధాకంకు పక్కనే ఉన్న సుధాకర్ తండ్రి ఆశాలు (65)కు తీవ్ర గాయాలు కాగా కారులో ఉన్న మరో ముగ్గురికి స్వల్ప గాయాలు అయినట్లు ఎస్సై సూరి వెళ్ళడించారు. సంఘటన జరిగిన వెంటనే గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో ఏటూరునాగారం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

# వార్డు సభల ద్వారా స్థానిక సమస్యల పరిష్కారం

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, ఏప్రిల్02 (జనంసాక్షి) :** వార్డు సభల నిర్వహణ ద్వారా వార్డులలో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని బుధవార్ పేట్, మోచి గల్లి లో ఏర్పాటుచేసిన వార్డు సభలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ వార్డు సభ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల సంక్షేమం కొరకు ఎన్నో పథకాలు అమలు పరుస్తుందని, ప్రజలంతా ఆ పథకాలను వినియోగించుకోవాలని అన్నారు. క్రమం తప్పకుండా నిర్ణిత వ్యవధిలోపు వార్డు సభలు ఏర్పాటు నిర్వహించి, స్థానికంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలాన్ని అర్హులైన వారందరూ పొందాలని చెప్పారు. గ్రామ సభలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని అధికారులు ప్రజలకు చదివి వినిపించారు. స్థానిక ప్రజలు వివిధ పథకాల రూపంలో పొందిన లబ్ధి వివరాలు చదివి వినిపించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ప్రజలంతా అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి భాగస్వామ్యం అవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం, ఇటీవలి జిల్లాకు రెండు స్కోచ్ అవార్డులు లభించడానికి గాను విశిష్ట కృషి చేసిన కలెక్టర్ ను మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు శాలువాలతో సన్మానించి ,అభినందనలు తెలియజేశారు. ఈ వార్డు సభలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు అప్పాల కావ్య, గణేష్ చక్రవర్తి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, స్థానిక ప్రజలు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# మీసేవ సర్వీసులకు తాత్కాలిక అంతరాయం

**ములుగు బ్యూరో,ఏప్రిల్02(జనం సాక్షి):** సర్వర్ నిర్వహణ పనుల నేపధ్యం లో మీసేవ ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనున్నట్లు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఏప్రిల్ 3 రాత్రి 10 గంటల నుంచి ఏప్రిల్ 5 ఉదయం 8 గంటల వరకు నిర్వహణ పనులు కొనసాగనున్నట్లు తెలిపారు. సర్వర్ పనితీరు మెరుగుదల,భద్రత వ్యవస్థల సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో సంబంధిత విభాగాలకు చెందిన ఆన్లైన్ సేవలు డిజిటల్ లావాదేవీలు,వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా పనిచేయవని, జిల్లా ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతిక వ్యవస్థలను ఆధునీకరించడంలో భాగంగానే ఈ చర్యలు చేపడుతున్నామని, భవిష్యత్తులో వేగవంతమైన అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ నిర్వహణ ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో వెల్లడించారు.

# కలెక్టరేట్లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**నిర్మల్ రురల్, ఏప్రిల్ 2, (జనంసాక్షి) :** గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పీడిత వర్గాల కొరకు పోరాటాలు చేసిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఇటువంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు అధికారికంగా నిర్వహించడం గొప్ప విషయం అని అన్నారు. ఈ వర్ధంతి కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, బిసి, మైనారిటీల సంక్షేమ అధికారులు శ్రీనివాస్, మోహన్ సింగ్, డీఈవో భోజన్న, పలువురు కుల సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ మురళీ నాయక్



**గూడూరు, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** రైతులు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానుకోట ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు.గురువారం గూడూరు మండల కేంద్రంలోని మార్క్ ఫెడ్ వారి సౌజన్యంతో సహకార సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్క జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు పెద్దపీట వేసిందని,రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు బోనస్,రైతు భరోసా నిధులను కూడా ఇస్తున్నదని, రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలియజేశారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధరకే అమ్ముకోవాలని,మధ్య దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్,ఉప సర్పంచ్ చంటి స్వామి,మండల అధ్యక్షులు చిట్టే వెంకన్న,యూత్ కాంగ్రెస్ బొల్లికొండ మధు,నెక్కొండ ఏఎంసి మార్కెట్ వైస్ చైర్మన్ నరేష్ రెడ్డి,శ్రీపాల్ రెడ్డి,తహసీల్దార్ నాగ భవాని, ఎంపీడీఓ సత్యనారాయణ,వ్యవసాయ అధికారి ఎండీ అబ్దుల్ మాలిక్,ఎండీ రసూల్, షాజహాన్,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,మండల నాయకులు వార్డు మెంబర్లు, మార్క్ ఫెడ్ అధికారులు, రైతులు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వ పథకాల అమలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఏప్రిల్ 2 (జనంసాక్షి):** ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రభుత్వం గురువారం రోజు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గ్రామ సభ/వార్డు సభల నిర్వహణలో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుచరిత, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ లతో కలిసి హాజరై 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరిగాయని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులు, మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులు, లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా చెన్నూర్ ప్రాంతంలో బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కుటుంబ భీమా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థినిల ఎంపిక



**పాలకుర్తి, ఏప్రిల్ 02(జనంసాక్షి)** మహారాష్ట్ర రాష్ట్రంలోని పూనేలో ఈ నెల 3 నుంచి 6 వరకు జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు చెన్నూరు జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థిని మంచాల అంజలి, తొర్రూరు జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థి పసులాది నవ్య ఎంపికయ్యారు. మార్చి నెలలో వికారాబాద్లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు అ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుస్కూరి రమేష్ రావు. రమేష్ తెలిపారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయా గ్రామల సర్పంచులు కారుపోతుల శ్రీనివాస్, పసులాది యాకస్వామి, ఉపాధ్యాయులు అభినందించారు.

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 03 ఏప్రిల్ 2026

# సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకే గ్రామసభలు



**మణుగూరు, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భాగంగా 99 రోజుల కార్యచరణలో గురువారం సమితి సింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ముఖ్యంగా అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారుల తమ విభాగంలో జరిగిన ప్రగతి నివేదికలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో మహిళలకు పెద్ద పీట వేసింది. ఉచిత బస్సు వల్ల తెలంగాణ ప్రభుత్వంలో పదివేల కోట్ల మహిళలు కోసం చెల్లించింది. అలాగే ప్రతి పేదవాడికి మూడు పూటలా కడుపునిండా తినగలిగే విధంగా సన్న బియ్యం పంపిణీ చేసింది. పినపాక నియోజకవర్గం లో మొదట విడుదగా 3,500 ఇందిరమ్మలని మంజూరు చేయగా అదనంగా 1000 ఇందిరమ్మలను మంజూరు చేసి సొంతింటి కలలను నెరవేర్చింది. డ్వాక్రా మహిళలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను మంజూరు చేసి మహిళా సాధికారతకు ఆర్థిక అభివృద్ధికి సహకరించింది. ఉచిత కరెంటు గృహజ్యోతి పథకం ద్వారా పంచాయతీ పరిధిలో 832 గృహాలకు రూ.71, 02,293 కోట్లు చెల్లించింది. 1084 మందికి రూ 24,75,312 చెల్లించింది. ప్రభుత్వ పాఠశాలలో చదివి గత సంవత్సరం ఇద్దరూ అత్యధిక ర్యాంకులు సాధించారు ప్రభుత్వం నుంచి ఉచిత పుస్తకాలు ఏకరూప దుస్తులు కిట్ బ్యాగు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయటం జరిగింది. తాగునీటి కోసం రెండు ట్యాంకు లను నిర్మించారు. ఆర్థిక సంవత్సరంలో ప్రతి హాస్టల్ కాలేజీలకు అల్పాహార ఏర్పాటు చేయాలని నిర్ణయించింది మణుగూరు మండలంలో మారుమూల ప్రాంతంలో కూడా ఆర్టీసీ బస్సు వెళ్లాలని లక్ష్యంతో పనిచేస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలి అన్నారు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో పారదర్శకంగా చేయాలన్నారు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అభివృద్ధిలో ముందుండాలన్నారు. సంక్షేమ పథకాలు అందని నిరుపేదలు నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం అర్హులైన దివ్యాంగులకు ఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్కూటీలు, వీల్ చైర్లు , ట్రైసైకిల్లు పంపిణీ చేశారు.

### సొంతింటి కల నెరవేరింది

ఎన్నికల సమయంలో సమితి సింగారం గ్రామ పంచాయతీలో ప్రచారం కోసం తిరుగుతున్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం గెలిస్తే ఇందిరమ్మ ఇల్లు ఇస్తా అని అన్నారు. గెలిచిన తర్వాత గుర్తుపెట్టుకుని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. మార్చి 8న గృహప్రవేశానికి ఎమ్మెల్యే రావడం ఎంతో సంతోషాన్నిచ్చింది. సొంతింటి కల నెరవేరటంలో సహకరించిన ఎమ్మెల్యే, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.- వెంకట రమణ (ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారి) ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అద్దంకి నరేష్. ఎంపీఓ వెంకటేశ్వర్లు. వివిధ శాఖల అధికారులు మండల అధ్యక్షుడు నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ, సర్పంచ్ మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, జీవి, గణేష్, రవి, ఎ ఎం చారి, సౌజన్య మానస షబానా తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరం



**పి.ఏ.పల్లి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** బాలల హక్కుల పరిరక్షణ వేదిక నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శిగా పి.ఏ.పల్లి మండల కేంద్రానికి చెందిన పొతెం కరుణాకర్ ను రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పొతెం కరుణాకర్ మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలను హోటల్లు,బైక్ పాయింట్,వివిధ దుకాణాల్లో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని దానికి తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.నల్లగొండ జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకై బాలల వెట్టిచాకిరీ నిర్మూలన,బాల్య వివాహాల నిర్మూలన వంటి వాటి నిర్మూలనకు పాటు పడతానని ఆయన అన్నారు.తన ఎన్నికకు సహకరించిన ఏంవిఎఫ్ చైర్మన్ ఆర్.వెంకట్ రెడ్డి,సిఆర్పిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గంజి వేణుగోపాల్,రాష్ట్ర నాయకులు ఎర్ర శివరాజు,జిల్లా నాయకులు జిల్లా శ్యాంసన్,మెరుగు పెద్దయ్య యాదవ్,శోభారాణి, విజయలక్ష్మి,లలిత,వినోద తదితరులు పాల్గొన్నారు.

## మీ సేవ ఆన్‌లైన్ సేవలలో అంతరాయం

- సర్వర్ నిర్వహణ పనుల కారణంగానే సేవల నిలుపుదల
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట ప్రతినిధి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) : సర్వర్ నిర్వహణ పనుల నేపథ్యంలో మీ సేవ ఆన్ లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.నేటి సాయంత్రం 5గంటల నుంచి 5వ తేదీ ఉదయం 8 గంటల వరకు నిర్వహణ పనులు, సర్వర్ పనితీరు మెరుగుదల, భద్రతా వ్యవస్థల అప్ గ్రేడ్, సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నారని తెలిపారు.ఈ సమయంలో సంబంధిత విభాగాలకు చెందిన ఆన్ లైన్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా పనిచేయవని, ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని సూచించారు.నిర్వహణ పూర్తయిన అనంతరం సేవలు సాధారణ స్థితికి చేరుకుంటాయని తెలిపారు. సాంకేతిక వ్యవస్థలను ఆధునీకరించడంలో భాగంగానే ఈ చర్యలు చేపడుతున్నారని, భవిష్యత్తులో వేగవంతమైన, అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ నిర్వహణ ఉపయోగపడుతుందని తెలిపారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**వెల్దండ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రత్యేక కార్యక్రమం)లో భాగంగా నిర్వహించిన గ్రామసభ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.గ్రామానికి 48 ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఇంకా ఇళ్లు లేని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు.గ్రామానికి చెందిన 989 మంది లబ్ధిదారులకు ఉచిత కరెంట్ అందించామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి వారికి ఉచితంగా సన్న బియ్యం ప్రభుత్వం పంపిణీ చేస్తోందని వివరించారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కావాలని గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను మండలానికి కేటాయిస్తామని హామీ ఇచ్చినందున గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఎమ్మెల్యే కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, అనంతరం మండల కేంద్రానికి చెందిన సుధా సత్యనారాయణ కు 49000/- వేల రూపాయల చెక్కు ను, అన్నెపు పద్మ అనే బాధితురాలికి 19000/- వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీఓ కృష్ణయ్య,డీఈ బసవలింగం, ఏడీ శంకర్, తహశీల్దార్ కార్తీక్ కుమార్, మండల వైద్యాధికారిణి సింధు,జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాజీ సర్పంచి యెన్నం భూపతి రెడ్డి, ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, ఉప సర్పంచ్ బస్నమోని శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు గౌడ్,కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, పసునోజు వాణి పురుషోత్తం, ముదికొండ కవిత రమేష్, మారేపల్లి మంజుల శ్రీను,గుద్దటి కిష్టయ్య, గోసుల కొండయ్య, మసిగుండ్ల వెంకటేష్, జంగిలి సునీత ఆనంద్, బాదేపల్లి రమేష్, పిల్లి దేవేందర్ ,రేవల్లి మానస రాజు, సిర్సనగండ్ల శేఖర్, రవీందర్ రెడ్డి, నాయకులు ఎండి రషీద్, తిరుపతి రెడ్డి, మండలమోని కృష్ణ,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మట్ట భరత్,కొయ్యల పుల్లయ్య,అన్నెపు వెంకటేష్, రాజు,అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మెనూ మాయం ఎంఈఓ మౌనం

- ధర్మాపురం పాఠశాలలో ఒకే కూరతో వడ్డన
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలాడుతున్న నిర్వాహకులు

**మాడుగులపల్లి, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అభాసుపాలవుతోంది మండల విద్యాశాఖాధికారి (ఎం ఈ ఓ) పర్యవేక్షణ లోపం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలోని ధర్మాపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రభుత్వ మెనూను తుంగలో తొక్కి, విద్యార్థులకు కేవలం ఒకే ఒక కూరతో భోజనం వడ్డించారు. పౌష్టికాహారం అందించాల్సిన చోట కంటితుడుపు చర్యగా భోజనం పెడుతుండటంపై తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మెనూ సరిగ్గా అమలు కావడం లేదని, నాణ్యత లేని భోజనం పెడుతున్నారని పలుమార్లు గ్రామస్తులు, విద్యార్థి సంఘాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినప్పటికీ మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టకపోవడం, బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎంఈఓ నిర్లక్ష్యం వల్లే మధ్యాహ్న భోజన ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని, ఫలితంగా విద్యార్థులకు అందాల్సిన గుడ్డు, పప్పు, చిక్కీ వంటివి కాగితాలకే పరిమితమవుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి



### ఒకే కూరతో సరిపెట్టిన వైనం

ధర్మాపురం పాఠశాలలో నేడు కనీసం పప్పు కూడా లేకుండా, కేవలం ఒకే రకమైన కూరగాయతో అన్నం వడ్డించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి పిల్లలకు పోషకాలు అందించాలనే ప్రభుత్వ ఆశయం ఇక్కడ నీరుగారుతోంది అధికారుల నిర్లక్ష్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

మండల విద్యాశాఖ అధికారుల తీరు మారకుంటే విద్యార్థుల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి వెంటనే స్పందించి, మాడుగులపల్లి మండలంలో మధ్యాహ్న భోజన పథకం తీరుపై విచారణ జరిపించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నాలుగు లేబర్ కోడ్‌లపై ఆశా వర్కర్ల నల్లబ్యాడ్జీలతో నిరసన



**కాప్రా, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** కార్మికులను బానిసలుగా మార్చే కేంద్ర నాలుగు లేబర్ కోడ్ ను వెంటనే రద్దు చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం రేవతి అన్నారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్కర్లు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి మాట్లాడుతూ.. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల అమలు కోసం రాష్ట్రాలకు ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.."నాలుగు లేబర్ కోడ్ల అమలు రోజును కార్మికుల జీవితాల్లో చీకటి రోజుగా (బ్లాక్ డే)గా గుర్తిస్తాం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ పునరాలోచించి కోడ్లను రద్దు చేసి పాత చట్టాలను అమలు చేయాలి," అని రేవతి కళ్యాణి పేర్కొన్నారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ఉన్నికృష్ణ మాట్లాడుతూ.. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా తీసుకొచ్చి కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నాచారం, మల్లాపూర్, చర్లపల్లి, కుషాయిగూడ,కీసర వంటి ప్రాంతాల్లో ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్లు అమలు అయితే కార్మికుల హక్కులు కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు లత, యాదమ్మ, మమత, ప్రవీణ్ తదితరులు, స్థానిక ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి టౌన్, ఏప్రిల్ 2 (జనం సాక్షి) :** భువనగిరి మున్సిపాలిటీలోని 22వ వార్డులో కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ అధ్యక్షతన ప్రజా పాలన - పట్టణ ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా వార్డు సభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. ఆసరా పెన్షన్లు, రైతు భరోసా, భీమా వంటి పథకాలు సమర్థవంతంగా అమలు అవుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని కోరగా వెంటనే అంగీకరించిన ఎమ్మెల్యేకు వార్డు ప్రజల తరపున కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బర్రె పూజిత జహంగీర్, బొంతల నర్సింహా, సుధగాని సరితా రాజు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పొత్నక్ ప్రమోద్ కుమార్, పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రజలకు తెలిసేలా గ్రామసభలు

- ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరేలా గ్రామసభల నిర్వహణ.
- విద్య, వైద్యం, సంక్షేమంతో గ్రామాభివృద్ధి సాధ్యం..
- జిల్లా కలెక్టర్ అంకిత్



**మణుగూరు, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..., గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రగతిని ప్రజలకు వివరించడమే కాకుండా గ్రామ, వార్డు స్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రభుత్వం యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు.

### త్వరలో కొత్త పథకాలు :

ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అల్పాహారం వంటి కొత్త పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలులో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో పెండింగ్ దరఖాస్తులు, అర్హతలు, అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి విద్య ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య సేవల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

### అశ్వాపురంలో అమలు చేసిన పథకాల వివరాలు

రైతు భరోసా కింద 1,369 మందికి రూ. 2.34 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు కింద 58 మందికి రూ. 2.90 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా రూ. 75.58 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు. గ్యాస్ సబ్సిడీ కింద 1,000 మందికి రూ. 20.11 లక్షలు, చేయూత పింఛన్ల ద్వారా 803 మందికి రూ. 19.33 లక్షలు అందించినట్లు తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 1,156 మంది లబ్ధి పొందినట్లు చెప్పారు.

కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ కింద 153 మందికి రూ. 82.09 లక్షలు, 1,235 రేషన్ కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 585.69 లక్షలు, వడ్డీ లేని రుణాలుగా రూ. 28.14 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లను సభలో చదివి వినిపించి, వాటి అమలుపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు.గ్రామసభల్లో స్థానిక సమస్యలపై చర్చించి, ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి తీర్మానాలు చేయాలని సూచించారు. ఈ వివరాలను ప్రత్యేక రిజిస్టర్లలో నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు.గ్రామస్థాయిలో ప్రజల ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రత్యేక ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఆకారపు మణిధర్, మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంపీడీవో ముత్యాలరావు, సర్పంచ్ బానోత్ సవర్లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్, అన్ని శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి



**పి.ఏ.పల్లి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణ యందు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న99 రోజుల గ్రామ ప్రణాళిక సందర్భంగా గ్రామ సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో,అధికారులు,వార్డు సభ్యులతో కలిసి గ్రామసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షెడ్యూల్ కులాల డి.డి,పి.ఏ.పల్లి మండల స్పెషల్ ఆఫీసర్ శశికళ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు, అధికారులతో కలిసి ఐక్యమతగా ఉండి గ్రామ అభివృద్ధి కొరకు పాటుపడాలని ఆమె అన్నారు. గ్రామానికి సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వంగాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామసభలో గ్రామస్తులు,గ్రామసభ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన గ్రామస్తులకు హామీ ఇచ్చారు.అధికారులు, గ్రామస్తులు, రాజకీయ నాయకుల అండదండలతో గ్రామ పంచాయతీ అభివృద్ధికి ముందుకెళ్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి చంద్రమౌళి,పంచాయతీ కార్యదర్శి అక్షిత,మాజీ ఎంపీపీ తేరా సత్యనారాయణ రెడ్డి,ధర్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,సహదేవుడు,శ్రీనివాస్,ఉప సర్పంచ్ వెంకటయ్య మరియు వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
3 ఏప్రిల్ 2026

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్

- సెన్సెక్స్ ఉదయం 900 పాయింట్లు నష్టపోయి తర్వాత 185 పాయింట్లు లాభపడింది
- నిఫ్టీ ఒక దశలో 496 పాయింట్లు క్షీణించి 33.70 పాయింట్లు పుంజుకుంది

**ముంబయి, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం భారీ నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు క్లోజింగ్ సమయానికి కాస్త పుంజుకుని సానుకూలంగా ముగిశాయి. ఉదయం ఒక దశలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఏకంగా రూ.10 లక్షల కోట్లు నష్టపోయింది. ఇరాన్‌కు ట్రంప్ చేసిన హెచ్చరికలు మరియు యుద్ధం ముగియడానికి రెండు వారాలు సమయం పడుతుందని చేసిన ప్రకటన మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల వద్ద భారీ నష్టంతో ప్రారంభమైంది. అంతకుముందు రోజు మార్కెట్ 73,134.32 వద్ద ముగిసింది. అంటే దాదాపు 900 పాయింట్లు నష్టంతో ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో ఇంకా నష్టపోయి 71,545.81 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా కోలుకున్న సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 185.23 పాయింట్లు (0.25 శాతం) లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 కూడా ఒక దశలో 496 పాయింట్లు నష్టపోయింది. తర్వాత 33.70 పాయింట్లు (0.15 శాతం) కోలుకుని 22,713 వద్ద ముగిసింది.

ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్ ఇచ్చినప్పటికీ యుద్ధం త్వరలో ముగిస్తామని చేసిన సానుకూల సంకేతాలు మార్కెట్‌ను కొంతవరకు ఊరట కలిగించాయి. అయితే ఉదయం భారీ నష్టాలు రావడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. ఆర్బీఐ తాజా రూల్స్ నేపథ్యంలో



బ్యాంకింగ్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్, ఎస్‌బీఐ బ్యాంకులు, లార్సెన్ అండ్ టర్బో, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా వంటి సంస్థలు భారీగా నష్టపోయాయి. మరోవైపు రూపాయి విలువ బలపడింది. డాలర్‌తో మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ ధర 108 డాలర్లకు చేరింది. ఔన్స్ బంగారం ధర 4,616 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.

ఈ రోజు మార్కెట్ ఉదయం భారీ నష్టాల నుంచి కోలుకుని స్వల్ప లాభాలతో ముగియడం ఇన్వెస్టర్లకు కొంత ఊరట కలిగించింది. ట్రంప్ యుద్ధ హెచ్చరికలు మరియు యుద్ధం ముగియడానికి రెండు వారాలు సమయం పడుతుందని చేసిన ప్రకటన మార్కెట్‌లో అనిశ్చితిని సృష్టించాయి. ఆర్బీఐ తాజా రూల్స్ కారణంగా బ్యాంకింగ్ షేర్లు ఒత్తిడికి గురవ్వడం కూడా నష్టాలకు దోహదపడింది. అయితే ట్రేడింగ్ ముగిసే సమయానికి మార్కెట్ కొంత కోలుకోవడం ఇన్వెస్టర్లలో కొంత ఆశను కలిగించింది.

అయితే యుద్ధ అనిశ్చితి ఇంకా కొనసాగుతున్నందున మార్కెట్ ఇంకా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రేపటి ట్రేడింగ్‌లో ట్రంప్ మరిన్ని సానుకూల సంకేతాలు ఇస్తే మాత్రమే లాభాలు కొనసాగే అవకాశం ఉంది. లేకపోతే మార్కెట్ మళ్లీ ఒత్తిడికి లోనవ్వవచ్చు. మొత్తంమీద ఈ రోజు మార్కెట్ ప్రదర్శన మిశ్రమ ఫలితాలను ఇచ్చింది. ఉదయం భారీ నష్టాలు చూసిన ఇన్వెస్టర్లు ముగింపు సమయానికి కొంత ఊరట పొందారు. యుద్ధ పరిస్థితులు మరియు ఆర్బీఐ రూల్స్ వంటి అంశాలు మార్కెట్ భవిష్యత్తుపై ఇంకా అనిశ్చితిని కలిగించి ఉన్నాయి.

### ట్రంప్ టారిఫ్.. ఫార్మా స్టాక్స్ కుదేలు

ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోవైపు తన టారిఫ్ వార్‌ను కొనసాగిస్తూనే ఉన్నారు. ఫార్మా దిగుమతులపై 100 శాతం సుంకాలు విధించేందుకు సిద్ధమవుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాలతో దేశీయ ఫార్మా కంపెనీల స్టాక్స్ గురువారం ట్రేడింగ్ సెషన్‌లో భారీగా నష్టపోయాయి. అమెరికాలో తయారీకి ఒప్పందానికి ముందుకు రాని కంపెనీల ఫార్మా ఉత్పత్తులపై 100 శాతం సుంకం విధించేందుకు వైట్ హౌస్ సిద్ధమవుతోందని అంతర్జాతీయ మీడియా నివేదికలు తెలిపాయి. ట్రంప్ గతంలోనే అమెరికాలో తయారీకి ముందుకొస్తే సుంకాల నుంచి మినహాయింపు ఉంటుందని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే సుప్రీం కోర్టు తీర్పు పరిధిలోకి రాకుండా సెక్షన్ 232 కింద సుంకాలు వేయాలని ట్రంప్ యోచిస్తున్నట్లు సమాచారం.

### ఫార్మా స్టాక్స్‌పై తీవ్ర ఒత్తిడి

ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయ ఫార్మా కంపెనీల స్టాక్స్ గురువారం అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. బయోకాన్ 5 శాతం మేర నష్టపోగా, గ్లెన్‌మార్క్ ఫార్మా, అరబిందో ఫార్మా, సన్‌ఫార్మా, ఎల్‌పీసీఏ ల్యాబ్స్ వంటి స్టాక్స్ 4 శాతం మేర నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. నిఫ్టీ 50 ఇండెక్స్ ఈ ఉదయం దాదాపు 2 శాతం మేర నష్టపోగా, నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 3.8 శాతం మేర క్షీణించింది. అమెరికా భారత ఫార్మా కంపెనీలకు అతి పెద్ద మార్కెట్. ఆ దేశానికి అవసరమైన జనరిక్ డ్రగ్స్‌ను భారత్ ఎగుమతి చేస్తుంటుంది. దీంతో పెద్ద మొత్తంలో ఆదాయం అక్కడి నుంచి సమకూరుతుంది. ట్రంప్ టారిఫ్ హెచ్చరికలు ఈ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

గతేడాది కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదన తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లోనూ ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ప్రస్తుతం మళ్లీ అదే పరిస్థితి తిరిగి వచ్చింది. ట్రంప్ యొక్క ఈ చర్యలు భారత ఫార్మా రంగంపై దీర్ఘకాలిక ప్రభావం చూపవచ్చని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వార్తల నేపథ్యంలో ఫార్మా సెక్టర్ ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండాలని సలహా ఇవ్వబడుతోంది. ట్రంప్ ప్రకటనలు మరింత స్పష్టమైన తర్వాత మార్కెట్ ప్రతిస్పందన ఎలా ఉంటుందనేది ఇంకా గమనించాల్సి ఉంది.

| నెక్ గుడ్ల ధరలు | ఫామ్‌గేట్ | డజన్ |
|---|---|---|
| హైదరాబాద్ | ₹ 380 | ₹ 45.60 |
| వరంగల్ | ₹ 382 | ₹45.84 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)

| | | |
|---|---|---|
| హైదరాబాద్ | ₹1,48,970 (24 క్యారెట్లు) | ₹1,36,550 (22 క్యారెట్లు) |
| చెన్నై | ₹1,40,500 (22 క్యారెట్లు) | ₹1,53,270 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹2,65,000

# లక్ష్యాన్ని మించిన పరోక్ష పన్ను వసూళ్లు

- 2025-26లో రూ.15.52 లక్షల కోట్లు దాటిన ఆదాయం
- కస్టమ్స్ 102%, ఎక్సైజ్ 101%, సీజీఎస్టీ 100.8% వసూళ్లు
- పాన్ మసాలా సెస్సు మాత్రం 63% మాత్రమే - కొత్త పన్ను కావడం వల్ల తగ్గుదల
- కేంద్రం ఈ ఏడాది రూ.14 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకుంది





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.15.52 లక్షల కోట్ల మేర పరోక్ష పన్నుల (ఇండైరెక్ట్ ట్యాక్స్) వసూళ్లను లక్ష్యంగా పెట్టుకోగా, వాస్తవ వసూళ్లు ఆ అంచనాలను మించాయి. కస్టమ్స్, ఎక్సైజ్, జీఎస్టీ కలిపి సవరించిన అంచనాలు రూ.15.52 లక్షల కోట్లు దాటినట్లు ప్రభుత్వవర్గాలు గురువారం వెల్లడించాయి.

కస్టమ్స్ డ్యూటీ అంచనాలతో పోలిస్తే 102 శాతం, ఎక్సైజ్ డ్యూటీ 101 శాతం, సీజీఎస్టీ 100.8 శాతం వసూలైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. మొత్తంగా జీఎస్టీ, ఇతర పన్నులు కలిపి పరోక్ష పన్ను వసూళ్లు 101.2 శాతంగా ఉన్నట్లు వెల్లడించాయి. పాన్ మసాలా సెస్సు మాత్రం లక్ష్యం చేరుకోలేదు మిగిలిన అన్ని పన్నులూ లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ, ఒక్క పాన్ మసాలాపై విధించిన హెల్త్ మరియు నేషనల్ సెక్యూరిటీ సెస్సు మాత్రం అంచనాలను అందుకోలేకపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరి 1 నుంచి 40 శాతం జీఎస్టీ రేటుకు అదనంగా ఈ ప్రత్యేక సెస్సును కేంద్రం వసూలు చేస్తోంది. ఈ సెస్సు రూపంలో రూ.2,330 కోట్లు వస్తాయని ప్రభుత్వం భావించగా, కేవలం 63 శాతం మాత్రమే లక్ష్యాన్ని చేరుకుంది. కొత్తగా ప్రవేశపెట్టిన పన్ను కావడం వల్ల ఈ తగ్గుదల ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఈ సెస్సు రూపంలో రూ.14 వేల కోట్లు రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. విశ్లేషణ పరోక్ష పన్ను వసూళ్లు లక్ష్యాన్ని మించడం దేశ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం మరియు వినియోగం పెరుగుదలను సూచిస్తోంది. కస్టమ్స్ మరియు ఎక్సైజ్ రంగాల్లో మంచి వృద్ధి కనిపించడం గమనార్హం. అయితే, కొత్తగా ప్రవేశపెట్టిన పాన్ మసాలా సెస్సు లక్ష్యం చేరుకోకపోవడం కొత్త పన్నుల అమలు సవాళ్లను తెలియజేస్తోంది. మొత్తంమీద ఈ సానుకూల పరిణామం కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రారంభానికి మంచి సంకేతంగా భావించవచ్చు.

# న్యాయమూర్తి నోట 29 అక్షరాల 'ఫ్లాక్సినాసినిహిలిపిలిఫికేషన్'

- నిర్మలా సీతారామన్‌పై పరువునష్టం కేసు కొట్టేసిన ఢిల్లీ కోర్టు
- లిపికా మిశ్రా ఆరోపణలు 'విలువలేనివి' అని న్యాయమూర్తి వ్యాఖ్య

న్యూఢిల్లీ, మార్చి 31: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌పై దాఖలైన పరువునష్టం కేసు విచారణ సందర్భంగా ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి ఉపయోగించిన ఒక ఇంగ్లీషు పదం ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్రంగా ట్రెండ్ అవుతోంది. అదే 29 అక్షరాలు కలిగిన "**Floccinaucinihilipilification**". బుధవారం ఈ కేసును కొట్టేసిన ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి, లిపికా మిశ్రా (ఆమ్ ఆద్మీ పార్టీ నేత సోమనాథ్ భారతి భార్య) ఆరోపణలను వివరిస్తూ ఈ పదాన్ని ఉపయోగించారు. ఆరోపణల్లో నిజం లేదని, ఈ పిటిషన్‌కు ఎలాంటి అర్హత లేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు.

### 'ఫ్లాక్సినాసినిహిలిపిలిఫికేషన్' అంటే ఏమిటి?

ఈ పదం అర్థం "ఏదైనా విషయాన్ని నిరుపయోగమైనదిగా, విలువలేనిదిగా పరిగణించడం". లాటిన్ భాషా మూలాల నుంచి వచ్చిన ఈ పదం flocci, nauci, nihili, pili అనే నాలుగు పదాలను కలిపి ఏర్పడింది. ఇవన్నీ "విలువ లేదు", "పనికిరానిది" అనే అర్థాలను ఇస్తాయి.


చూడటానికి చాలా పొడవుగా, పలకడానికి క్లిష్టంగా ఉండటంతో రోజువారీ సంభాషణల్లో ఈ పదం ఎక్కువగా వాడబడదు. గతంలో కాంగ్రెస్ నేత శశిథరూర్ ఈ పదాన్ని ఉపయోగించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కోర్టు తీర్పులో మళ్లీ ప్రయోగించడంతో నెటిజన్లు ఆసక్తిగా దాని అర్థం, ఉచ్ఛారణ వెతికేస్తున్నారు. 2024 ఎన్నికల సమయంలో ఓ మీడియా సమావేశంలో నిర్మలా సీతారామన్ తనపై అనుచిత వ్యాఖ్యలు చేశారని లిపికా మిశ్రా ఆరోపించారు. తమ వైవాహిక విభేదాలను ప్రస్తావిస్తూ పరువుకు భంగం కలిగించారని దావా వేశారు. అయితే న్యాయమూర్తి ఈ ఆరోపణలను "ఫ్లాక్సినాసినిహిలిపిలిఫికేషన్" అని వ్యాఖ్యానించి, పిటిషన్‌ను కొట్టేశారు.

నెటిజన్లు ఈ పదాన్ని చూసి ఆశ్చర్యపోతూ, "ఇంత పొడవైన ఇంగ్లీషు పదం కోర్టులో ఎలా వచ్చింది?", "ఇప్పుడు నేను కూడా ఉపయోగించాలి" అని సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలు పంచుకుంటున్నారు. ఈ ఘటనతో 'ఫ్లాక్సినాసినిహిలిపిలిఫికేషన్' మళ్లీ వైరల్ అయింది. ఇది భారత కోర్టుల్లో ఉపయోగించే అరుదైన, కానీ శక్తివంతమైన ఇంగ్లీషు పదాలకు మరో ఉదాహరణగా నిలిచింది.

# ఆంథ్రోపిక్ క్లాడ్ కోడ్ ఫుల్ సోర్స్ లీక్

## ఏఐ ప్రపంచానికి కొత్త షాక్

- కంపెనీ తన ఏఐ కోడింగ్ ఏజెంట్ కోడ్‌ను పొరపాటున లీక్ చేసింది
- డెవలపర్లకు వరంగా మారిన లీక్
- 38,000 కోట్ల డాలర్ల వాల్యుయేషన్‌కు గండి
- గతంలో రెండుసార్లు కూడా లీక్





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** ప్రపంచవ్యాప్తంగా ఏఐ టూల్స్‌తో టెక్ రంగాన్ని షేక్ చేస్తున్న అమెరికా టెక్ దిగ్గజం ఆంథ్రోపిక్ పప్పులో కాలేసింది. ఈ సంస్థకు చెందిన అత్యంత ప్రజాదరణ పొందిన ఏఐ కోడింగ్ ఏజెంట్ 'క్లాడ్ కోడ్' ఫుల్ సోర్స్ కోడ్ బయటికి పొక్కింది. సైబర్ కేటుగాళ్ల ప్రమేయం లేకుండా తానే పొరపాటుగా ఈ కోడ్‌ను లీక్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్న ఈ 'క్లాడ్ కోడ్' ఫుల్ సోర్స్ కోడ్ సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు వరంగా మారుతుందని భావిస్తున్నారు. ఆంథ్రోపిక్ కంపెనీకి చెందిన ఏఐ ఆధారిత టూల్స్ ఇలా లీకవడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ రెండుసార్లు ఇలానే కంపెనీకి చెందిన కీలక ఏఐ టూల్స్ సోర్స్ కోడ్‌లు లీకయ్యాయి. ఈసారి క్లాడ్ కోడ్ ఫుల్ సోర్స్ లీక్ ఏఐ రంగంలో సెక్యూరిటీ అప్‌డేట్‌లపై మరోసారి చర్చనీయాంశం చేసింది. ఆంథ్రోపిక్ ఈ సంవత్సరం అక్టోబరులో 38,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.35.98 లక్షల కోట్లు) వాల్యుయేషన్‌తో ఐపీఓకి రావాలని భావిస్తోంది. ఇప్పుడు ఇలా తన కీలక క్లాడ్ కోడ్ సెక్యూరిటీ అప్‌డేట్ లీకవడం కంపెనీ ఐపీఓ ప్రయత్నాలను దెబ్బతీస్తుందని భావిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కంపెనీ విడుదల చేసిన క్లాడ్ కోవర్క్ ఏఐ టూల్స్‌తో సాఫ్ట్‌వేర్, లీగల్, ఐటీ సేవల కంపెనీల షేర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ లక్షల కోట్ల రూపాయలు తుడిచిపెట్టుకుపోయింది. ఇప్పుడు క్లాడ్ కోడ్ ఏఐ ఏజెంటిక్ టూల్ కీలక సోర్స్ లీకవడం స్టాక్ మార్కెట్‌పై ఎలాంటి ప్రభావం చూపిస్తుందోనని మార్కెట్ వర్గాలు ఆందోళనతో ఉన్నాయి. క్లాడ్ కోడ్ ఆంథ్రోపిక్ సంస్థ అత్యంత ప్రజాదరణ పొందిన ఏఐ కోడింగ్ ఏజెంట్. ఇది డెవలపర్లకు కోడ్ రాయడం, డీబగ్ చేయడం, ఆప్టిమైజ్ చేయడం వంటి పనుల్లో సహాయపడుతుంది. ఈ టూల్ ఫుల్ సోర్స్ లీక్ అయినందున డెవలపర్లు ఇప్పుడు దీన్ని స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చని భావిస్తున్నారు. అయితే ఇది సైబర్ సెక్యూరిటీ రిస్క్‌లను కూడా పెంచవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ లీక్ ఆంథ్రోపిక్ సంస్థ ఏఐ రంగంలో ఎదుర్కొంటున్న సెక్యూరిటీ సవాళ్లను మరోసారి బయటపెట్టింది. కంపెనీ తన ఐపీఓ ప్రయత్నాలను ఎలా ముందుకు తీసుకెళ్తుందనేది ఇప్పుడు మార్కెట్ దృష్టి సారించిన అంశం.

# పర్సెంటేజీల ప్రకారమే సినిమాల ప్రదర్శన

**నేటి నుంచే ఈ విధానం అమలు.. 23 సింగల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాల ప్రకటన**

**హైదరాబాద్:** తెలంగాణ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. మల్టీప్లెక్స్ తరహాలో పర్సంటేజీ విధానంలోనే సినిమాలను ప్రదర్శించాలని హైదరాబాద్‌లోని 23 సింగిల్‌స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఏప్రిల్ 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. ఎగ్జిబిటర్లకు రెవెన్యూ షేర్ ఇలా.. సినిమా ప్రదర్శితమైన తొలివారం 60 శాతం, రెండోవారం 50 శాతం, మూడోవారం 40 శాతం. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రకటన విడుదల చేసింది. 23 మంది ఎగ్జిబిటర్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ఇటీవల సంప్రదించి.. తెలంగాణలోని పలువురు అగ్ర శ్రేణి డిస్ట్రిబ్యూటర్లతో చర్చలు జరిపినట్లు తెలిపారు.

*చికెన్ రేటు మార్జిన్ విషయంలో చికెన్ రిటైల్ షాపు వ్యాపారులు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారని బ్రాయిలర్ ఇంటిగ్రేషన్ కో ఆర్డనేషన్ కమిటీ తెలిపింది. రిటైల్ షాపుల ఆరోపణలపై హైదరాబాద్ సోమాజిగూడాలో గురువారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు రామిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యన్, రాజిరెడ్డి లు మాట్లాడారు. చికెన్ లైవ్ రేట్ తో పాటు రిటైల్ ధరలను పేపర్ ద్వారా ప్రకటనలు ఇస్తున్నామని తెలిపారు.*



# తగ్గనున్న జాగ్వార్ ల్యాండ్ రోవర్ కార్ల ధరలు

**సుంకం 110% నుంచి 30%కి తగ్గడంతో ధరల్లో 13-15% తగ్గే అవకాశం**

**దేశంలో తయారయ్యే మోడళ్ల ధరల్లో మాత్రం మార్పు లేదు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)తో భారత్ కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) ఫలితంగా జాగ్వార్ ల్యాండ్ రోవర్ (జెఎల్‌ఆర్) కార్ల ధరలు రూ.75 లక్షల వరకు తగ్గే అవకాశం ఏర్పడింది. సుంకం 110% నుంచి 30%కి తగ్గడంతో ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేసేందుకు జేఎల్‌ఆర్ సిద్ధమవుతోంది. పరిశ్రమ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, ఏప్రిల్ 20 తర్వాత ఈ తగ్గింపు ధరలు అమలులోకి వస్తాయి. మోడల్‌ను బట్టి వాహనాల ధరలు 13-15 శాతం (సుమారు రూ.40-75 లక్షలు) తగ్గొచ్చని సమాచారం. టాప్-ఎండ్ రేంజ్ రోవర్ ఎస్వీ 4.4 ప్రస్తుత ధర రూ.4.25 కోట్లు ఉండగా, ఈ వాహన ధర రూ.63--75 లక్షలు తగ్గొచ్చని చెబుతున్నారు. రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్వీ ధర కూడా రూ.40 లక్షల మేర తగ్గబోతున్నట్లు తెలుస్తోంది. రేంజ్ రోవర్ స్పోర్ట్ ఎస్వీలో కొత్త వేరియంట్‌ను కంపెనీ పరిచయం చేయబోతోంది. దీని ధర సుమారు రూ.2.05 కోట్లుగా ఉండొచ్చు.

### దేశంలో తయారయ్యే మోడళ్ల ధరల్లో మార్పు లేదు

స్లోవేకియాలో పూర్తిగా తయారవుతున్న ల్యాండ్ రోవర్ డిఫెండర్ ధరల్లో వెంటనే మార్పు ఉండకపోవచ్చు. భారత్‌లో తయారవుతున్న మోడళ్ల ధరల్లోనూ మార్పు ఉండదు. సుంకం ప్రయోజనాలు పూర్తిగా తయారై, అధిక సామర్థ్యం కలిగిన ఇంజిన్లున్న వాహనాలకే వర్తించడం ఇందుకు నేపథ్యం. బ్రిటిష్ పౌండ్‌తో పోలిస్తే రూపాయి విలువ గత ఆర్థిక సంవత్సరంలో 13 శాతం క్షీణించింది. సుంకం ప్రయోజనాలను ఇది కొంతమేర తగ్గించవచ్చని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి.

### వినియోగదారులకు ప్రయోజనం

యూకే-భారత్ ఎఫ్‌టిఏ ద్వారా లభించే సుంకం తగ్గుదలను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేసేందుకు జేఎల్‌ఆర్ సిద్ధమవుతోంది. డీలర్లకు త్వరలోనే కొత్త ధరల గురించి సమాచారం అందించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ తగ్గుదలతో లగ్జరీ ఎస్‌యువి సెగ్మెంట్‌లో జాగ్వార్ ల్యాండ్ రోవర్ కార్లు మరింత ఆకర్షణీయంగా మారనున్నాయి. ప్రస్తుతం యూకే నుంచి దిగుమతి చేసుకునే జేఎల్‌ఆర్ వాహనాల ధరలు భారీగా తగ్గడం వల్ల భారత మార్కెట్‌లో లగ్జరీ కార్ల పోటీ మరింత తీవ్రమవుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ఎఫ్‌టిఏ ద్వారా భారత వినియోగదారులకు ఉన్నత నాణ్యత గల బ్రిటీష్ లగ్జరీ వాహనాలు చౌక ధరల్లో లభించనున్నాయి.

# ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

## బొగ్గు స్మగ్లింగ్ కేసులో కీలక పరిణామం

- హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీల్లో ఏకకాల సోదాలు
- రిషిరాజ్ సింగ్ ప్రాంగణంపై కూడా ఈడీ దృష్టి
- మమతా బెనర్జీ ఐప్యాక్ చీఫ్ ఇంటికి వెళ్లిన సమయంలో తనిఖీలు

టీఎంసీతో ఐప్యాక్ సంబంధాలు - అసెంబ్లీ ఎన్నికల ముందు సంచలనం

న్యూఢిల్లీ, మార్చి 31: రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గురువారం భారీ సోదాలు చేపట్టింది. పశ్చిమ బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించిన మనీ లాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఈ తనిఖీలు జరిగాయి. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో అధికారులు సోదాలు నిర్వహించారు. ఐప్యాక్ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా ఈడీ దృష్టి సారించింది. సోదాలు జరుగుతున్న






సమయంలోనే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఐప్యాక్ చీఫ్ ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన ఇంటిపై కూడా తనిఖీలు జరగడం గమనార్హం. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ ఆరోపించింది. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీం కోర్టులో విచారణలో ఉంది.

2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత నుంచి టీఎంసీతో కలిసి ఐప్యాక్ పనిచేస్తోంది. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ సోదాలు రాజకీయంగా సంచలనం సృష్టించాయి. ఐప్యాక్ బొగ్గు స్మగ్లింగ్ కేసులో ఎలా సంబంధం ఉందనేది ఈడీ దర్యాప్తు ద్వారా తెలియనుంది. ఈ సోదాలు దేశవ్యాప్తంగా రాజకీయ-కన్సల్టెన్సీ సంస్థల మధ్య ఉన్న సంబంధాలపై మరోసారి చర్చనీయాంశం చేశాయి. ఈడీ దర్యాప్తు ఫలితాలు ఎలా ఉంటాయనేది ఇప్పుడు అన్ని వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# పెట్రోకెమికల్ ఉత్పత్తుల దిగుమతి సుంకంపై తాత్కాలిక మినహాయింపు

- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం తగ్గించడానికి కేంద్రం కీలక చర్య
- ఏప్రిల్ 2 నుంచి జూన్ 30 వరకు అమలు
- ప్లాస్టిక్, టెక్స్‌టైల్స్, ఫార్మా రంగాలకు లాభం
- యుద్ధం వల్ల హర్మూజ్ రవాణా అంతరాయం
- దిగుమతులపై ఆందోళన తగ్గించే ప్రయత్నం





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం దేశ ప్రజలపై పడకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న అదనపు ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా కొన్ని కీలక పెట్రోకెమికల్ ఉత్పత్తుల దిగుమతి సుంకాన్ని తాత్కాలికంగా మినహాయించింది.

నేటి (ఏప్రిల్ 2) నుంచి జూన్ 30 వరకు ఈ మినహాయింపు అమలులో ఉండనుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "దేశీయ పరిశ్రమకు కీలకమైన పెట్రోకెమికల్ ముడి సరకుల లభ్యతకు ఆటంకం కలగకుండా చూడటం, దీనిపై ఆధారపడిన రంగాలపై వ్యయ ఒత్తిళ్లను తగ్గించడం, దేశంలో సరఫరా స్థిరత్వాన్ని కాపాడటం కోసం ఈ చర్యలు చేపట్టాం. అయితే ఈ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు తాత్కాలికమే. దీనివల్ల తుది ఉత్పత్తులను కొనుగోలు చేసే వినియోగదారులపై అదనపు భారం పడకుండా ఉపశమనం లభిస్తుంది" అని ఆర్థిక మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది.

### ఏ ఉత్పత్తులపై మినహాయింపు?

మిథనాల్, అన్‌హైడ్రస్ అమోనియా, డైక్లోరోమిథేన్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, స్టిరేన్, పాలీ బ్యుటడిన్, స్టైరీన్ బ్యుటడిన్, అన్‌శాచురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్ వంటి పెట్రోకెమికల్ ఉత్పత్తుల దిగుమతి సుంకాన్ని మినహాయించారు. ఈ నిర్ణయంతో ప్లాస్టిక్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఆటోమొబైల్, కెమికల్ రంగాలకు లాభం చేకూరనుందని కేంద్రం పేర్కొంది.

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధి ద్వారా సరకు రవాణాకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీంతో ముడి చమురు, గ్యాస్, ఎరువులు, ఇతర రసాయనాల దిగుమతులపై ఆందోళనలు నెలకొన్నాయి. ఫెర్టిలైజర్స్, పెట్రోలియం ఉత్పత్తులకు భారత్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న తాత్కాలిక మినహాయింపు దిగుమతి ఖర్చులను తగ్గించి, దేశీయ పరిశ్రమలకు ఊరట కల్పిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ చర్యలు యుద్ధం వల్ల ఏర్పడిన సరఫరా గొలుసు అంతరాయాలను కొంతవరకు తగ్గించి, సాధారణ ప్రజలు, పరిశ్రమలపై అదనపు భారం పడకుండా చూసే లక్ష్యంతో తీసుకోబడ్డాయి. అయితే ఈ మినహాయింపు జూన్ 30తో ముగుస్తుంది కాబట్టి, యుద్ధం కొనసాగితే మరిన్ని చర్యలు అవసరమవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను తిరిగి అనుమతించే యోచనలో సెబీ

- స్టాక్ ఎక్స్ఛేంజ్ రూట్ ద్వారా బైబ్యాక్‌లు పునరుద్ధరించే అవకాశం
- పన్ను నిబంధనల మార్పు తర్వాత ప్రతిపాదన - షేర్‌హోల్డర్లకు మరింత లాభం
- 2025లో ఫేజ్ అవుట్ చేసిన రూట్‌ను తిరిగి తీసుకురావాలని చర్చ





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (జనంసాక్షి) :** సెక్యూరిటీలు అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఓపెన్ మార్కెట్ బైబ్యాక్‌లను స్టాక్ ఎక్స్ఛేంజ్ రూట్ ద్వారా తిరిగి అనుమతించాలని ఆలోచిస్తోంది. 2025లో ఈ రూట్‌ను ఫేజ్ అవుట్ చేసిన తర్వాత, పన్ను నిబంధనల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో దీన్ని పునరుద్ధరించాలని చర్చలు జరుగుతున్నాయి. సెబీ ఈ మార్గాన్ని షేర్‌హోల్డర్లకు మరింత సమానమైన, పారదర్శకమైన బైబ్యాక్ వ్యవస్థగా చూస్తోంది. గతంలో ట్రేడింగ్ విండో, ధర, వాల్యూమ్ వంటి అంశాల్లో సమస్యలు ఉన్నాయని భావించి ఈ రూట్‌ను ఫేజ్ అవుట్ చేసింది. అయితే, పన్ను నిబంధనల్లో మార్పులు వచ్చిన తర్వాత మరోసారి దీన్ని అనుమతించాలని నిపుణులు, మార్కెట్ వర్గాలు సూచిస్తున్నాయి. సెబీ ఈ రూట్‌ను తిరిగి తీసుకురావాలంటే ట్రేడింగ్ విండోను తగ్గించడం, గరిష్ఠ లిమిట్‌లను నియంత్రించడం వంటి సవరణలు చేయాలని ఆలోచిస్తోంది. ఇది షేర్‌హోల్డర్లందరికీ సమాన అవకాశం కల్పించడంతోపాటు, ధర నిర్ణయంలో పారదర్శకతను నిర్ధారిస్తుంది. ప్రస్తుతం టెండర్ ఆఫర్ రూట్ మాత్రమే అమలులో ఉంది. ఓపెన్ మార్కెట్ రూట్ తిరిగి వస్తే కంపెనీలు తమ క్యాపిటల్ స్ట్రక్చర్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించగలవని నిపుణులు అంటున్నారు. 2025లో సెబీ ఓపెన్ మార్కెట్ బైబ్యాక్ రూట్‌ను ఫేజ్ అవుట్ చేసింది. ఒక్క షేర్‌హోల్డర్ ఆర్డర్ పూర్తిగా మ్యాచ్ అయ్యే సమస్య, ధర నిర్ణయంలో అసమానత వంటి కారణాలు దీనికి ప్రధానం. అయితే, పన్ను నిబంధనల్లో వచ్చిన మార్పులు (బైబ్యాక్ ప్రొసీడ్స్ క్యాపిటల్ గెయిన్స్‌గా ట్యాక్స్) తర్వాత ఈ రూట్‌ను తిరిగి అనుమతించాలని చర్చలు జరుగుతున్నాయి.

కంపెనీలు తమ సర్ప్లస్ క్యాష్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. షేర్ ధరల స్థిరీకరణకు సహాయపడుతుంది. చిన్న ఇన్వెస్టర్లు కూడా బైబ్యాక్ లాభాలను పొందే అవకాశం పెరుగుతుంది. సెబీ ఈ ప్రతిపాదనపై మార్కెట్ వర్గాలు, నిపుణుల అభిప్రాయాలను సేకరిస్తోంది. తుది నిర్ణయం త్వరలో రావాలని ఆశిస్తున్నారు. ఈ మార్పు అమలైతే భారత స్టాక్ మార్కెట్‌లో బైబ్యాక్ వ్యవస్థ మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మారనుంది.

# కోల్కొంద గ్రామసభ బహిష్కరణ

- మహిళా సర్పంచ్ పై అధికారుల వివక్ష
- నిధుల విడుదలలో జాప్యం
- గ్రామ కార్యదర్శి నియమించని అధికారులు
- సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారునికి అందకుండా గోప్యంగా ఉంచిన అధికారులు
- గ్రామ సర్పంచ్ కీర్తి



**వికారాబాద్ జిల్లా బ్యూరో(జనంసాక్షి):** అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధుల మధ్య వైరం మొదలైంది. అధికార పార్టీ నాయకులకు అధికారులు తొత్తులుగా మారి సమగ్ర సమాచారం ఇవ్వడం లేదని ఒక మహిళ సర్పంచ్ గ్రామసభను బహిష్కరించింది. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ కు సంబంధించి లబ్ధిదారునికి తెలియకుండా అధికారులు దాటవేసి స్వాహా చేస్తే ప్రయత్నం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపణ చేశారు వివరాల్లోకి వెళితే వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం కోల్కొంద గ్రామ సర్పంచ్తో పాటు పాలక మండలి సభ్యులు గురువారం నాడు గ్రామసభను బహిష్కరించారు. గత రెండు విడుతలుగా ఎన్ఆర్ఈజీఎస్ నీధులను గ్రామపంచాయతీ కేటాయించకుండా మహిళా సర్పంచ్ నన్ను అకారణంగా గత మూడు నెలలుగా గ్రామ పంచాయతీ కార్యదర్శి నీ నియమించకుండా తాము గతంలో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తు ప్రతినెల గడపగడపకు తిరుగు తూ ప్రజా పాలన కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కృషి చేస్తున్న , అక్కసు తోఅధికార పార్టీ నాయకులు తమపై కక్షగట్టి వేధిస్తున్నారని ఇటీవల గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి కి సీఎం రిలీఫ్ ఫండ్ (చెక్ నెంబర్ 143203) మార్చ్ 10వ తేదీన రిలీజ్ అయినట్టు సమాచారం వచ్చినప్పటికీ ఇప్పటివరకు అందలేదని ఈ విషయమై మండల పరిషత్ కార్యాలయం లో ఎమ్మార్వో కార్యాలయంలో సమాచారం ఇచ్చినప్పటికీ ఒకరిపై ఒకరు చెప్పడం తప్ప న్యాయం చేయడం లేదని , జిల్లా ఎస్పీ దృష్టికి ఈ చెక్కు విషయమై సమాచారం ఇవ్వగా ఇది క్రిమినల్ సమస్య కాదని కనీసం మర్యాద ఇవ్వకుండా ఎస్పీ నిర్లక్ష్యంగా వ్యవహరి ంచారని అధికారులు బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు మహిళా సర్పంచ్ పట్ల అధికారులు అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు తమను తీవ్రంగా కలిచి వేస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సభలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు చదవడానికి తనకు మనసు ఒప్పడం లేదని చెప్పుకోడానికి తప్ప ప్రభుత్వ పథకాలు ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. తమ గ్రామంలో తామిచ్చిన హామీలను 6 గ్యారంటీలను అమలు చేస్తుంటే గ్రామపంచాయతీ కార్యదర్శి సుమారు మూడు నెలలుగా వెంటనే గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు విడుదల చేయడం తో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి నియమించాలని మార్చి 10న మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ వెంటనే అందేలా చూడాలని తెలిపారు. అడుగ డుగునా అవమాన పరుస్తూ జవాబుదారీ లేని ప్రభుత్వం సూచిం చిన ముఖ్యమంత్రి సందేశాన్ని తాను చదవ లేకపోతున్నానని గ్రామ సభను బహిష్కరి స్తున్న ట్లు తెలిపారు. ప్రభుత్వా నికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న గత రెండు దపాలుగా ఎన్ఆర్ ఈజీ ఎస్ నిధులను విడుదల చేయడం పాటు గ్రామా నికి గ్రామ పంచాయతీ నియమించాలని కోరారు.

# ప్లాస్టిక్ బాటిళ్లలో నీళ్లు వద్దు మట్టి కుండ నీళ్లు ఆరోగ్యానికి మేలు

### గ్రామ సర్పంచ్ కొలి వెంకటేశ్వర్



**ధారూర్ ఏప్రిల్ 02(జనంసాక్షి):** మట్టి కుండలో నిల్వ చేసిన నీటిని తాగడం వల్ల మన శరీరానికి కలిగే ప్రయోజనాలు చాలా ఎక్కువ. ప్లాస్టిక్ బాటిళ్లతో పోలిస్తే ఇది ఎంతో ఉత్తమమైన పద్ధతి. మట్టి కుండ నీటి వల్ల కలిగే ఉపయోగాలు ఎన్నో అన్ని నాగసముందర్ గ్రామ సర్పంచ్ కొలి వెంకటేశ్వర్ అన్నారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఏర్పాటుచేసిన గ్రామసభలో మాట్లాడుతూ... 2047 విజన్ తో దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశం అని అన్నారు. సహజమైన చల్లదనం మట్టి కుండకు ఉండే చిన్న చిన్న రంధ్రాల ద్వారా నీరు ఆవిరవుతూ ఉండటం వల్ల, లోపల ఉన్న నీరు సహజంగానే చల్లబడుతుంది. ఇది ఫ్రిజ్ నీళ్లలాగా గొంతుకు హాని చేయదు. మట్టి క్షార గుణాన్ని ఆల్కలిన్ కలిగి ఉంటుందని మన శరీరం సాధారణంగా ఆమ్ల గుణాన్ని కలిగి ఉంటుందని కుండలోని నీరు తాగడం ఎంతో మంచిదని జీర్ణక్రియ మెరుగుపడుతుందని అన్నారు. ప్లాస్టిక్ బాటిళ్లలో హానికర రసాయనాలు కుండ నీటిలో ఉండవు. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది వేసవి కాలంలో మట్టి కుండ నీరు తాగడం వల్ల శరీరానికి అవసరమైన ఖనిజాలు అందుతాయి. ఇది గొంతు నొప్పిని తగ్గించ డానికి , వడదెబ్బ తగలకుండా ఉండటానికి సహాయపడుతుందని కుండను ఎప్పుడూ నీడలో గాలి తగిలే చోట ఉంచితే నీరు ఇంకా చల్లగా ఉంటుంది. అలాగే ప్రతిరోజూ కుండను శుభ్రం చేయడం వల్ల నీటి నాణ్యత బాగుంటుందని అన్నారు. గ్రామంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 68 చెక్కులు అందించినట్లు 49 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని గ్రామంలో 428 మంది రైతులకు రుణమాఫీ అయిందని 564 మందికి గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లు వస్తున్నాయని 1070 మందికి రైతు భరోసా నిధులు అందాయని 20 యూనిట్ల పెరటి కోళ్లను పండించడం జరిగిందని 18 సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చాయని ఎస్సి సబ్ ప్లాన్ క్రింద 15 లక్షలతో అండర్ డ్రైనేజీ. మరో 15 లక్షల నిధులతో సీసీ రోడ్లు. వెయ్యడం జరిగిందని కోట్ పల్లి ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం 90 కోట్ల నిధులు ప్రభుత్వ విడుదల చూసిందని నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా పాలనలో నాగసముందర్ ప్రజల చిరకాల కోరిక కోట్ పల్లి అలుగు పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంకు 27.50 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని పనులు కూడా ప్రారంభమయ్యాయని అన్నారు. 64 మహిళా గ్రూపులకు నాలుగు కోట్ల 61 లక్షల రుణాలు మంజూరు చేశారని విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. అలాగే గ్రామంలో కొత్త రేషన్ కార్డులు కూడా వచ్చాయని గ్రామంలో తాడ్ వైరు ఏర్పాటు చేయాలని రైతులకు కరెంటు సరఫరాలో అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన విద్యతో పాటు మంచి పౌష్టిక ఆహారం అడుగుతుందని గ్రామంలో నీళ్లు మురుగు కాలువలు. సీసీ రోడ్లు. అండర్ డ్రైనేజీ. పనులు చేయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ అధికారి రత్న ప్రసాద్. గ్రామ ఉపసర్పంచ్ మదారి సంగీత. మిషన్ భగీరథ ఏఈ రాఘవేందర్. ఫారెస్ట్ సెక్షన్ అధికారి భాగ్యమ్మ. లైన్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్. రెవెన్యూ ఇన్స్పెక్టర్ దేవేందర్ రెడ్డి. ప్రాథమిక పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు అశోక్. గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్. గ్రామ పాలన అధికారి సమీర్. వార్డు సభ్యులు. అంగన్వాడి టీచర్లు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దేశ భద్రత పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న ప్రధాని



**ఖైరతాబాద్, ఏప్రిల్ 02 (జనంసాక్షి) :** భారత రాజకీయాలకు కొత్త దిశానిర్దేశం చేసిన అమిత్ షా లోక్సభలో వామపక్ష తీవ్రవాదంపై జరిగిన చర్చలో ఒక మాట పదే పదే ప్రతిధ్వనించింది. 'చెప్పింది చేశాం' దేశ భద్రత పట్ల అత్యంత నిబద్ధతతో పనిచేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2026 మార్చి 31 నాటికి దేశం నక్సల్స్ రహితంగా మారుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పూర్తి విశ్వాసంతో చెప్పారు. నక్సలిజం అంతం అంచున ఉన్న ప్రస్తుత తరుణంలో, ఆయన దార్శనికత ఇప్పుడు నిజమవుతున్నట్లు స్పష్టమవుతోంది. నవ భారత నిర్మాణంలో భాగంగా అమిత్ షా నాయకత్వంలో రూపుదిద్దుకున్న ఈ పరిణామం, కేవలం భద్రతా బలగాల ఆపరేషన్లకు మాత్రమే పరిమితం కాదు. ఇది ఒక విధ్వంసకర భావజాలం అంతానికి, అభివృద్ధికి నాంది పలకడానికి నిదర్శనం. పేదరికం, వెనుకబాటుతనం వల్లే నక్సలిజం పుట్టుకొచ్చిందని దశాబ్దాలుగా ఒక వాదన వినిపించేది. కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులు ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. అంతే స్థాయిలో లేదా అంతకంటే దారుణమైన పేదరికం ఉన్న అనేక ఇతర ప్రాంతాల్లో నక్సలిజం జాడ లేదు. దీన్ని బట్టి చూస్తే పేదరికం వల్ల నక్సలిజం రాలేదని, వాస్తవానికి నక్సలిజం వల్లే పేదరికం మరింతగా పెరిగిపోయిందనే వాదన బలంగా వినపడుతోంది.

## పీఆర్సీ నివేదిక విడుదలలో ఆలస్యం వద్దు

### టీజీఈజేఏసీ డిమాండ్

**ముషీరాబాద్, (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల సవరణకు సంబంధించిన పీఆర్సీ (పే రివిజన్ కమిషన్) నివేదికను వెంటనే విడుదల చేయాలని టీజీఈజేఏసీ (తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ) ప్రభుత్వం ను కోరింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ రామకృష్ణకు టీజీఈజేఏసీ చైర్మన్ మారం జేగదీష్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ లు లేఖ ద్వారా తమ ఆందోళనలను తెలియజేశారు. 2023లో ఏర్పాటు చేసిన పీఆర్సీ కమిటీ ఇప్పటికే ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను సేకరించి సమీక్ష పూర్తి చేసినప్పటికీ, ఇప్పటివరకు నివేదిక విడుదల కాలేదని జేఏసీ పేర్కొంది. దీంతో ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని తెలిపింది. ప్రస్తుతం పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఉద్యోగుల ఆదాయం-ఖర్చుల మధ్య భారీ అంతరం ఏర్పడిందని లేఖలో పేర్కొన్నారు. పిల్లల విద్య, వైద్యం, గృహ రుణాల ఈఎంఐ లు వంటి అవసరాలను తీర్చుకోవడం కష్టమైందని, చాలా మంది ఉద్యోగులు నెలకు సుమారు రూ.20 వేల వరకు లోటుతో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్సీ సిఫార్సులు 2024 ఏప్రిల్ నాటికే రావాల్సి ఉన్నప్పటికీ, ఆలస్యం కారణంగా ఉద్యోగులు తమ హక్కులను కోల్పోతున్నారని జేఏసీ అభిప్రాయపడింది. అందువల్ల ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే నివేదికను విడుదల చేసి అమలు చేయాలని, గడువును మరింత పొడిగించవద్దని ప్రభుత్వాన్ని కోరింది. ప్రభుత్వం తక్షణమే సానుకూల చర్యలు తీసుకోవాలని టీజీఈజేఏసీ విజ్ఞప్తి చేసింది.

# గద్వాల పట్టణ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి




**గద్వాల నడిగడ్డ, (జనంసాక్షి):** జిల్లా కేంద్రమైన గద్వాల పట్టణ అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘం అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గద్వాల మునిసిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని మంగళవారం స్థానిక అక్షయ బంకిట్ హాల్లో పుర చైర్ పర్సన్ జయ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో పాటు ఈ సమావేశానికి హాజరైన కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల అనంతరం నిర్వహిస్తున్న మొదటి బడ్జెట్ సమావేశం కావడంతో నూతన కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలిపారు. గద్వాల మునిసిపాలిటీ ఆస్తిపన్నుల వసూళ్లలో లక్ష్యం కంటే ఎక్కువగానే వసూలు చేయడంతో పర్ఫార్మెన్స్ గ్రాంట్స్ కు ఎంపిక కావడం జరిగిందని ఈ సందర్భంగా సంబంధిత అధికారులను అభినందించారు. ప్రభుత్వం నుంచి గద్వాల మునిసిపాలిటీకి రూ.8.5 కోట్ల స్టాంపు డ్యూటీ నిధులు రావాల్సి ఉందని, ఇతర ఆదాయ మార్గాల్లో రూ.23 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనల కట్టుదిట్ట అమలు, పార్కుల నిర్వహణ, పట్టణ సుందరీకరణ, తదితర అభివృద్ధి పనులు చేయాల్సి ఉందన్నారు. ముఖ్యమైన జంక్షన్ల వద్ద భారీ ఫ్లెక్సీ లను ఉంచడంతో ఇబ్బందికరంగా ఉందని, ఫ్లెక్సీలతో పాటు ప్లాస్టిక్ నివారణకు కౌన్సిల్లో తీర్మానం చేసి అమలు చేయాల్సిందిగా సూచించారు. మున్సిపాలిటీలో ప్రతి ఉద్యోగి, ఇతర కార్మికులు బయోమెట్రిక్ విధానంలో హాజరు వేయాలని, 280 మంది కార్మికులు ఉండడంతో మునిసిపాలిటీని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కలిసికట్టుగా పని చేయాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, తాగునీటి వృధాను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ తదితర విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తూ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. గద్వాల మునిసిపాలిటీ దుకాణాల ఆదాయం కూడా పెరిగేందుకు నిబంధనల ప్రకారం వేలంపాట నిర్వహించాలని, జనరల్ ఫండ్ సద్వినియోగం చేసుకునేలా ముందుకెళ్లాలన్నారు. మునిసిపాలిటీ అవుట్సోర్సింగ్ కార్మికులకు జీతాలు, విద్యుత్ బిల్లుల చెల్లింపు, శానిటేషన్, తాగునీటి సరఫరాకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. గద్వాల శాసనసభ్యు లు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు పార్టీలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా సహకరించాలన్నారు. కౌన్సిలర్లు నిరంతరం వార్డుల్లో తిరుగుతుంటారు కాబట్టి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా బాధ్యత తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీలో సిసి రహదారులు, మురుగు కాలువలు, వీధిదీపాలు, తాగునీరు వంటి మౌలిక వసతులను పూర్తిస్థాయిలో కల్పించడమే ధ్యేయ ంగా తన వంతుగా సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా ఇచ్చారు. మునిసిపాలిటీలోని వివిధ విభాగాల అధికారులు నిబద్ధతతో, పారదర్శకంగా పని చేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంతకుముందు గద్వాల మున్సిపాలిటీ బడ్జెట్ ప్రతులను జూనియర్ అకౌంట్స్ అధికారి రాజు చదివి వినిపించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గద్వాల మున్సిపాలిటీకి ఆస్తి, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, మున్సిపల్ దుకాణాల అద్దెలు, వివిధ నిధులు, తదితర రూపాల్లో మొత్తం రూ.24.84 కోట్ల అంచనా ఆదాయాన్ని పేర్కొన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు కలెక్టర్ ను సన్మానించారు. అలాగే పదవీ విరమణ పొందుతున్న మున్సిపాలిటీ కార్మికుడు వెంకటరాజును కలెక్టర్తో పాటు ఇతర ప్రజాప్రతినిధు లు, అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, మున్సిపాలిటీ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

## పరిశ్రమ వ్యర్థాలపై నిర్లక్ష్యం సహించం

### అధికారులపై మంత్రి కొండా సురేఖ ఆగ్రహం



**జడ్చర్ల, (జనంసాక్షి):** నియోజకవర్గంలోని పోలేపల్లి ప్రాంతంలో పరిశ్రమల వ్యర్థాలను లెదర్ పార్క్ భూముల్లో అక్రమంగా పారబోస్తున్న ఘటనపై రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పత్రిక ప్రకటన ద్వారా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వివరాలను తెలుపుతూ, నియోజకవర్గంలో కాలుష్య కారక చర్యలపై తాము చేసిన ఫిర్యాదులకు మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ, నేటికీ వారు స్పందించకపోవడంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ఒక ప్రజా ప్రతినిధి చేసిన ఫిర్యాదులకే స్పందించని అధికారులు, సామాన్య ప్రజల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారో సమాధానం చెప్పాలని ఆమె నిలదీశారు. వీరితో పాటు రెడ్ జోన్ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో పాల్గొనాలని సూచించారు. రాష్ట్రంలో కాలుష్య నియంత్రణకు , పరిశ్రమల వ్యర్థాల నిర్వహణలో కఠినమైన మార్పులు తీసుకువచ్చేందుకు ఈ సమావేశంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోనున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని మంత్రి కొండా సురేఖ హెచ్చరించినట్లు ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తన ప్రకటనలో వివరించారు.

## ఓయూ తెలుగు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్గా డాక్టర్ ఎస్. రఘు



**సికింద్రాబాద్ (జనంసాక్షి):** ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్గా డాక్టర్ ఎస్.రఘు నియమితులయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్స్లర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాషా అభివృద్ధి, పాఠ్య ప్రణాళిక రూపకల్పనలో విశేష అనుభవం కలిగిన రఘు నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ రఘు ప్రాథమిక తరగతుల నుండి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఓపెన్ స్కూల్, డిఎడ్, ఓపెన్ యూనివర్సిటీ వరకు వివిధ స్థాయిలలో తెలుగు పాఠ్యాంశాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. కాలానుగుణంగా పాఠ్య ప్రణాళికలను రూపొందించడం, విద్యార్థుల్లో సాహిత్య అభిరుచిని పెంపొందించడం, భాషా అభివృద్ధికి తోడ్పడే విలువలను చేర్చడంలో ఆయన విశేష సేవలు అందించారు. ఈ సందర్భంగా తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. కాశీం, పూర్వ అధ్యక్షులు ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ తో పాటు ఇతర అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఎల్గోయిలో భారీ చోరీ

### ఐదు తులాల బంగారం, నగదు అపహరణ



**ఝరాసంగం, (జనంసాక్షి):** మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో గురువారం భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన కొత్తూరు సంగన్న కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం ఏడుపాయల జాతరకు వెళ్లారు. గురువారం వారు తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం చూసి షాక్కు గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు మాయమైనట్లు గుర్తించారు. అదేవిధంగా గ్రామంలోని చాకలి రాజమ్మ ఇంట్లో కూడా దుండగులు చొరబడి రూ. 10 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ పటేల్ క్రాంతి కుమార్ కేసు నమోదు చేశారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ - 2026 లోగో

## ఆవిష్కరించిన సీఎస్ కె.రామకృష్ణ రావు




**హైదరాబాద్, (జనంసాక్షి):** రాష్ట్ర యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ - 2026, తెలంగాణ బిజినెస్ ఎక్స్పో అధికారిక లోగోను గురువారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆవిష్కరించారు. సమ్మిట్ ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు ఆకాంక్షించారు. యువత ఉపాధి కల్పనకు కృషి చేయడం అభినందనీయమని వివరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లోగో ఆవిష్కరణ చేస్తున్న సమయంలో జై సంస్థ వ్యవస్థాపక సీఈఓ వరప్రసాద్ సింగిరెడ్డి, ఆయన బృందం సైతం ఉన్నారు. హైదరాబాద్లోని హైటెక్స్ ఎక్సిబిషన్ సెంటరులో జూన్ 26 నుండి 28, 2026 వరకు ఈ సమ్మిట్ ను నిర్వహించనున్నట్టు వరప్రసాద్ తెలిపారు. దేశవ్యాప్తంగా 300కు పైగా ఎగ్జిబిటర్లు, పారిశ్రామికవేత్తలు, ఆర్థిక సంస్థలు, స్టార్టప్‌లు, యువ వ్యాపారవేత్తలు మూడు రోజుల కార్యక్రమంలో పాల్గొంటారని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్లో భాగంగా వివిధ రంగాల వ్యాపార ప్రదర్శన (ఎక్స్పో), జాతీయ స్థాయి ఎంట్రప్రెన్యూర్షిప్ కాన్ఫరెన్స్, అలాగే వ్యాపార అభివృద్ధి, మార్కెట్ అవకాశాలు, విస్తరణకు సంబంధించిన జ్ఞాన సదస్సులు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ముఖ్యంగా మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందించే ప్రత్యేక "విమెన్ ఎంట్రప్రెన్యూర్స్ పావిలియన్" ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ, జిల్లా స్థాయి యువతలో వ్యాపార వైవిధ్యతను పెంపొందించడం, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించడం, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మార్కెట్ అవకాశాలను కల్పించడం యంగ్ ఎంట్రప్రెన్యూర్స్ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అయితే, ఈ సమ్మిట్‌కు హాజరుకావాలనుకునే వారు ఉచిత విజిటింగ్ పాసుల కోసం అధికారిక వెబ్‌సైట్ (www.yes4growth.org)లో నమోదు చేసుకోవాలని సూచించారు.


# 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలి

### కేంద్రాన్ని డిమాండ్ చేసిన ఎంపీ వద్దిరాజు




**ఖమ్మం టౌన్ (జనంసాక్షి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని ప్రకటించడాన్ని తమ పార్టీ స్వాగతిస్తున్నదని, ఇదేసమయంలో భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు -2026పై రాజ్యసభలో గురువారం జరిగిన చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అమరావతి నిర్మాణానికి భూమి పూజ జరిగినప్పుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆ కార్యక్రమానికి హాజరై హృదయపూర్వకంగా స్వాగతించిన సందర్భాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. అన్నదమ్ముల్లా విడిపోయి రెండు రాష్ట్రాలను అభివృద్ధి చేసుకుందామనేది మొదటి నుంచి కూడా తమ పార్టీ విధానమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన జరిగిన సందర్భంలో తెలంగాణ ప్రాంతానికి చెందిన 7 మండలాలను ఆర్డినెన్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అప్పగించారన్నారు. వీటిలోని ఎటపాక, కన్నాయి గూడెం, పిచ్చుకలపాడు, పురుషోత్తమ పట్నం, గుండాల గ్రామాలు దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీసీతారామ చంద్ర స్వామి కొలువైన భద్రాచలం పట్టణానికి ఆనుకుని ఉంటాయని ఎంపీ రవిచంద్ర వివరించారు. భద్రాచలం ఆలయానికి చెందిన భూముల్లో చాలా వరకు వీటి పరిధిలోనే ఉన్నాయని, ఈ గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ చేపట్టి రికార్డ్ స్థాయిలో కేవలం 3 ఏండ్లలోనే పూర్తి చేయడం జరిగిందని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. ఇందుకు రాష్ట్ర ఆదాయం నుంచి 34వేల కోట్లు, 60వేల కోట్లు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకు వచ్చి పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా సాగు విస్తీర్ణం బాగా పెరిగి రాష్ట్రం సస్యశ్యామలంగా రూపు దాల్చిందని, దీంతో 60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి నుంచి 3కోట్ల మెట్రిక్ టన్నులకు చేరిందని ఎంపీ వద్దిరాజు వివరించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాక అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసిన కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఉద్దేశించి మంత్రి కిషన్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి వెంటనే తొలగించాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కల్పించాలని, కాజీపేట లో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, గిరిజన యూనివర్సిటీకి మరిన్ని నిధులు కేటాయించాలని, బయ్యారంలో స్టీల్ కర్మాగారాన్ని నెలకొల్పాలని, ప్రతి జిల్లాకొక నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని, మరిన్ని సెంట్రల్ స్కూల్స్ మంజూరు చేయాలని ఎంపీ వద్దిరాజు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే, మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలను త్వరితగతిన పూర్తి చేసి సర్వీసులు ప్రారంభిం చాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమా నాశ్రయం నిర్మించాలని ఎంపీ రవిచంద్ర డిమాండ్ చేశారు. కొత్తగూడెం రైల్వేస్టేషన్ ప్రారంభించి 1932 నాటికి 100 ఏండ్లు పూర్తి కావస్తున్నందున దానిని డివిజన్ ప్రకటించి మరింత అభివృద్ధి చేయాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మం -కొత్తగూడెం-భద్రాచలం-బస్తర్ కారిడార్ ను నాలుగు లైన్లుగా విస్తరింపజేసి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చత్తీస్ గఢ్, ఒడిషా రాష్ట్రాల మధ్య రవాణా వ్యవస్థను మరింత మెరుగు పర్చాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ వద్దిరాజు సలహానిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
3 ఏప్రిల్ 2026



# న్యాయవ్యవస్థ గౌరవానికి ముప్పు

## జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై 'షా' వ్యాఖ్యలు వివాదాస్పదం

- జ్యుడీషియరీ స్వాతంత్ర్యానికీ అగౌరవమని అభిప్రాయం
- బెంచ్ ఏకగ్రీవ తీర్పుపై రాజకీయ దాడి తగదు



**- హైదరాబాద్, ఏప్రిల్ 02 (జనంసాక్షి) :** రాజ్యం బాధ్యతలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లొద్దని ఆయన తీసుకున్న ఓ నిర్ణయం దేశ చరిత్రలోనే కీలక మలుపు. వేలాది మంది అమాయకుల ప్రాణాలకు ఓ భరోసా. ఆదివాసీ బిడ్డలకు రక్షణ కవచం. ఆ తీర్పు వెలువడి దశాబ్దంన్నర గడిచినా, తదనంతరం అనేక పరిణామాలు చోటుచేసుకున్నా.. నేటి పాలకులకు పదేపదే స్ఫురణకు రావడం ఆశ్చర్యపరుస్తోంది. సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన ఆ తీర్పు తాజాగా పార్లమెంటులో ప్రస్తావనకు రావడం న్యాయమూర్తులకు ప్రజల పట్ల ఉన్న విశ్వసనీయతను ప్రస్ఫుటిస్తోంది. అయితే, పాలకులకు అదో 'పెనుభూతం'లా గోచరిస్తుండటం, పనిగట్టుకొని సదరు జస్టిస్‌ను తరచూ దూషించడం పౌరసమాజంలో మరోసారి చర్చకు దారితీసింది. అయితే జస్టిస్ సుదర్శన్ రెడ్డి తాను ఇచ్చిన తీర్పును రాజ్యాంగ బాధ్యతగా చెప్పుకున్నారు. **"ఇది నా తీర్పు కాదు, సుప్రీం కోర్టు తీర్పు"** అని జస్టిస్ బీఎస్ రెడ్డి స్పష్టం చేశారు.



రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల అచెంచల గౌరవమున్న జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి ఉప రాష్ట్రపతి అభ్యర్థిత్వాన్ని తప్పుబట్టడాన్ని, ఆయనను విమర్శించడాన్ని గతంలోనే 18 మంది సుప్రీం, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్తంగానూ బీఎస్ రెడ్డికి మద్దతు లభించింది. షా వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా ఎన్డీయే కూటమి అభ్యర్థి గెలుపు కోసం ఈ రాజకీయ విమర్శ చేసినా.. తాజాగా లోక్‌సభలో మళ్లీ ప్రస్తావించడం న్యాయమూర్తుల స్వేచ్ఛ, రాజ్యాంగ రక్షణకు ప్రతిఘాతంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. సుప్రీం కోర్టు బెంచ్ మొత్తం ఏకాభిప్రాయంతో ఇచ్చిన తీర్పును.. ఒక న్యాయమూర్తికి ఆపాదిస్తూ ఆరోపణలు చేయడం అన్యాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని కాదు మొత్తం న్యాయవ్యవస్థను అవమానించినట్టుగా పేర్కొంటున్నారు.

### ప్రజాస్వామ్యంలో ఇలాంటి వ్యాఖ్యలు సరికాదు

**కే కేశవరావు, రాజ్యసభ మాజీ సభ్యులు (మాజీ జర్నలిస్ట్)**



నిండు సభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒక తీర్పు ఇచ్చిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తిని విమర్శించడం ఎంతమాత్రం సరికాదు. ప్రజాస్వామ్యం ఇటు వంటి వ్యాఖ్యలు మంచివి కావు. సుదర్శన్ రెడ్డి రాజ్యాంగానికి కట్టుబడి తన ప్రయాణాన్ని కొనసాగించిన వ్యక్తి.

### రాజ్యాంగ వ్యతిరేక తీర్పు కాదు కదా

**ప్రొఫెసర్ కోదండరాం**



జడ్జీలు చేసిన తీర్పులు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంటే తప్పుబట్టవచ్చు. కానీ తీర్పులిచ్చిన న్యాయ మూర్తులపై వ్యక్తిగత దాడి సరికాదు. న్యాయ వ్యవస్థల ప్రతిష్ట దిగజార్చే విధంగా అమిత్ షా వ్యాఖ్యలున్నాయి. అయితే.. ప్రభుత్వానికి బలప్రయోగం చేసే అధికారం ఉంటుంది కానీ.. ప్రైవేటు వ్యక్తులకు ఇస్తే అరాచకం అవుతుంది. అందుకే సల్వాజుడుం రద్దు తీర్పు వెలువడింది. ప్రైవేటు సైన్యపు చర్యలను కోర్టు తప్పుబట్టింది. దానికి వ్యతిరేక దూషణలకు దిగడం మంచిది కాదు. సుదర్శన్ రెడ్డి రాజ్యాంగ విలువలకు కట్టుబడివున్నారు గనుకే ఆయనను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిర్ణయించారు. ఆ ఎన్నిక సందర్భంగా అమిత్ షా వ్యాఖ్యలనూ అనేకమంది జడ్జీలు వ్యతిరేకించారు.

### జ్యుడీషియరీ వ్యవస్థపై దాడి

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**



జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఇచ్చిన తీర్పునుద్దేశించి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ప్రత్యక్షంగా పరోక్షంగా న్యాయవ్యవస్థపై దాడిగా ఉన్నాయి. సల్వాజుడుం వల్ల అనేక మంది అమాయకులు చనిపోయారు. అలాంటి పరిస్థితుల్లో లా అండ్ ఆర్డర్ దృష్టిలో పెట్టుకుని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. కానీ దానిగురించి ఇప్పుడు మాట్లాడటం అంటే భవిష్యత్తులోనూ తమను ఎవరూ ప్రశ్నించవద్దన్నట్టుగా, వ్యతిరేకంగా మాట్లాడవద్దన్నట్టుగా షా మాటల్లో తెలుస్తోంది. న్యాయమూర్తిని కమ్యూనిస్టులకు లింకు పెట్టి మాట్లాడటం సరికాదు.

### న్యాయవ్యవస్థను బలహీనపరిచినట్టే

**ప్రొఫెసర్ హరగోపాల్**



అమిత్ షా అలా అనాల్సింది కాదు. ఒకవిధంగా ఆ వ్యాఖ్యలు న్యాయ వ్యవస్థను బలహీనపరిచినట్టే. ఈ ధోరణితో రాజ్యాంగం మీద ప్రజలకు నమ్మకం పోతుంది. ఇది ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ఏమాత్రం మేలు చేయదు. జడ్జీకి వ్యక్తిగత ఎజెండా ఉంటుందని చెప్పడమంటే వాళ్ల సర్కారుకే నష్టం. ఎందుకంటే.. రేపు వాళ్లు కూడా న్యాయవ్యవస్థపై ఆధారపడాల్సి వస్తుంది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి కూడా వ్యక్తిగా ఇచ్చిన తీర్పు కాదది. సుప్రీంకోర్టు జడ్జిమెంట్.

### అబాంధాలు వేసేందుకు సంకేతాలిచ్చారు

**కె శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ అకాడమీ ఛైర్మన్**



జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై వ్యాఖ్యలు చేసిన అమిత్ షాకు రాజ్యాంగం పట్ల, న్యాయవ్యవస్థ పట్ల ఎంత గౌరవ ముందో అర్థమైంది. పార్లమెంట్‌లో మాజీ న్యాయమూర్తి పేరు ప్రస్తావించడంతో ఇకముందు నచ్చనివారిపై అబాంధాలు వేయడానికి, విమర్శించడానికి కేంద్ర హోం మంత్రి సంకేతాలిచ్చారు. ఊహించనిస్థాయిలో అమిత్ షా కిందికి దిగజారిపోయారు.

### ఆ తీర్పును షా అర్థం చేసుకోలేదు

**రామచంద్రమూర్తి, సీనియర్ పాత్రికేయులు**



జస్టిస్ సుదర్శన్ రెడ్డి మీద అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ తప్పే. ఆయన రాజకీయ నాయకుడు కాదు. రాజ్యాంగ విలువలకు కట్టుబడిన న్యాయమూర్తి. సల్వాజుడుం తీర్పును షా సరిగ్గా అర్థం చేసుకోలేదు. రాజ్యాంగాన్ని, న్యాయ స్థానాలను అవమానపరిచేలా మాట్లాడితే ప్రజలకు కూడా విశ్వాసం సన్నగిల్లుతుంది.

### ఇలాంటిది చరిత్రలో ఎక్కడా లేదు

**కె శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు**



సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఇచ్చిన తీర్పును ప్రభుత్వంలో ఉన్నవారు తప్పు బట్టడం చరిత్రలో ఎక్కడా లేదు. ఇందిరాగాంధీ మీద కేసు కొట్టేసిన న్యాయమూర్తిని కూడా ఎవరూ నిందించలేదు. కానీ కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయడానికి న్యాయమూర్తిని ముందుకు తీసుకురావడం అన్యాయం. ఇందిరాగాంధీ హయాం నుంచి ఇప్పటివరకు అందరూ నక్సలిజంతో కలిసి నడుస్తున్నారని చెప్పడం అమిత్ షా ఉద్దేశంగా తెలుస్తోంది. నిజానికి సల్వాజుడుం రద్దు మంచితీర్పుల్లో ఒకటి. సుదర్శన్ రెడ్డిపై భారతదేశ ప్రజలకు చాలా గౌరవం ఉంది. ఇప్పటి పాలకులు గత చరిత్రనంతా మార్చేస్తున్నారు కాబట్టే.. ప్రజానుకూలంగా ఉన్న న్యాయమూర్తులపై బురద జల్లుతున్నారు.

### వాళ్ల ప్రాణాలంటే లెక్కలేదా?

**సంధ్య, పీఓడబ్ల్యూ**



ఆపరేషన్ కగార్ తర్వాత జరగాల్సిన 'ఆపరేషన్లన్నీ' గుర్తొచ్చేలా అమిత్ షా మాట్లాడారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి.. సల్వా జుడుం చట్ట విరుద్ధమనే చెప్పారు. ఆపరేషన్ కగార్‌లో అనేక మందిని చంపితే వాళ్ల ప్రాణాలకు విలువ లేదా? చత్తీస్‌గడ్, బస్తర్ వంటి అటవీ ప్రాంతాల్లో సర్కారు భద్రతా దళాలు అనేకమంది అత్యాచారాలు చేశాయి. వాటిపై కేసు ఎందుకు పెట్టలేదు? ఎవరు ఎవరి ప్రాణాలు తీస్తున్నారో ముందు చెప్పాలి. చనిపోయిన జడ్జీల మీద కూడా కక్ష తీర్చుకుంటున్నారు. సల్వాజుడుం రద్దు చేసిన న్యాయమూర్తిని విమర్శిస్తున్నారుగానీ.. మరి కాంగ్రెస్ హయాంలో ఏర్పాటుచేసిన ఆ వ్యవస్థ సరైందేనా..?

### స్పష్టంగా న్యాయవ్యవస్థపై దాడే..

**ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సామాజిక విశ్లేషకులు**



తీర్పు అమలైన 15 ఏళ్ల తర్వాత కేంద్ర మంత్రి నోరుపారేసుకోవడం ఆయన దిగజారుడుతనమే. సల్వాజుడుం రద్దు తీర్పు ఓ కీలక మలుపు. ఇది పౌర హక్కుల పరిరక్షణగానూ, మానవీయ కోణంలోనూ ఆమోదయోగ్యమైంది. రాజ్యాంగాన్ని కాపాడేందుకు దిశానిర్దేశం చేసిన జడ్జిమెంట్. రాజ్యం బాధ్యతను ఔట్‌సోర్స్ చేయొద్దని నొక్కివక్కాణించిన తీర్పు. దీనిపై అమిత్ షా బాధ్యత లేకుండా మాట్లాడటం అన్యాయమైన పద్ధతి. బీజేపీ, అమిత్ షా అహంకారానికి ఇది అద్దం పడుతోంది.

### వ్యక్తిగతంగా దాడిచేయడం అన్యాయం

**నారాయణ రావు, పౌరహక్కుల నేత**



సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తప్పుబట్టడం ఏమిటి? ఎన్నో తీర్పులు వస్తుంటాయి.. కానీ ఈ ఒక్క తీర్పుపైనే మాట్లాడటం, జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై వ్యక్తిగతంగా దాడిచేయడం అన్యాయం. ద్విసభ్య ధర్మాసనం తీర్పుపై ఏమైనా అభ్యంతరాలుంటే అంతకంటే ఎక్కువ సభ్యులున్న ధర్మాసనాన్ని ఆశ్రయించవచ్చు. కానీ ఒక న్యాయమూర్తిని పదేపదే విమర్శించడం సరైంది కాదు.

### రాజ్యాంగాన్ని అవమానపరచడమే..

**విరాహత్ అలీ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు**



జస్టిస్ సుదర్శన్ రెడ్డికి దేశంలోనే మంచి పేరుంది. రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, ప్రజా స్వామ్యాన్ని కాపాడుతూ ఆయన తీర్పులు చెప్పారు. అటువంటి వ్యక్తిని లోక్‌సభలో దూషించడం అమిత్ షా స్థాయిని తెలియజేస్తోంది. కేంద్ర హోం మంత్రే ఈ స్థాయిలో న్యాయవ్యవస్థను అవమానపరచడం అంటే చట్టాల్ని అగౌరవపరచడమే.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370